
₹ 10/-

జన రాజకీయం కోసం...

# లోక్‌సత్తా టైమ్స్

సంపుటి- 8 సంచిక - 7
పక్షపత్రిక ఏప్రిల్ 1-15, 2017




'రోబో' రాజకీయ నాయకులు'
లోక్‌సత్తా నాటి హెచ్చరికను
నేడు ధృవీకరించిన లండన్ సర్వే








గ్రామస్వరాజ్యం
గుడ్లవల్లేరులో
కనిపిస్తోంది

## డియర్ ప్రధానీ ! అవినీతి నిర్మూలనకు మాటలు చాలవు, ఈ చేతలు చేపట్టండి

OSMANIA UNIVERSITY
100 YEARS
Centenary Celebrations
1917-2017

## ఉస్మానియా 'వందేళ్ల' పండుగ



# అంబేద్కర్‌కి నిజనివాళి ఈ ఆలోచనల ఆచరణే: జేపీ

- పుట్టుకతో వివక్షను తొలగించేందుకు ప్రతి బిడ్డకూ నాణ్యమైన విద్యను అందించే వ్యవస్థను నిర్మించటం.
- బంద్‌లు, రాస్తారోకోలు,ఆమరణ నిరాహారదీక్షలు వంటి వలస పాలననాటి పద్ధతుల ద్వారా కాకుండా - స్వతంత్ర భారత రాజ్యాంగం ఆయుధంగా పాలకుల విధానాలపై పోరాటం.
- కులం గుర్తులైన చౌదరి, రెడ్డి, నాయుడు, వర్మ, యాద్, గౌడ్ లాంటి పదాల్ని పేర్లలో నుంచి తొలగించటం
- కులాంతర, మతాంతర వివాహాలను మన ఇళ్ళల్లో ఆచరించి చూపటం
- కులం, మతం, ప్రాంతం, భాషతో సంబంధం లేకుండా సామర్థ్యాన్ని, విలువల్ని బట్టి మనిషిని అంచనా వేసే జాతి నిర్మాణం చేయటం

ఏప్రిల్ 14 బాబాసాహెబ్ జన్మదినోత్సవం

జన రాజకీయం కోసం...

# లోక్‌సత్తా టైమ్స్

పక్షపత్రిక ఏప్రిల్ 1-15, 2017

సంపుటి - 8 సంచిక - 7

## లోపలి పేజీల్లో...

డియర్ ప్రధానీ ! అవినీతి .................. 5

నైతికతతోనే అవినీతిని ఆపలేం........... 8

లంచగొండి వ్యవస్థలో ..................... 11

అమ్మచెట్టు ఉస్మానియా..................... 14

తప్పదన్నట్టు తయారుచేసినట్టుంది....... 17

ఆరోగ్యానికి హామీ మాత్రమే................ 18

భారత ప్రజారోగ్యం... ఇంత అనారోగ్యం.20

ప్రజారోగ్యానికి పట్టం కడుతున్న బ్రిటన్... 22

ఆంధ్రప్రదేశ్ బడ్జెట్ 2017-18............ 24

తెలంగాణ బడ్జెట్ 2017-18............ 27

బడ్జెట్‌కూ కుల రంగా? ......................30

రోబో రాజకీయ నేతలకు బ్రిటన్ సై........ 31

గ్రంథాలయాల డబ్బు ఎగ్గొడుతున్న........ 32

పౌరసేవల చట్టంతోనే ఆరోజువారీ ...... 33

దేశం చర్చించాలి : జేపీ ..................... 34

## సంపాదక వర్గం

**డా॥ జయప్రకాష్ నారాయణ్**

ప్రధాన సంపాదకులు

### సంపాదక వర్గం

బండారు రామ్మోహన్‌రావు

డా॥ ఆలూరి విజయలక్ష్మి

కె.వి. కుటుంబరావు

బుక్ & కవర్ డిజైన్ : సునీత ఆరిమిల్లి


# సూచీల సూచీ!



ఏ పని చేసినా సుఖసంతోషాలతో జీవించటమే మనందరి లక్ష్యం! ఎక్కువమంది ప్రజలను ఎక్కువశాతం సంతోషంగా ఉండేలా చేయగలిగేది రాజకీయం కాబట్టే.. 'మంచి రాజకీయాన్ని మించిన పవిత్ర వ్యాసంగం మనిషి జీవితంలో లేదు' అని లోక్‌సత్తా పేటెంట్ కొటేషన్‌లా చెబుతుంటుంది. కానీ ఇటీవల మనం ఎంతో రాజకీయ స్థిరత్వం సాధించామనుకుంటున్నా ప్రపంచ సంతోష సూచీల్లో మాత్రం వెనక్కిపోతున్నాం. గత ఏడాదిలాగే ఈ ఏడాది కూడా ఇతర దేశాల కంటే ఇంకా వెనక్కి వెళ్లి సంతోషంలో 122వ ర్యాంకును సాధించాం. ఆరోగ్యకర జీవనప్రమాణాలు, తలసరి స్థూలజాతీయోత్పత్తి, స్వేచ్ఛ, సామాజిక భద్రత, అవినీతిరాహిత్యం.. ఇలా మనం రాజ్యాంగంలో రాసుకుని, ఎన్నికలలో, పాలనలో తరచూ చాటుకునే విషయాలే తప్ప ప్రత్యేకించి విదేశీ విషయాలేవీ ఈ ర్యాంకుల ఎంపికకు కొలమానాలుగా లేవు. ఈ ఒక్క సూచీయే కాదు.. ప్రజల జీవితాలలో అభివృద్ధికి సంబంధించిన చాలా సూచీల్లో మనం (సర్వే లెక్కింపుల్లోని లోపాలు, మన జనాభా, సంక్లిష్ట భిన్నత్వం వంటి సంజాయిషీలతో తప్పించుకోలేంత) అట్టడుగున ఉన్నాం. దాదాపు అన్ని కీలక సూచీలూ మన రాజకీయ, విధాన వైఫల్యాలపై హెచ్చరికల్నే చేస్తున్నాయి. సంతోష సూచీలో మొదటి 10 ర్యాంకులలో ఉన్న నెదర్లాండ్స్ తదితర ఐరోపా దేశాలలో కూడా ఏదోక అశాంతి ప్రబలుతోంది. ఇంత సంతోషమున్నా ఇంకా ఏదో ఒక పెద్ద లక్ష్యం దిశగా కొత్త ఆలోచనలతో నడిపించే నాయకులు కావాలని వాళ్లు ఉవ్విళ్లూరుతున్నారు. అలాంటి నాయకత్వ కొరత వల్లే అక్కడ సంక్షోభాలు ఏర్పడుతున్నాయన్న చర్చ జరుగుతోంది. కానీ ఆ దేశాలకంటే కీలక ప్రమాణాలలో అనేకరెట్లు వెనకబడి వున్న మనదేశంలో కనీసస్థాయి లక్ష్యాల దిశగానైనా ఆలోచనలు, చర్చ చేయని దుస్థితి! అవినీతిపై డాంబికాలు, నినాదాలు, డ్రామా తప్ప, అవినీతి అంతానికి చట్టపరంగా ఆస్తుల జప్తు వంటి కఠిన చర్యలు, పౌరసేవల చట్టం వంటి ప్రాథమిక ఏర్పాట్లు కూడా చేయలేకపోయాం. తలసరి ఆదాయం రూ.లక్షల్లో కనిపిస్తుంటుందిగానీ పల్లెల్లో సాధారణ రైతు నెలసరి ఆదాయం రెండు వేలు లోపే. గుంతలు తవ్వటం, పూడ్చటం వంటి రోజువారీ పనులు చేయటాన్నే గొప్ప ఉపాధి కార్యక్రమంగా చెప్పుకుంటాం. స్వేచ్ఛగా ఏదైనా చేసుకోమంటాంగానీ.. ఏ తల్లి గర్భాన పుట్టావు అనే దాన్ని బట్టే కోట్ల మంది బిడ్డల భవిష్యత్తును నిర్ణయిస్తుంటాం. వివక్ష లేకుండా మంచి జీవనప్రమాణాలు అందుకోవటానికి కావలసిన నాణ్యమైన చదువు, ఆరోగ్యం అందించంగానీ, ఎన్ని లక్షల కోట్లు విదిల్చి అయినా పేదరికాన్ని కొనసాగించే రుణమాఫీలు వంటి పథకాలను కొనసాగిస్తుంటాం. జనాన్ని కులం, మతం చుట్టూ తిప్పుతూ సామాజిక అభద్రతను రెచ్చగొట్టి ఓట్లు పిండుకుంటుంటాం. దేశంలో అవకాశాల్ని చేజిక్కించుకున్న ఇరవై శాతం మందికి లాభం వచ్చే అవకాశమున్న సంస్కరణలు మాత్రం వేగంగా అమలవుతున్నాయి. ఎందుకంటే, వాళ్లు తమ ప్రయోజనాన్ని వెంటనే పసిగట్టి చొరవ చూపుతున్నారు. కానీ అదే పని అత్యధిక శాతం ప్రజలు అవిద్య, పేదరికం వల్ల చేయలేకపోతున్నారు. పార్లమెంటులో ఒక్క సభ్యుడూ లేకపోయినా అధికారంలో ఉన్నవారి కంటే మిన్నగా లోక్‌సత్తా ఎన్నో గొప్ప చట్టాలను, రాజ్యాంగ సవరణల్ని సాధించినా క్షేత్రస్థాయిలో అన్నీ పెద్ద ఫలితాలు సాధించినట్టు కనిపించకపోవటానికి కూడా కారణం ఇదే. లోక్‌సత్తా కృషి వల్ల 2జీ స్పెక్ట్రం అక్రమ లైసెన్సులు రద్దవటంతో పాటు ప్రకృతి వనరుల కేటాయింపులో వేలం పద్ధతి వచ్చి దేశ ఖజానాకు రూ.లక్షల కోట్లకఆదాయం సమకూరింది. ఈ సంస్కరణ ప్రయోజనాన్ని గుర్తించిన శక్తులు వెంటనే స్పందించటం వల్ల ఫలితం స్పష్టంగా కనిపించింది. అలాగే పెట్రోల్ బంకుల్లో తూనికల మోసాల్ని అడ్డుకోవటం వల్ల కూడా ఫలితం స్పష్టంగా తెలిసింది. కానీ అదే పేదలకు తేలిగ్గా, చౌకగా న్యాయం అందించటం కోసం స్థానిక న్యాయస్థానాల చట్టాన్ని 2008లోనే లోక్‌సత్తా సాధించినా ఇప్పటికీ అక్కడక్కడానే ఏర్పడ్డాయి. దేశంలో కేసుల విచారణలో జాప్యం పెద్ద అన్యాయమని చెప్పే సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తులు.. స్థానిక న్యాయస్థానాల ఏర్పాటుకు ఎందుకు చొరవ చూపరు? అని ప్రజలు ప్రశ్నించలేకపోతున్నారు. ఉన్నత న్యాయమూర్తులు అప్రజాస్వామికంగా తమను తాము నియమించుకోకూడదనే లక్ష్యంతో లోక్‌సత్తా సాధించిన జాతీయ న్యాయ నియామకాల కమిషన్ (ఎన్‌జేపీసీ)ని సుప్రీంకోర్టు కొట్టివేసినా ప్రజల్లో ఆందోళన లేదు. తమ జీవితాలను ఎంతో మెరుగుపరిచే సహకార సంఘాల స్వయంప్రతిపత్తి (97వ రాజ్యాంగ సవరణ) అమలు కోసం సమాజం నుంచి తగినంత చొరవ లేదు. దేశంలో అవకాశాలు పొందిన పైస్థాయిలోని ఇరవై శాతం మంది తక్షణ ప్రయోజనాలు వీటిలో లేకపోవటం, దిగువస్థాయి 80శాతానికి తమ ప్రయోజనాలు అర్థం కాకపోవటం, ప్రజల కంటే నలభై అడుగులు కాదు, నాలుగడుగులే ముందుండాలనుకునే నాయకులు, మేధావుల వల్ల ఈ పరిస్థితి నెలకొంది. ఈ తీవ్ర వైఫల్యాన్ని సరిచేస్తేనే దేశం అభివృద్ధి, సంతోష సూచీల్లో పైస్థాయికి చేరుకోగలుగుతుంది. ఇందుకోసం విద్య, ఆరోగ్యం, అవినీతి నిరోధానికి చట్టపరమైన ఏర్పాట్లు వంటి ఆచరణాత్మక చర్యలతోపాటు స్థానిక ప్రభుత్వాలకు తగిన నిధుల్ని, అధికారాల్ని ఇవ్వాలి. స్థానిక సాధికారత వల్ల తొలిదశలో కొన్ని వైఫల్యాలు చోటుచేసుకోవచ్చు. కానీ జనం నేర్చుకుంటారు. తమ జీవితం, తమ ప్రయోజనం అర్థమై సంస్కరణల్ని సాధించుకోగలుగుతారు. భారతదేశంలో గొప్ప మార్పుల్ని తెస్తున్నానంటున్న మోదీ.. ఈ సూచీల సూచనల్ని, ఎన్ని ఉన్నా కొత్త ఆలోచనల కోసం అర్రులు చాస్తున్న దేశాల తీరును అధ్యయనం చేయాలి. ఎన్నికలే ప్రజాస్వామ్యం కాదని గుర్తించి పౌరసమాజ హేతుబద్ధ ఆలోచనలకూ చోటివ్వాలి. నల్లడబ్బు, అవినీతి నిర్మూలనకే పెద్ద నోట్ల రద్దు (డీమానిటైజేషన్) చేశామని చెప్పినా ఉత్తర ప్రదేశ్ ఎన్నికల్లో నల్ల డబ్బు ప్రవహించటాన్ని గుర్తించాలి. నల్లడబ్బుకు మూలమైన ఎన్నికల వ్యయం ఏమాత్రం తగ్గలేదని ఎటువంటి అధికారాలూ లేని ఎమ్మెల్సీ పదవులకు బీజేపీ మిత్ర పక్షం అధికారంలో ఉన్న ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన తాజా ఎన్నికలు కూడా రుజువు చేశాయి. ఎంపీగా ఉన్న యోగి ఆదిత్యనాథ్‌ని యూపీ ముఖ్యమంత్రిగా నియమించటం వంటి చర్యలతో ఇప్పటికీ తన ఎన్నికల విజయాన్ని సరిగా అర్థం చేసుకోలేదన్న సంకేతాలనిస్తున్న మోదీ.. తన అరచేతిలో అవకాశం ఉన్నప్పుడే అవినీతిరహిత నూతన భారతదేశ నిర్మాణం కోసం ఎన్నికల సంస్కరణల్ని ప్రారంభించాలి.

మీ

(సంతకం)




# కార్టూన్ కార్నర్

## రచనలు పంపండి

'లోక్‌సత్తా టైమ్స్' పత్రికలో ప్రచురణ కోసం వ్యాసాలు, గేయాలు, కార్టూన్‌లు, ఉత్తరాలు ఈ కింది చిరునామాకు పంపండి.

**ఎడిటర్, లోక్‌సత్తా టైమ్స్,**
తులిప్స్ అపార్ట్‌మెంట్స్
6-3-655, ఫ్లాట్ నెం. 407
సివిల్ సప్లయిస్ ఆఫీస్ వెనుక
సోమాజిగూడ, హైదరాబాద్ - 500 082

**ఫోన్ : 040-23310288**
**ఫోన్ / ఫ్యాక్స్ : 040-23311816**

accountsdept@loksatta.org
loksattatimeslsp@gmail.com

## చందా వివరాలు

జన రాజకీయ వాణి 'లోక్‌సత్తా టైమ్స్' పత్రిక చందాదారులుగా చేరండి... చేర్పించండి. సంప్రదించవలసిన ఫోన్ నం: **040-23311816**

విడి ప్రతి : రు. 10 ,
ఏడాది చందా : రు. 200
మూడేళ్ళ చందా : రు. 500

చందా రుసుమును "లోక్‌సత్తా టైమ్స్" ఎకౌంట్ నం: 62007167836 ఎస్.బి.హెచ్., పంజాగుట్ట బ్రాంచ్, హైదరాబాద్ పేరిట ఆన్‌లైన్ క్రెడిట్ చేసి వివరాలను ఇ-మెయిల్ చెయ్యవచ్చు.

## లోక్‌సత్తా ప్రకటన రేట్లు

| | బ్లాక్ & వైట్, | మల్టీకలర్ |
|---|---|---|
| సగం పేజీ | ₹ 2,500 | |
| పూర్తి పేజీ | ₹ 5,000 | ₹ 10,000 |
| సెంటర్ స్ప్రెడ్ | ₹ 10,000 | ₹ 20,000 |
| బ్యాక్‌పేజి | - | ₹ 20,000 |
| ఫ్రంట్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |
| బ్యాక్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |

♦ ప్రకటన రుసుము Loksatta Times పేరిట హైదరాబాద్‌లో చెల్లుబాటు అయ్యే విధంగా చెక్/డిడి రూపంలో పంపగలరు.

# డియర్ ప్రధానీ! అవినీతి నిర్మూలనకు మాటలు చాలవు, ఈ చేతలు చేపట్టండి: మోదీకి జేపీ అప్పీల్



**1. రోజువారీ పనులకు ప్రభుత్వ కార్యాలయాల్లో లంచాలు**

**సమస్య**

ప్రజాస్వామ్యంలో ప్రభువులైన ప్రజలకు ప్రభుత్వాలు రోజువారీ అందించాల్సిన సేవలు మనదేశంలో అధ్వాన్నంగా ఉన్నాయి. మన మౌలికవసతులు, తాగునీరు, పారిశుద్ధ్యం, మురుగునీటి పారుదల, విద్య, ఆరోగ్యం.. ఏవీ నాగరిక ప్రపంచస్థాయికి సరితూగవు. విశ్వసనీయతలేనివి, నాసిరకమైనవి. వీటికితోడు ప్రతి చిన్న పనికీ.. హక్కుగా అందాల్సిన ప్రతి ప్రభుత్వ సేవకీ కూడా ప్రజలు లంచం ఇవ్వాల్సి వస్తోంది. ఈ లంచం ఇవ్వకపోతే ఆలస్యాలు, వాయిదాలు, మళ్లీ మళ్లీ తిరగటాలు, వేధింపులు, అవమానాలు, తిరస్కారాలు తప్పవు. రేషన్ కార్డు, జనన ధ్రువపత్రం, ఆదాయ లేదా కుల ధ్రువపత్రం, భూముల రికార్డులు, సేల్‌డీడ్ రిజిస్ట్రేషన్, నీటి కనెక్షన్, విద్యుత్ కనెక్షన్ వంటివి చాలా సందర్భాల్లో లంచం ఇవ్వకుండా రావు.

**ప్రభుత్వం తీసుకోవాల్సిన చర్య**

'పౌర సేవల' చట్టం

ప్రతి ప్రభుత్వ సేవకీ నిర్ణీత గడువుని పెట్టి, అది దాటాక ఆలస్యం జరిగితే రోజుకు కొంత డబ్బుని పరిహారం కింద దరఖాస్తుదారులైన ప్రజానీకానికి హక్కుగా అందించే పౌరసేవల (రైట్ టూ సర్వీసెస్/పబ్లిక్ సర్వీసెస్ గ్యారంటీ) చట్టాన్ని గనక వెంటనే అమలుచేస్తే, తాము కట్టిన పన్నులకు తగ్గ సేవలు అందుతున్నాయని పౌరుల్లో సంతృప్తి పెరిగి, స్వచ్ఛందంగా పన్నులు చెల్లిస్తారు. ప్రజలకు, ప్రభుత్వానికీ మధ్య పరస్పర విశ్వాసం పెరుగుతుంది. ప్రభుత్వ కార్యాలయాల్లో సేవలను సక్రమంగా అందించకపోవడం వల్ల ఎక్కువగా నష్టపోతున్నది పేద, మధ్యతరగతి వారే కాబట్టి.. హక్కుగా పౌరసేవల చట్టం వల్ల అదనపు ఖర్చు లేకుండానే ఈదేశంలోని అత్యధిక శాతం ప్రజలకు రోజువారీ బలవంతపు లంచాల భారం లేకుండా చేసి వారి జీవితాల్ని మెరుగుపరచవచ్చు.

**2. ప్రభుత్వ కార్యాలయాల్లో భారీ అవినీతి**

**సమస్య**

ఒక్కసారి పౌరసేవల గ్యారంటీలతో చిన్నస్థాయి అవినీతిని తగ్గించి, స్థానికానికి పరిమితం చేశాక.. అధికారానికి జవాబుదారీతనాన్ని జోడించటం, లాలూచీతో చేసే భారీ అవినీతిని నిరోధించటం సమస్యలుగా మిగిలివుంటాయి. భారీ అవినీతిలో, లంచం ఇచ్చేవారు, లంచం పుచ్చుకునేవారు ఇద్దరూ ప్రజలను మోసం చేస్తూ పోటీని తగ్గించి ప్రభుత్వ ఖజానాకు నష్టం కలిగిస్తుంటారు. ప్రకృతి వనరుల్ని దోచుకుంటూ ప్రజా ప్రయోజనాల్ని, ప్రజలకు అందాల్సిన సేవల్ని కొల్లగొడుతూ పర్యావరణానికి కూడా హానిచేస్తుంటారు. ఈ లాలూచీ అవినీతిని వేగంగా, కఠినంగా నిర్మూలించకపోతే, ఇది నగదు నుంచి స్థిర, ఇతర ఆస్తులుగా, విదేశీ ఎకౌంట్లలో డిపాజిట్లుగా మారిపోయి అవినీతికి రాచమార్గంగా తయారవుతుంది. ఈ భారీ, లాలూచీ అవినీతిని నిరోధించడానికి మూడు ఆచరణాత్మకమైన చర్యలు అవసరం.

**ప్రభుత్వం తీసుకోవాల్సిన చర్య**

ఎ) అవినీతి నిరోధక చట్టంలో ప్రతిపాదించిన మతిలేని సవరణల్ని ఉపసంహరించుకోవాలి. తమకు హక్కుగా అందాల్సిన సేవల కోసం గతిలేక బలవంతంగా లంచాలిచ్చే సామాన్య పౌరులకు కూడా 3 ఏళ్ల జైలు శిక్షను ఈ సవరణల్లో తప్పనిసరి చేశారు. మరోవైపు, లంచం తీసుకునేవారిపై పై నుంచి కిందిస్థాయి వరకు కనీసం పోలీసు దర్యాప్తు చేయాలన్నా ముందస్తు అనుమతి కావాలన్నారు. బాధిత ప్రజలకు శిక్ష, లంచగొండులకు రక్ష అన్న ఈ సవరణల్ని తొలగించి.. హక్కుగా అందాల్సిన సేవలకు బలవంతంగా లంచం ఇచ్చే పౌరులకు పూర్తి రక్షణ ఇవ్వాలి. ఉద్దేశపూర్వకంగా చేసే దర్యాప్తులకు అవకాశం లేకుండా ప్రభుత్వ స్థాయిలో విధానపరమైన అంశాల్లో మాత్రమే ప్రభుత్వోద్యోగులకు రక్షణ కల్పించాలి. ప్రభుత్వ విధానాలకనుగుణంగా సదుద్దేశంతో తీసుకున్న నిర్ణయాలలో ఉద్యోగులను ఇరికించకూడదు.

బి) తీవ్ర అవినీతి, అధికార దుర్వినియోగానికి పాల్పడిన అధికారుల్లో కనీసం ఓ 1000మందికి తప్పనిసరి రిటైర్‌మెంట్ ఇచ్చి ఇంటికి పంపించాలి. వ్యవస్థలోని రాజకీయ నాయకులు, అధికారులు, మీడియా, వాణిజ్యవేత్తలు అందరికీ తెలుసు అవినీతిపరులు ఎవరు అనేది. కానీ మౌనం వహిస్తుంటారు. 50 ఏళ్ల వయసు లేదా 25 ఏళ్ల సర్వీసు అనంతరం ఎటువంటి కారణం లేకుండా వారి చేత పదవీవిరమణ చేయించే అధికారం ప్రభుత్వానికి ఉంది. ఈ చర్య సరైన, బలమైన సంకేతం ఇవ్వాలంటే.. దేశానికి నష్టం చేసిన అత్యంత అవినీతిపరుల్ని ఎటువంటి భయం, పక్షపాతం, ద్వేషం లేకుండా ప్రభుత్వం గుర్తించాలి. తన నిర్ణయాల్లో పూర్తి న్యాయబద్ధంగా, నిష్పాక్షికంగా ఉండాలి. లేకుంటే, దీనివల్ల మంచి కంటే చెడు ఎక్కువ జరుగుతుంది.

సి) స్మగ్లింగ్, విదేశీ మారక ద్రవ్య అక్రమాలకు పాల్పడేవారిని కట్టడి చేయడానికి 1976లో రూపొందించిన 'సఫెమ' (ఎస్ఎఎఫ్ఈఎంఎ) తరహాలో అవినీతిని నిరోధించడానికి చట్టం తీసుకురావాలి. 1988లో సుప్రీంకోర్టు కూడా ఇదే మాట చెప్పింది. అవినీతిని అంతం చేయడానికి ఇటువంటి చట్టం అవసరమని అత్యున్నత న్యాయస్థానం విస్పష్టంగా సూచించింది. ఈ చట్టంలో మూడు కీలక ఏర్పాట్లు ఉండాలి– బినామీ ఆస్తులు సహా మొత్తం ఆస్తుల్ని స్వాధీనం చేసుకోవడం, 15 ఏళ్లు లేదా ఇంకా ఎక్కువ జైలు తప్పనిసరి చేయడం, ప్రాథమిక సాక్ష్యం ఉంటే నిర్దోషిత్వాన్ని నిరూపించుకోవాల్సిన బాధ్యతను నిందితుని మీదకే మళ్లించటం.

**3. రాజకీయ అవినీతి**

**సమస్య**

మన దేశానికి ఎంతో ఘనచరిత్ర, రాజకీయ నేపథ్యం ఉండవచ్చు. కానీ ఒక్క ఓటు ఎక్కువ వస్తే ఆ అభ్యర్థి మాత్రమే విజేత, మిగిలినవారంతా ఓడిపోయినట్టే అనే ఫస్ట్–పాస్ట్–ది–పోస్ట్ (ఎఫ్‌పిటిపి) ఎన్నికల వ్యవస్థలో గెలుపునకు కీలకమైన కాసిని అదనపు ఓట్ల వేట.. ఇప్పుడు మన పేదదేశంలో ఓట్ల కొనుగోలుకు మూలంగా ఉంది. గెలుపునకు కావలసిన ఆ కొద్ది ఓట్ల కోసం.. ప్రధాన పోటీదారుల్లో చాలామంది అభ్యర్థులుగా, పార్టీలుగా విచ్చలవిడి ఓట్ల కొనుగోలుకు పాల్పడుతున్నారు. ఎంత ఖర్చు చేసినా గెలుపునకు గ్యారంటీ ఉండదుగానీ, ఎన్నికలలో బలమైన అభ్యర్థిగా పోటీలో ఉండాలంటే, భారీయెత్తున లెక్కలు చూపని డబ్బు ఖర్చు చేయటం కనీస అర్హతగా మారింది. ఈరకంగా, రాజకీయ విజయానికి డబ్బు గ్యారంటీ ఇవ్వకపోయినా, ఓ తప్పనిసరి ప్రవేశ రుసుముగా మారి నిజమైన రాజకీయ పోటీని, రాజకీయాలలో ఆరోగ్యకర ప్రోత్సాహకాల్ని ఛిన్నాభిన్నం చేసి అనర్హులను, తప్పుడు వ్యక్తులను ప్రోత్సహించి ప్రజాసేవాభావంగల సమర్థ పౌరులను రాజకీయాలకు దూరం చేసింది. అవినీతి, దుష్పరిపాలన, అయినకాడికి దండుకుందామనే నిరాశావాదం.. అసమర్థతలమయమైన వ్యవస్థను సృష్టించింది.

**ప్రభుత్వం తీసుకోవాల్సిన చర్య**

'రాష్ట్రాల్లో దామాషా ఎన్నికల' పద్ధతి

ఒక రాష్ట్రంలో ఓ పార్టీకి వచ్చిన ఓట్ల వాటాను బట్టి సీట్లను కేటాయిస్తే (దామాషా ఎన్నికల పద్ధతి) గెలుపు కోసం అదనపు ఓట్లు ఇక కీలకం అవ్వవు. ఒక్క ఓటుతో గెలిచినవారిదే విజయం అవదు. ఓట్ల కొనుగోలుకు బరితెగింపు, వెంపర్లాట ఉండవు. నైతిక పౌరబృందాలకు, పార్టీలకు అవకాశాలు ఉంటాయి. పాలనలో ఏకాభిప్రాయ సాధన తప్పనిసరి అవుతుంది. అన్ని రకాల భావాలకూ ప్రాతినిధ్యం లభిస్తుంది. నైతిక రాజకీయాలు, నిజమైన ప్రజాసేవాభావం గల వారు పార్టీలకు ఓ బలహీనతలా కాకుండా బలంగా మారతారు.

దామాషా ఎన్నికల పద్ధతి (పి.ఆర్)లో రకరకాల నమూనాలున్నాయి. కానీ రాష్ట్రాల్లో కనీస స్థాయి ఓట్ల శాతం ప్రాతిపదికగా సీట్ల కేటాయింపు చేయటం, ప్రజలకు, వారి ప్రజాప్రతినిధులకు సంబంధం కొనసాగడానికి బహుళ సభ్యత్వ నియోజకవర్గాలను ఏర్పాటు చేయటం భారతదేశ పరిస్థితులకు అత్యుత్తమ నమూనా.

అటువంటి పి.ఆర్ విధానాన్ని ప్రవేశపెట్టటం సాంకేతికంగా కూడా తేలిక. కేవలం చట్టంలో మార్పు చేస్తే చాలు. అయితే, కేంద్రంలో ఒక ప్రధాన పార్టీ ఎఫ్.పి.టి.పి విధానం ద్వారా లబ్ధి పొంది స్పష్టమైన మెజారిటీని సాధించింది కాబట్టి జాతీయ స్థాయిలో దీన్ని అమల్లోకి తేవటం ఇప్పటికిప్పుడు కష్టం కావచ్చు. అయినా, జాతీయస్థాయిలో రాజకీయ ఏకాభిప్రాయం కుదిరితే రాష్ట్రాల్లో దామాషా ఎన్నికల నమూనాను అమలు చేయవచ్చు. అసలైన రాజకీయాలు, పాలనా సవాళ్లు రాష్ట్రాల్లోనే ఉన్నాయి. బ్రిటన్ (యునైటెడ్ కింగ్‌డమ్)నే తీసుకుంటే, జాతీయ, రాష్ట్రాల స్థాయిల్లో ఒకేరకమైన ఎఫ్.పి.టి.పి ఎన్నికల నమూనా ఉండనక్కర్లేదని అర్థమవుతుంది. యు.కెలో దిగువసభను ఎఫ్.పి.టి.పి నమూనాలో ఎన్నుకుంటే, స్కాట్లాండ్, ఉత్తర ఐర్లాండ్, వేల్స్‌లోని ప్రాంతీయ పార్లమెంటుల్ని దామాషా పద్ధతిలో ఎన్నుకుంటారు. ఐరోపా పార్లమెంట్ సభ్యులు ఇప్పటి

వరకూ ఇలాగే ఎన్నికవుతున్నారు (బ్రెగ్జిట్ వాస్తవరూపం దాల్చేంతవరకు). అదేవిధంగా లండన్ మేయర్‌ని ప్రజలంతా ప్రత్యక్షంగా ఎన్నుకుంటారు.

కాబట్టి దామాషా ఎన్నికల పద్ధతి రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలకు పనికొచ్చే ఆచరణాత్మకమైన సంస్కరణ. రాష్ట్రాల్లో రాజకీయాలు, పాలన స్వభావాన్ని సమూలంగా మార్చగల సంస్కరణ. ప్రతి పౌరునీ ప్రభావితం చేసే పాలన రాష్ట్ర, స్థానిక స్థాయిల్లోనే ఉంది కాబట్టి, దీనికి సమూల పరివర్తనా శక్తి ఉంది. బహుళ సభ్యత్వ నియోజకవర్గాలకు రాజ్యాంగం వెసులుబాటు కల్పించింది కాబట్టి ఈ ఎన్నికల ఏర్పాటుని పార్లమెంటులో ఒక సాధారణ చట్టం తెచ్చి అమలుచేసేయొచ్చు.

## రాష్ట్రాల్లో ప్రత్యక్ష ఎన్నికలు

లోక్‌సభ, రాష్ట్రాల అసెంబ్లీలకు ఒకేసారి ఎన్నికల గురించి ఇప్పుడు విస్తృతస్థాయి చర్చ జరుగుతోంది కనుక, ఈ లక్ష్యాన్ని అమలు చేయటానికి రాష్ట్రాల్లో ప్రభుత్వాధినేతను ప్రత్యక్షంగా ప్రజలంతా కలిసి ఎన్నుకోవటం అత్యుత్తమ మార్గమవుతుంది. అధికారాల విభజన, నిర్ణీత పదవీకాలం, పోటీ పరిమితులు, అసెంబ్లీ వెలుపలి నుంచి కూడా సమర్థులను మంత్రివర్గంలోకి తీసుకునేందుకు ప్రభుత్వాధినేతకు స్వేచ్ఛ వంటివి ఈ ఏర్పాటులో భాగంగా ఉంటాయి. రాష్ట్రవ్యాప్తంగా ప్రజలంతా ఎన్నుకుంటున్నప్పుడు అభ్యర్థి ఓట్ల కొనుగోలును ఆ స్థాయిలో చేయటం దాదాపు అసాధ్యమవుతుంది. వచ్చే లాభం కంటే చేసే అక్రమ ఖర్చు అనేకరెట్లు ఎక్కువ ఉంటుంది కాబట్టి ఓట్ల కొనుగోలుతో పోటీకి సాహసం చేయరు. అప్పుడు నాయకులు, పార్టీలు ఓట్ల కొనుగోలుకన్నా వ్యక్తిత్వం, నిజాయతీ, గతంలో తాము చేసిన పనులు, అభ్యర్థి విశ్వసనీయత, ఎజెండా వంటి అంశాలకు ప్రాధాన్యం ఇస్తారు. అదేసమయంలో, ప్రభుత్వాధినేత (ముఖ్యమంత్రి) తన మనుగడ, పాలన కోసం శాసనసభలో మెజారిటీ మీద ఆధారపడాల్సిన అవసరం ఉండదు. ఫిరాయింపుల ద్వారానో, మరోరూపంలోనో ఎమ్మెల్యేలు తమ పదవిని అడ్డంపెట్టుకుని ప్రజాధనాన్ని దండుకునే అవకాశాలు ఉండవు (బదిలీలు, కాంట్రాక్టులు, ఇతర అనుచిత సహాయాల కోసం ప్రభుత్వాన్ని ఎమ్మెల్యేలు ఒత్తిడి చేయలేరు). కాబట్టి, ఓట్ల కొనుగోలు కోసం భారీ పెట్టుబడులు పెట్టటం ఎంతమాత్రం లాభసాటి అవదు. ఈరకంగా మొత్తం వ్యవస్థ విషవలయం నుంచి ఓ మేలిమి వలయంలోకి ప్రవేశిస్తుంది. నల్లడబ్బు, అవినీతి గణనీయంగా తగ్గుతాయి.

## జవాబుదారీతనం, సాధికారత ఉన్న స్థానిక ప్రభుత్వాలు

ప్రజలు తమ ఓటుకు–తమ జీవితాల్లో ప్రయోజనాలకు, పన్నులకు–సేవలకు మధ్య సంబంధాన్ని అర్థం చేసుకునేలా చేసేవి– సరైన నిర్మాణం, జవాబుదారీతనం ఉన్న స్థానిక ప్రభుత్వాలే (రెసిడెంట్స్ సంక్షేమ సంఘాలు– ఆర్‌డబ్ల్యుఏల తరహాలో). ఇలాంటి సాధికారత గల స్థానిక ప్రభుత్వాల్లో అధికారాన్ని జవాబుదారీతనంతో సంధానం స్పష్టంగా చేయొచ్చు. జవాబుదారీతనానికి కచ్చితమైన గీతలుంటాయి, బాధ్యతల నుంచి తప్పించుకుని కుంటిసాకులు చెప్పటానికి అవకాశముండదు. ఏడవ షెడ్యూల్‌లో పేర్కొన్న జాబితా ప్రకారం బాధ్యతల్ని బదిలీ చేసి స్థానిక ప్రభుత్వాలను నిజమైన మూడో అంచె ప్రభుత్వాలుగా గుర్తించి, రాష్ట్రాలతోపాటు ఆర్థిక సంఘం ద్వారా నిర్దిష్ట వాటా నిధుల్ని పంపిణీ చేస్తే మన ప్రజాస్వామ్యంలో పెద్దఎత్తున పరివర్తన చోటుచేసుకుంటుంది. ఓట్ల కొనుగోలు, నల్లధనం, అవినీతి బాగా తగ్గుతాయి. మేలిమి వలయం వేళ్లూనుకునేలోగా.. సర్వాంతరవ్యామిగా వున్న అవినీతి, దుష్పరిపాలన స్థానిక ప్రభుత్వాలను నాశనం చేయకుండా మనకు పటిష్టమైన, స్వతంత్ర ప్రతిపత్తిగల స్థానిక అంబుడ్స్‌మన్ కూడా ఉండాలి.

ఈ ఐదు మౌలికమైన సంస్కరణలు– హక్కుగా పౌరసేవలు, పన్ను రేట్లు–పాలన, రియల్ ఎస్టేట్, భారీ లాలూచీ అవినీతి, ఎన్నికల వ్యవస్థ– కూడా మనకు అందుబాటులో వున్న, మనం సాధించుకోదగ్గ లక్ష్యాలు. పెద్ద నోట్ల రద్దు (డీమానిటైజేషన్) కష్టమైన, భారీస్థాయి కార్యక్రమం. ప్రభుత్వం ఈ పెద్ద అడుగు వేసింది కాబట్టి, ఈ ప్రధాన సంస్కరణలను కూడా ప్రజలు స్వాగతిస్తారు. మనకు కావలసిందల్లా– లక్ష్యం పట్ల స్పష్టత, స్పష్టమైన వ్యూహం, స్వేచ్ఛా సమాజాలు ఎలా పనిచేస్తాయో లోతైన అవగాహన. ఈ సంస్కరణల్ని ప్రభుత్వంగనక ప్రతిపాదిస్తే, మొదటి నాలుగింటినీ తేలికగా, జనరంజకంగానే అమలు చేయవచ్చు. ప్రధానమైన రాజకీయ సంస్కరణకు ప్రజల మద్దతు, స్థూల ఏకాభిప్రాయ సాధనతో తగిన పరిస్థితుల్ని కల్పించవచ్చు. సమయం వృథా కాకుండా చూసుకోవటం ముఖ్యం. యథాతథవాదంతోనో, ఏకపక్ష వ్యవహారశైలితోనో ఈ వెలకట్టలేని అవకాశాన్ని దుర్వినియోగం చేస్తే.. సానుకూల మార్పునకు ఓ గొప్ప ఊపుని మళ్లీ చాలాకాలంపాటు సాధించుకోలేకపోవచ్చు!

(మోదీకి జేపీ అప్పీల్ ఆంగ్ల మూలాన్ని www.twitter.com/jp_loksatta, www.facebook.com/jploksatta లలో చూడవచ్చు) ❍

# నైతికతతోనే అవినీతిని ఆపలేం,
# వ్యవస్థీకృత పరిష్కారాలను జోడిస్తేనే నిర్మూలించగలం



*"ఏ సమాజంలో నీతి తప్పినవారు విజయం సాధిస్తారో*
*ఎక్కడ నేరస్తులు ఆరాధ్యులుగా మారతారో*
*ఎక్కడ విలువలు పతనమై అవకాశవాదం రాజ్యమేలుతుందో*
*ఎక్కడ అవినీతి సర్వత్రా తాండవిస్తున్నా కూడా పట్టించుకోకుండా*
*'తమకు కావలసిన' వాటా కోసం అత్యధికులు అర్రులు చాస్తుంటారో..*
*అక్కడ*
*వ్యవస్థకు సంబంధించిన పునఃసమీక్షకు సమయం ఆసన్నమైందని అర్థం..*
*అప్పుడు*
*తమ గురించి, తమకు సంబంధించినవారి గురించి*
*తమ చుట్టూరా వున్నవారి గురించి*
*తమ కార్యకలాపాలకు సంబంధించి*
*అక్కడి పౌరులు అంతర్ముఖులు కావాలి"*

... మనదేశంలోని చాలా ప్రాంతాల్లో ఇంకా కొనసాగుతున్న దుస్థితి అద్దంపట్టే ఈ వాక్యాలు లోక్‌సత్తా రాజకీయ ఉద్యమకారులకు చిరపరిచితం.

వివక్షలేకుండా అందరికీ ఎదిగే అవకాశాలనిచ్చే వ్యవస్థీకృత 'మార్పు' దిశగా ప్రజలను చైతన్యపరిచేందుకు తాను చేస్తున్న అలుపెరుగని పోరాటంలో ప్రచారాస్త్రంగా ఈ మాటలను కూడా లోక్‌సత్తా ఉపయోగించుకుంటోంది, తన ప్రచురుణల ద్వారా ప్రజలలోకి తీసుకెళ్తోంది. ఈ వాక్యాల్ని రాసింది రాబర్ట్ క్లిట్‌గార్డ్ అనే సామాజిక అధ్యయనకారుడు.

భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన సంవత్సరం 1947లోనే జన్మించిన క్లిట్‌గార్డ్ అమెరికన్ పౌరుడు. హార్వర్డ్ విశ్వవిద్యాలయంలో పీహెచ్‌డీ వరకూ చదివారు. కాలిఫోర్నియాలోని క్లేర్‌మాంట్ గ్రాడ్యుయేట్ యూనివర్సిటీ ప్రెసిడెంట్ వరకూ అనేక ప్రతిష్ఠాత్మక పదవుల్ని నిర్వహించారు. ఆర్థికశాస్త్రంలో, అంతర్జాతీయ అభివృద్ధి, భద్రత తదితర అంశాలలో ఆచార్యునిగా విశేషసేవలందించారు. ప్రపంచానికి పరిష్కారాలనందించే తన అసమాన ప్రతిభావిశేషాల వల్ల లాటిన్ అమెరికా, ఆసియా, ఆఫ్రికాలోని దాదాపు 30దేశాలలో సలహాసంప్రదింపులు, పరిశోధనా సహకారాన్ని అందించారు. అన్నిటినీ మించి ప్రపంచాన్ని పీడిస్తున్న అవినీతి మహమ్మారిపై పోరాటమార్గాల్ని, పరిష్కారాల్ని అందించే అంతర్జాతీయస్థాయి నిపుణునిగా క్లిట్‌గార్డ్ ఖ్యాతిని గడించారు.

అవినీతినిర్మూలనకు భారతదేశంలోనే అత్యంత సమగ్రంగా, నిర్మాణాత్మకంగా, వ్యవస్థీకృతంగా పోరాడుతున్న లోక్‌సత్తా పార్టీ చెబుతున్న విషయాలకంటే అదనంగా క్లిట్‌గార్డ్ ఏమీ చెప్పనప్పటికీ, భారతదేశ పరిస్థితులకు తగ్గ నిర్దుష్ట పరిష్కారాలను సూచించనప్పటికీ, ఆయన పరిశీలనల్ని, ఆయనను ప్రభావితం చేసిన అంశాలను కొంతమేర తెలుసుకోవటం మన దీర్ఘకాలిక పోరాటానికి నూతనోత్తేజాన్నిస్తుందనటంలో సందేహం లేదు. అందుకే 'అవినీతి గతి ఏమిటి' అనే కోణంలో క్లిట్‌గార్డ్ వ్యక్తం చేసిన కొన్ని భావాలను స్వేచ్ఛానువాదంగా లోక్‌సత్తా టైమ్స్ పాఠకులతో పంచుకునేందుకు ఈ ప్రయత్నం...

"+ అవినీతి చివరకు అంతమవక తప్పదని జాన్ టి. నూనన్ అనే అమెరికన్ న్యాయమూర్తి 1985లో రాసిన 'బ్రైబ్స్' అనే పుస్తకంలో చాలా సాధికారికంగా, సోదాహరణంగా వివరించారు. "బానిసత్వం ఒకప్పుడు సాధారణ జీవనవిధానం. కానీ ఈవేళ గుర్తుచేసుకోవటానికి కూడా మనకు మనసొప్పని ఒక చేదు గతం అది. అదేతీరుగా ఒక అధికారిక బాధ్యతను

నెరవేర్చటానికి లంచం ఇవ్వాల్సిన పరిస్థితి కూడా అంతరించిపోతుంది" అని నూనన్ అందులో పేర్కొన్నారు. అవినీతి అనేది ప్రపంచంలో ఎక్కడా, ఏ జాతిసంస్కృతిలో భాగం కాదని నూనన్ స్పష్టంచేస్తారు. అవినీతిని అవమానకరంగా, డబ్బుకు అమ్ముడుపోవటంగా, నమ్మకద్రోహంగానే జనం పరిగణిస్తుంటారు. నైతిక శక్తులతోపాటు సమాచార, సాంకేతిక వ్యవస్థలు, ప్రచారాలు పెరగటం, పోటీతత్వం విస్తరించటంతో వ్యవస్థీకృత అవినీతి అంతమవుతుంది అని నూనన్ అంటారు.

+ సింగపూర్ వంటి దేశాల విషయంలో నూనన్ జోస్యం నిజమైంది. అలాగే మొజాంబిక్ నుంచి కొలంబియా వరకూ వ్యవస్థీకృత అవినీతి తగ్గుముఖం పట్టింది. కానీ కొన్నిచోట్ల తగ్గిన అవినీతి తిరిగి మొదలైన ఆందోళనకర ఘటనలు కూడా ఉన్నాయి. ఇవన్నీ చూస్తుంటే... అవినీతిని అంతం చేయటం సాధ్యంకాదా? నూనన్ అభిప్రాయాలు తప్పా? అనే సందేహాలు కూడా ముసురుకుంటాయి. ఇలా అవినీతి ఏదోకరకంగా కొనసాగుతూ, విశృంఖలమవుతుండటం చూసి... 'అబ్బే, అవినీతి మామూలే, అదేమంత పెద్దసమస్య కాదు, సర్దుకుపోదాం' అని మనలోని చాలామంది బాహాటంగానే తేల్చిపారేస్తుంటారు. ఒక యంత్రం సరిగా పనిచేయాలంటే చమురు వేయటం అవసరమైనట్టు, వ్యాపారాన్ని, దిగజారిన రాజకీయాలను నడిపించటానికి లంచాలు కూడా అవసరమని వాదించేస్తుంటారు. కానీ అవినీతి చూసీచూడనట్టు వదిలేయాల్సిన అంశం కాదని, అదో భయంకర సమస్యని అనేక ఆర్థిక విశ్లేషణలు, ఉదాహరణలు తేటతెల్లం చేస్తున్నాయి. అవినీతి వల్ల పెట్టుబడులు తగ్గి అభివృద్ధి మందగించి సామాజిక సేవలు దెబ్బతింటాయి, న్యాయం అందకుండా పోతుంది. అవినీతిమయమై సుపరిపాలన లేని దేశాలలో శిశుమరణాలు, పౌష్టికాహారలోపం, నిరక్షరాస్యత ఎక్కువ ఉంటాయి. మొత్తంగా చూస్తే... అవినీతి వల్ల పేదలు ఎక్కువ దెబ్బతింటుంటారు, పేదరికం శాశ్వతంగా కొనసాగుతుంటుంది.

కాబట్టి వివక్ష లేకుండా పుట్టిన ప్రతిబిడ్డా తన సామర్థ్యంమేర ఎదగాలంటే, అవినీతిపై ఖచ్చితంగా వేటు పడాల్సిందే. వ్యవస్థీకృత అవినీతిని అంతం చేయాల్సిందే. అవినీతిని తగ్గించాలంటే ఏం చేయాలి?

అవినీతిని కేవలం నైతిక సమస్యగా చూస్తే ఫలితాలు రావు. వ్యవస్థీకృతమైన ఏర్పాట్లను కూడా జోడిస్తే.. నిస్సందేహంగా అవినీతిని కట్టడి చేయవచ్చు. నా అంతర్జాతీయ అనుభవం ప్రాతిపదికన వ్యవస్థీకృత అవినీతిపై యుద్ధాన్ని గెలవాలంటే ఈ దిగువ 5 చర్యలు అవసరం...

1. సరైన వ్యవస్థని, నాయకత్వాన్ని నిర్మించేలా ప్రోత్సాహాల్నివ్వటం: సరైన వ్యవస్థని, నాయకత్వాన్ని నిర్మించే ప్రోత్సాహాలతో ప్రభుత్వం సంస్కరణల్ని తీసుకురావాలి. అవినీతి వ్యక్తుల్ని లక్ష్యంగా చేసుకోకుండా అవినీతి నిర్మాణాల్ని లక్ష్యంగా చేసుకుని పోరాడాలి.

అవినీతి= గుత్తాధిపత్యం+విచక్షణ–జవాబుదారీతనం

ఒక వస్తువు లేదా సేవపై గుత్తాధిపత్యం ఉండి, జవాబుదారీతనం లేని విచక్షణాధికారం ఉన్నప్పుడు అవినీతి పెచ్చరిల్లుతుంది.

అలాగే అవినీతిని సమర్థంగా నిరోధించే, అవినీతికి పాల్పడేవారి పట్ల నిర్దాక్షిణ్యంగా వ్యవహరించే, నైతికవిలువలలో ఆదర్శప్రాయంగా ఉండే నాయకులు కావాలి. అలాంటి నేతలు ఉంటేనే అవినీతిని పూర్తిస్థాయిలో అదుపుచేయగలం.

అవినీతికి పాల్పడ్డ వారికి శిక్షలతోపాటు.. నిజాయతీగా పనిచేసే ప్రజాసేవకులకు ప్రోత్సాహకాలు చాలా ముఖ్యం.

2. అవినీతి నిర్మూలన ప్రభుత్వ విధానంగా ఉండాలి: మొత్తం దేశవ్యాప్తంగా అవినీతి వాతావరణం నెలకొని ఉంటే, కేవలం ఒక విభాగాన్నో, ఒక మంత్రిత్వ శాఖనో ప్రక్షాళన చేయటం వల్ల ఫలితం ఉండదు. అలాగే ఇతర మంత్రిత్వ శాఖలతో, విభాగాలతో సమన్వయం లేకుండా జాతీయస్థాయి అవినీతి నిరోధక సంస్థను ఏర్పాటు చేసినా ప్రయోజనం ఉండదు. అవినీతి నిర్మూలనను ఒక సమగ్ర విధానంగా ప్రభుత్వం అమలుచేయాలి.

3. వ్యాపారవేత్తలను, ప్రజలను కూడా భాగస్వాములను చేయటం: అవినీతిపై పోరాటం కేవలం ప్రభుత్వానికే పరిమితమైతే సరిపోదు. వ్యాపారస్తులను, న్యాయవాదులను, అకౌంటెంట్లను ఇలా అవినీతి నియంత్రణలో అన్నివర్గాలనూ భాగస్వాముల్ని చేయాలి. లంచాలు, మోసాలు ఎన్నిరకాలుగా ఉంటాయో, ఎలా కొత్తపుంతలు తొక్కుతాయో ఆయావర్గాల మధ్య ఎప్పటికప్పుడు సమాచార మార్పిడి ఉండే ఏర్పాట్లు ఉండాలి. ఒక పరిధి దాటిన పబ్లిక్ టెండర్ల విషయంలో బిడ్డర్లు 'నిజాయతీ ఒప్పందం' మీద సంతకం చేయటం వంటి ఏర్పాట్లు ఉండాలి. లంచాలు ఇవ్వం, ఖర్చులు, ఇతర నిబంధనల విషయంలో మోసం చేయం అని ఆ ఒప్పందం ద్వారా హామీ

ఇవ్వాలి. బిడ్ గెలుచుకున్న కంపెనీ అవినీతికి, అవకతవకలకు పాల్పడినట్టు ఒప్పందం మీద సంతకం పెట్టిన కంపెనీకి సందేహం వస్తే... ఆరోపణలు ఎదుర్కొంటున్న కంపెనీ తన లెక్కల్ని బహిరంగపరిచి చూపించాలి.

4. స్టింగ్ ఆపరేషన్ వంటి అవ్యవస్థీకృత పద్ధతులలో దాడిచేయటం: అవినీతి విశృంఖలంగా వ్యవస్థీకృతమైనప్పుడు కేవలం నిరోధక చర్యలు సరిపోవు. దాని బలహీనతల మీద కీలెరిగి వాతపెట్టాలి. స్టింగ్ ఆపరేషన్లు, అండర్‌కవర్ ఏజెంట్లు, అవినీతిలో భాగస్వాములుగా ఉన్నవారిని సాక్షులుగా మార్చటం వంటి పద్ధతులలో దాడి చేయాలి. అవినీతి వ్యవస్థలలో బలహీనాంశమేమంటే... దోపిడీ చేసి సంపాదించిన డబ్బును దాచటం. నేతల, అధికారుల జీవనశైలిని గమనిస్తుండాలి. అధికారికంగా వారు తమ స్థాయి కంటే ఎక్కువగా గడుపుతుంటే అవినీతికి పాల్పడ్డట్టు పసిగట్టవచ్చు. కొన్ని దేశాలలో పౌరులే ఇలాంటి విషయాలను వివరంగా నమోదుచేసి సమాచారాన్ని పంపించి అవినీతి నేతల్ని, వ్యవస్థల్ని కుప్పకూల్చటంలో కీలకపాత్ర పోషించారు.

5. నైతికత కీలక ప్రాధాన్యతను నిరంతరం గుర్తుంచుకోవాలి: అవినీతి అనేది ప్రపంచవ్యాప్తంగా అనైతికాంశంగా, ఆమోదయోగ్యంకాని అంశంగానే పరిగణించబడుతోందని నూనన్ చెప్పినట్టు ముందే చదివాం. అవినీతి ఒక జీవనవిధానంగా ఉన్న ప్రాంతాలలో సైతం పౌరులు అవినీతిని ఆమోదించలేరు. మన సామూహిక వ్యతిరేకత అంతిమంగా మన వ్యవహారశైలిని మార్చి అవినీతిని అంతం చేస్తుందని నూనన్ అభిప్రాయం. అది ఎలా జరుగుతుందనేది నూనన్ 'చరిత్రలో ముందుకొచ్చే శక్తులకే వదిలేశారు".

కాబట్టి.. అభివృద్ధిని, పేదల ప్రయోజనాలను కబళిస్తున్న, మానవస్వభావ విరుద్ధమైన అవినీతి అంతమవటం ఖాయం. కానీ అది ఎప్పుడు జరుగుతుంది అనేది మాత్రం.. మనందరి మనసుల్లోని నిజాయతీని సరైన విధానాలకు అన్వయించటం మీదే ఆధారపడి ఉంటుంది. ❍

# జిందాల్ చేతిలో మోసపోయిన రైతులకు న్యాయం చేయండి



విజయనగరం జిల్లా ఎస్.కోట మండలంలో అల్యూమినియం కర్మాగారం ఏర్పాటు పేరుతో రైతుల భూముల్ని తీసుకుని పరిహారం ఇవ్వకుండా, కర్మాగారం ఏర్పాటు చేయకుండా మోసం చేస్తున్న జిందాల్ కంపెనీపై తగిన చర్యలు తీసుకుని రైతులకు న్యాయం చేయాలని లోక్‌సత్తా పార్టీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సుమారు 2008లో 110 రైతు కుటుంబాల నుంచి 1128 ఎకరాలను సేకరించారన్నారు. పరిహారం విషయంలో రైతులు, గిరిజనులను కంపెనీ చేసిన మోసంపై లోక్‌సత్తా ఫిర్యాదు మేరకు లోకాయుక్త కూడా స్పందించి చర్యలకు ప్రభుత్వాన్ని ఆదేశించిందని గుర్తుచేశారు. తమ సమస్యలు చెప్పుకోవటానికి కలెక్టరేట్‌కి వచ్చిన రైతుల్ని బెదిరిస్తున్నారన్నారు. భూములను ఎవరూ ఇప్పించలేరని కంపెనీ వర్గాలు ప్రచారం చేస్తున్నాయన్నారు. జిందాల్ కంపెనీపై చట్టపరమైన చర్యలు తీసుకుని భూముల్ని రైతులకు ఇప్పించాలని రెవెన్యూ డివిజనల్ అధికారి శ్రీనివాసమూర్తిని కలిసి కోరారు. ప్రభుత్వ యంత్రాంగం వెంటనే స్పందించకపోతే రైతులు భూముల్ని ఆక్రమించుకుని సాగుచేస్తారని, శాంతియుతంగా ఉన్న వాతావరణం కల్లోలం కాకముందే మేలుకోవాలని అన్నారు. బాబ్జీతోపాటు అప్పారావు, శ్రీను, దేవుడు సింహాచలం, సోమేష్, పోలయ్య, లక్ష్మణరావు, విజయ శంకర్ తదితరులు ఉన్నారు. ❍

# లంచగొండి వ్యవస్థలో అభివృద్ధి అసాధ్యం

**- డా॥ జయప్రకాష్ నారాయణ్**

పత్రికలలో ఇటీవల ఓ ఆసక్తికరమైన వార్త వచ్చింది. రాష్ట్రంలో ప్రభుత్వ పనులు చేపట్టిన కాంట్రాక్టర్లు ప్రభుత్వం మీద కోర్టులో కేసు వేస్తామని ప్రకటించారు. ఎందుకంటే రూ.600కోట్లకు పైగా చేసిన పనులకు ప్రభుత్వం బకాయి పడిందట. ఎంత ప్రయత్నం చేసినా ప్రభుత్వ శాఖలు బిల్లులు చెల్లించటం లేదని, డబ్బు ముందుగా వడ్డీలకు తీసుకొచ్చి పెట్టుబడి పెట్టిన తాము దివాలా స్థితిలో ఉన్నామని అందువల్ల కేసు వేస్తున్నామని ప్రకటించారు. ఇంకా విచిత్రం ఏమంటే గోరుచుట్టు మీద రోకలిపోటులాగా డబ్బు సకాలంలో చెల్లించని ప్రభుత్వాధికారులు, రాజకీయ నాయకులు లంచాలు మాత్రం క్రమం తప్పకుండా పెద్దఎత్తున గుంజుతున్నారట! సాధారణంగా పని విలువలో 15శాతం వాళ్లకు సమర్పించుకోవాల్సి వస్తోందట. ఇక నుంచి లంచాలు తగ్గించి మూడు శాతం మించకుండా ఇవ్వాలని రాష్ట్ర కాంట్రాక్టర్ల సంఘం అధ్యక్షుడు బహిరంగంగా తమ సభ్యులకు పిలుపు ఇవ్వడం విశేషం. పదివేలు నెలజీతం తీసుకునే అధికారికి పదిహేను లక్షలు లంచం ఇవ్వటమేమిటని ఆయన వాదన! ఓ కాంట్రాక్టరు లంచాల బాధ పడలేక ఇలా డబ్బు కోసం వేధించే అధికారులను అవినీతి నిరోధక శాఖకు పట్టిద్దామని సూచించగా, ఆ శాఖ అధికారులు కూడా అందుకు లంచం అడుగుతున్నారని మరో కాంట్రాక్టరు వివరించారు. ఇది నిజంగా జరుగుతోందా, లేక పీడకల కంటున్నామా అనిపిస్తుంది.

రెండు వారాల క్రితం మరో వార్త ప్రముఖంగా వచ్చింది. ముఖ్యమంత్రి జన్మభూమి కార్యక్రమాలు ప్రారంభించటానికి గజ్వేల్ గ్రామం వెళ్లారు. అక్కడ ఓ రైతు విద్యుత్‌శాఖ అధికారుల మీద ఫిర్యాదు చేస్తూ లంచాలు మింగి కూడా పనిచేయటం లేదని, ఆపైన చాలా దురుసుగా, అమర్యాదగా ప్రవర్తిస్తున్నారని వివరించారు. 'సొమ్ము పోయె, శనీ పట్టె' అని ఆ రైతు బాధ. ముఖ్యమంత్రి ఆ విద్యుత్ అధికారిని పిలిపించి 'రైతులతో అమర్యాదగా ప్రవర్తించటం తప్పు' అని మందలించారే తప్ప సరైన చర్య తీసుకోకపోవడం ఉద్యోగులను సంతోషపెట్టవచ్చు గానీ రైతులను నిరాశపరచింది. ముఖ్యమంత్రి ఎప్పటికప్పుడు ఉద్యోగులను హెచ్చరిస్తున్నా ఆరు నెలలు గడువిస్తున్నానని చెబుతున్నా, తప్పు చేస్తే చర్య తీసుకుంటున్నామన్నా సరైన ఫలితం ఉండటం లేదు. అవినీతికి కళ్లెం పడటం లేదు.




**మరుగుదొడ్ల పథకంలోనూ కక్కుర్తి**

లోక్‌సత్తా ఉద్యమం ఎంతో పట్టుబట్టగా ప్రభుత్వం ఇంటింటా మరుగుదొడ్డి పథకాన్ని ప్రవేశపెట్టింది. మామూలు ప్రభుత్వ పథకాల మాదిరిగానే ఇందులో కూడా జాప్యం, అసమర్థత, వేధింపులు చోటు చేసుకున్నాయి. మా గ్రామంలో 408 మరుగుదొడ్లు కట్టించటానికి పూనుకుని ఆ గ్రామంలో చదువుకున్నవాళ్లు ఓ స్వచ్ఛంద సంస్థగా ఏర్పడి చివరికి విజయం సాధించారు. కానీ చేపట్టిన పనిని పూర్తిచేయటానికి ప్రభుత్వ యంత్రాంగంతో ఎంత కష్టపడాల్సి వచ్చిందో, ఎన్ని అడ్డంకులు ఎదురయ్యాయో వివరిస్తే అదో పెద్ద గ్రంథమవుతుంది. చివరికి అనుకున్న లక్ష్యం నెరవేరి ప్రతి ఇంటికీ మరుగుదొడ్డి ఏర్పడింది. గ్రామంలో ఉన్న దళితులు, గిరిజనులు, బలహీనవర్గాలు- ప్రతి ఒక్కరికీ బహిరంగ మలవిసర్జన నుంచి విముక్తి లభించింది. ప్రతి కుటుంబం సగర్వంగా వాటిని వినియోగించుకుంటూ జీవితంలో మొదటిసారి హుందాగా బతుకుతోంది. ఎంతో పలుకుబడి, ప్రతిష్ఠ పెట్టుబడిగా పెట్టటం వల్ల, కొద్దిమంది నిజాయతీపరులైన పెద్దలు ఆ గ్రామంలో పనుల కోసం అహోరాత్రాలూ విసుగనుకోకుండా శ్రమ పడటం వల్ల, కలెక్టర్ స్థాయిలో చిత్తశుద్ధితో సహకరించటం వల్ల ఒక్క గ్రామంలో ఈ పనిచేయటం సాధ్యమయింది. ఎన్నోచోట్ల చివరికి ఈ మరుగుదొడ్ల పథకంలో కూడా లంచాలు మింగుతున్నారు. ఇందుగలదందులేదను సందియంబు వలదన్నట్టు లంచం

చివరికి మరుగుదొడ్ల నిర్మాణంలో కూడా ప్రత్యక్షమవుతోంది! దొంగలెక్కలు చూపి, లంచాలు మింగి, ప్రజాధనాన్ని పెద్దఎత్తున కైంకర్యం చేస్తున్నారు. సామర్లకోట పట్టణంలో కొంతకాలం క్రితం ఈ మరుగుదొడ్ల పథకంలో రూ.48లక్షలు కైంకర్యం చేశారని వార్తలచ్చాయి. విశాఖ జిల్లా తంగేడు గ్రామ సర్పంచి స్వయంగా నాకు తమ గ్రామంలో ఈ పథకం అమలు గురించి వివరించారు. ఊళ్లో 250 మరుగుదొడ్లు కట్టినట్టుగా అధికారులు దొంగ లెక్కలు చూపారట. నిజానికి అన్ని మరుగుదొడ్లు కట్టలేదని, అదంతా మోసమని సర్పంచి ఎన్నోసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకునే నాథుడు లేడు! జరుగుతున్న మోసాన్ని బయటపెట్టటం ఎన్నికయిన వాళ్లకు కాస్త ఇబ్బంది. పని జరగకపోయినా జరిగినట్టు లెక్కలు వేస్తే అందువల్ల ఆ ఇంటి ఆసామికి కొంత డబ్బు అక్రమంగా ముడుతుంది. దొంగ లెక్కలు వేసి డబ్బు మంజూరు చేసినందుకు ప్రభుత్వ అధికారులకు తలా కొంత లంచం దక్కుతుంది. కాబట్టి ఫిర్యాదు చేసే వాళ్లే ఉండరు. దాన్ని ఆపాలని ప్రయత్నం చేసే వాళ్ల మీద అందరికీ గుర్రుగా ఉంటుంది. అదే ఎన్నికయిన సర్పంచి అయితే మళ్లీ ఎన్నికలచ్చినప్పుడు ఓట్లు పడకపోవచ్చు. "అందరూ తిన్నట్టుగానే మేమూ కాస్త తిన్నాం. ఈయనకేం రోగం? నోరు మూసుకు కూర్చోవచ్చు గదా! ఈయనొక్కడేనా మడికట్టుకు కూర్చునేది? దీనివల్ల దేశం ఏమైనా బాగుపడిపోతుందా?" అని ఆ ఆసాములకు, అధికారులకు అక్కసు! పోయేది ప్రజాధనమే కాబట్టి ఇలాంటి అంశాలలో బాధపడే వాళ్లు చాలా తక్కువ. ఆ డబ్బు మనదేనని, దాన్ని ఇలా దోచుకు తినటం వల్లనే దేశం దివాలా తీస్తోందని, ప్రజలకు అన్ని సౌకర్యాలూ కరవవుతున్నాయని, తమ పిల్లలు బీదరికంలో మునిగిపోతున్నారని సామాన్య ప్రజలకు తట్టదు. పోనీ తెలిసినా, "అధికారం, పలుకుబడి ఉన్న వాళ్లంతా దోచుకుని కోట్లకు పడగలెత్తుతుంటే మనం ఒంటరిగా ఏం చేయగలం?" అని మౌనంగా కూర్చుంటున్నారు. తంగేడు గ్రామ సర్పంచి వివరాలు సేకరించగా గ్రామంలో 250 మరుగుదొడ్లు కట్టినట్టుగా లెక్కలు చూపి డబ్బులు తిని, మిగిలింది ఆ కుటుంబాలకు పంచారట. వాస్తవానికి వివరాలు సేకరిస్తే తేలిందేమంటే కేవలం 25 మరుగుదొడ్లు మాత్రం కట్టారట! అంటే 90శాతం డబ్బు కైంకర్యం అయిపోయిందన్నమాట! తంగేడు సర్పంచి చివరికి అత్యున్నతాధికారుల వద్దకు వెళ్లి మొరపెట్టుకున్నారట. అందుకా అధికారుల నుంచి "అయ్యా అంతా లంచాలు మింగుతున్నారు. మీరూ, నేనూ మాత్రం మడిగట్టుకుని కూర్చుంటే ఇదంతా మార్చగలమా, మీ పిచ్చిగాని", అని వేదాంత ధోరణిలో సమాధానం వచ్చిందట. ఇటీవల నేను తెనాలి పట్టణంలో పర్యటించాను. అక్కడ నాకు మరో ఆసక్తికరమయిన విషయం తెలిసింది. ప్రభుత్వం నుంచి అక్కడి మునిసిపాలిటీకి రూ.44లక్షలు గ్రాంటు వచ్చింది. పురపాలక సంఘానికి డబ్బు వెంటనే కావాలి. ఆ మునిసిపల్ ఛైర్మన్ నిజాయతీపరుడు. అందునా అధికార పార్టీకి చెందినవాడు. సరే ప్రభుత్వ గ్రాంటు ప్రజల కోసం వచ్చింది కదా, దాన్ని వినియోగించుకుందామని ప్రయత్నం చేశారట. తీరా ప్రభుత్వ ఖజానా (ట్రెజరీ) అధికారులను ఆ డబ్బు విడుదల చేయాల్సిందిగా కోరితే, పదివేల రూపాయలు లంచంగా అక్కడ పెట్టాకే ఆ డబ్బు విడుదల గురించి ఆలోచిస్తామని కుండబద్దలు గొట్టినట్టు చెప్పారట. ఏదో ప్రజలకు మేలు చేద్దామని ఎన్నికలలో పోటీ చేసి పదవిని చేపడితే, ప్రజాధనాన్ని ప్రజల కోసం ఖర్చు చేయాలంటే ఈ లంచం ఏమిటని ఆయన మథనపడ్డారు. చివరికి లంచం లేకపోతే డబ్బు మంజూరు కాదు కాబట్టి, ఆ డబ్బు లేకపోతే పనంతా ఆగిపోతుంది కాబట్టి, గతిలేక లంచం ఇచ్చయినా ఆ డబ్బు విడుదల చేయించాలని ఆయన నిర్ణయించుకోవటం వాస్తవ పరిస్థితులకు దర్పణం పడుతోంది.

### బరితెగించి దోపిడీ

ఇలా ఎక్కడ చూసినా అవినీతి స్వైరవిహారం చేస్తోంది. ఓ వంక ప్రభుత్వ ఖజానా ఖాళీ అయిపోయింది. ఏటా రూ.3600కోట్లు ఖర్చు చేసి రాష్ట్ర ప్రభుత్వం కేవలం అందులో 60వ వంతు, రూ.600కోట్ల బకాయిలు కాంట్రాక్టర్లకు చెల్లించలేక అవస్థ పడుతోంది. కానీ లంచాలు మింగటంలో మాత్రం ఎలాంటి రాయితీలు లేవు! పేరుకు రోజుకు రూ.100కోట్లు రాష్ట్ర ప్రభుత్వమే ప్రజాధనాన్ని ఖర్చు పెడుతోంది. దానిలో ఎంత డబ్బు వృధాగా పోతోందో ఊహించుకోవటం కష్టమేమీ కాదు. ప్రభుత్వంలో ఉన్న వాళ్లకు ప్రజల్ని ఏదో విధంగా బాధించే శక్తి ఉంది. ఓ పని సకాలంలో చేయకపోతే జనానికి చాలా కష్టం. ఓ సర్టిఫికెట్ వెంటనే అందకపోతే ఓ విద్యార్థికి చాలా నష్టం. ఓ కేసులో సాక్ష్యాన్ని తారుమారు చేస్తే ఓ ఆసామికి చాలా క్లేశం. ఓ నేరాన్ని సరిగ్గా నమోదు చేయకపోతే ఓ అభాగ్యుడికి తీరని అన్యాయం. ఇలా ప్రభుత్వం సరిగ్గా పనిచేయకపోతే నష్టపోయేవాళ్లనేకులు. ఆ నష్టాన్ని, బాధను ఎర చూపించి, బెదిరించి డబ్బు వసూలు చేయటం పాలనా యంత్రాంగానికి, రాజకీయ నాయకులకు వెన్నతో పెట్టిన విద్య. లంచం డబ్బు కాస్త తక్కువగా ఇస్తే (మన స్తోమతుకు చాలా ఎక్కువ డబ్బయినా, పుచ్చుకునేవాడికి అది చాలా తక్కువ!), "ఏమనుకుంటున్నారు? నేను చాలా ఉన్నతాధికారిని, నా స్థాయికి తగినట్టుగా ఇవ్వకపోతే ఎలా?" అని బరితెగించి దోచుకుంటున్నారు. ఉన్నతాధికారుల్లో ఎవరు నిజాయతీపరులో, ఎవరు లంచగొండులో, ఎవరు సమర్థులో,

ఎవరు పనిదొంగలో అందరికీ తెలుసు. కానీ అధికారుల నియామకాలలో మాత్రం ఆ తేడా కనిపించదు! అదేమంటే, “ఇదంతా రాజకీయంలో సహజమండీ. అందర్నీ కలుపుకొని పోవాలి. మరీ ఆదర్శం అంటే బండినడవదు. అదీగాక ఎన్నికలకు కోట్లు ఖర్చు పెట్టాలి. అది కావాలంటే లంచాలు గుంజాలి. కోటి రూపాయలు ఖర్చు పెడితే ఐదు కోట్లయినా ఆదాయం రావాలి. లేకపోతే గిట్టుబాటు కాదు. ఐదు కోట్లు వసూలు చేయాలంటే అధికార యంత్రాంగం, ఉద్యోగులు 50 కోట్లు తింటారు. ప్రతి నాయకుడికి 2000మందికి పైగా ఉద్యోగులున్నప్పుడు వాళ్లు తలా కాస్త తిన్నా కనీసం పదిరెట్లు లంచాలు గుంజాలి! మరేం చేస్తాం? ఉన్నంతలో ఏదో ప్రయత్నం చేస్తున్నాం” అని సమాధానం చెబుతారు. ఇదీ మన పాలన తీరు. కబుర్లను కట్టిపెట్టి వాస్తవాలను కాస్త పరిశీలిస్తే మన కళ్లకు కనపడే భయంకర సత్యమిది.

**సంక్షోభాలు నిత్యకృత్యం**

రోజూ ఓ సంక్షోభం వస్తుంది. మర్నాడు మరో అంశం రాగానే నిన్నటిది మరుగున పడిపోతుంది. విద్యుత్ రంగంలో అవినీతి, అసమర్థతల వల్ల ఛార్జీలు పెంచితే ఓ నెల రోజులు గందరగోళం అవుతుంది. ఆ తరువాత ఏ తుపానో వస్తుంది. అదయ్యాక రైతుల పంటలకు ధరలు తగ్గి మరో సంక్షోభం వస్తుంది. దాని మీద మరింత హడావుడి చేసే సరికి రైతులు మరచిపోతారు. ఆ తరువాత ఏదో ఓ రాజకీయ దుమారం వస్తుంది. మందిరం కట్టాలా, మసీదు నిర్మించాలా అని తర్జనభర్జనలు పడతారు. బెదిరింపులు, ప్రకటనలు, విమర్శలు, ప్రతివిమర్శలతో ఓ నెల గడిచిపోతుంది. మళ్లీ ప్రభుత్వం దివాలా తీస్తోందని ప్రకటనలు వస్తాయి. ధరలు, పన్నులు పెరుగుతాయి. వాటిని గురించి బాధపడేలోగా మళ్లీ విద్యుత్‌రంగంలో సంక్షోభం ఉందని వార్తలు వస్తాయి. ఇలా కాలచక్రం తిరుగుతూనే ఉంటుంది. ప్రజల సమస్యలు మరింత పెరుగుతూనే ఉంటాయి. ఏది ఎలా అయినా క్రమం తప్పకుండా జరిగే పని మాత్రం ఒకటుంది. అదేమంటే లంచాలు గుంజటం, దోపిడీని నిర్విఘ్నంగా కొనసాగించటం. ఇదీ మన పాలనలోని రహస్యం! మన రాజకీయంలోని మర్మం! లంచాలు నిరాటంకంగా కొనసాగినంత వరకు మన పాలకులకేమీ ఢోకా లేదు! వాళ్లు పెట్టిన పెట్టుబడికి పదింతలు ఆదాయం వచ్చినంత వరకు వాళ్లేకేమీ చీమకుట్టినట్లు అనిపించదు. గద్దె మీద కూర్చున్నవారి భారాన్ని మనం మోస్తున్నంత వరకు వాళ్లు మన డొక్కల్లో తంతూనే ఉంటారు. అందుకు వాళ్లను తప్పు పట్టాల్సిన అవసరం లేదు. అది వాళ్ల సహజ లక్షణం. తప్పేమన్నా ఉంటే మనది. వాళ్ల మాటల్ని మౌనంగా వింటూ, వాళ్లకు భజన చేస్తూ మనల్ని మనం ఈసడించుకుంటున్నాం. మన వేళ్లతో మన కళ్లను మనమే పొడుచుకుంటున్నాం. బిడ్డల భవిష్యత్తును మనమే కాలరాస్తున్నాం. పరిష్కారాలు ఆలోచించే వాళ్లందరికీ తెలుసు. వాటి కోసం పోరాడే చేవ కరవయింది. ఎవరో వస్తారనీ, ఏదో చేస్తారనీ ఎదురుచూస్తున్నాం. ఎవరయినా కాస్తంత చొరవ తీసుకుంటే వాళ్ల భుజాల మీద భారమంతా పెట్టి మనం చోద్యం చూస్తున్నాం. జీవితాలు కాలి బూడిద అయిపోతుంటే అదేదో మనకు సంబంధించిన విషయం కానట్టుగా, సినిమానో, నాటకాన్నో చూస్తున్నట్టుగా మౌనంగా కూర్చుంటున్నాం. మనం మళ్లీ పాత్రధారులమయ్యేదాకా, మన సార్వభౌమత్వాన్ని తిరిగి పుచ్చుకునేదాకా, గద్దె మీద కూర్చున్నవాళ్లు మన సేవకులమని తెలుసుకునేదాకా ఈ తిప్పలు తప్పవు. పాపం చేస్తున్నవాళ్లకన్నా, జరుగుతోంది తప్పని తెలిసీ ఎదిరించని వాళ్లు మహాపాపులు. మనలో చాలామంది ప్రస్తుతం ఆ కోవలోకే వస్తారు.

(జేపీ ‘భవిష్యత్ భారతం’ కాలమ్‌లో భాగంగా ఫిబ్రవరి 5, 2001న ఈనాడులో ప్రచురితమైన వ్యాసం) ❍

## ఉస్మానియా వర్సిటీ వందేళ్ల చర్చ బాహుబలి-2కి దీటుగా ఉండాలి

దేశంలోనే విశిష్ట విద్యాసంస్థగా పేరొందిన ఉస్మానియా విశ్వవిద్యాలయం ఈ ఏడాది వందేళ్ల పండగను జరుపుకోనున్నది. ఏప్రిల్ 26 నుంచి మూడు రోజులపాటు ఉత్సవాలను ఘనంగా నిర్వహించటానికి తెలంగాణ ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. వివిధ రాష్ట్రాల్లో, విదేశాల్లో ఉన్న పూర్వ విద్యార్థులు కూడా ఇందులో భాగస్వాములవుతున్నారు. ఉస్మానియా వందేళ్ల మైలురాయిని దాటుతున్న సందర్భాన్ని ఉత్సవాలకే పరిమితం చేయకుండా.. ‘విద్య చుట్టూ రాజకీయం, సమాజం’పై చర్చకు, కార్యాచరణకు అవకాశంగా మలచాలని సామాజికవేత్తలు, కొత్త రాజకీయ ఆలోచనాపరులు భావిస్తున్నారు. ఈ ఉత్సవ సమయంలోనే విడుదలవుతున్న బాహుబలి-2 మీద చేసే చర్చకు దీటుగా ఉస్మానియా వర్సిటీ వందేళ్ల పండగ చుట్టూ కూడా తెలుగు ప్రజలు వివిధ మాధ్యమాలలో చర్చించాలని ఆశపడటంలో తప్పు లేదు గదా! ఇదే జరిగితే బాహుబలి దర్శకుడు ఎస్ఎస్‌రాజమౌళి కూడా ఎంతో సంతోషిస్తారనటంలో సందేహం లేదు. ❍

OSMANIA UNIVERSITY 100 YEARS Centenary Celebrations 1917-2017

# 'అమ్మచెట్టు' ఉస్మానియా

- డా॥ కె.శ్రీనివాస్

*'అమలులో ఉన్న విద్యావిధానంతో కొన్ని సమస్యలున్నాయి. వాటిని అధిగమించాలి. ప్రాచీన, ఆధునిక జ్ఞానాలను, సంస్కృతులను ఏ ఘర్షణా లేకుండా మేళవించాలి. భౌతిక, బౌద్ధిక, ఆధ్యాత్మిక రంగాలకు సంబంధించి పాతకొత్తలలోని ఉత్తమమైనవాటి నుంచి ప్రయోజనం పొందాలి. ఈ లక్ష్యాలను సాధించడానికి ఒక విశ్వవిద్యాలయం అవసరం. జ్ఞాన సముపార్జనలో ఈ విశ్వవిద్యాలయం నైతిక శిక్షణ మీద కేంద్రీకరించాలి. అది అన్ని శాస్త్రరంగాలలో పరిశోధనకు ప్రేరణ ఇవ్వాలి. ఉర్దూయే బోధనాభాషగా ఉండాలన్న సూత్రం మీద ఈ యూనివర్సిటీ పనిచేయాలి. అదే సమయంలో విద్యార్థులందరూ నిర్బంధంగా ఇంగ్లీషును కూడా అభ్యసించాలి. ఈ లక్ష్యాన్ని దృష్టిలో పెట్టుకుని, నా ముందున్న ఈ అర్జీలో పేర్కొన్న తీరులో హైదరాబాద్ అధినివేశ ప్రాంతాలలో ఒక విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేయడానికి, నేను అధికార పీఠం అధిష్ఠించిన సందర్భానికి గుర్తుగా దాన్ని హైదరాబాద్ ఉస్మానియా విశ్వవిద్యాలయం అని పిలవాలని ఆదేశిస్తున్నాను'.*




**కాకతీయతో మొదలుపెట్టి, తెలంగాణ యూనివర్సిటీ దాకా అన్నిటికీ ఉస్మానియాయే తల్లి. శాస్త్రవిజ్ఞాన రంగాలలోను, సామాజిక శాస్త్రాలలోను సవ్యసాచిలా అసామాన్య ప్రతిభలను ఆవిష్కరించిన ఉస్మానియా స్ఫూర్తితో, అన్ని చదువులను కాపాడుకోవడానికి ప్రపంచమంతా వ్యాపించిన పూర్వవిద్యార్థులు సంకల్పం చెప్పుకోవాలి.**

హైదరాబాద్ రాజ్యానికి ఒక విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేయాలని కొందరు అధికారులు, విద్యావేత్తలు చేసిన విజ్ఞప్తిని అంగీకరిస్తూ ఏడవ నిజాం మీర్ ఉస్మాన్ అలీ ఖాన్ 1917 ఏప్రిల్ 26వ తేదీన సంతకం చేసిన ఫర్మానా అది. ఆధునిక విద్య అతి ప్రాథమిక దశలో ఉన్న తరుణంలో విశ్వవిద్యాలయ స్థాపన అవసరాన్ని, అది సాధించవలసిన లక్ష్యాలను ప్రభుత్వ ఉత్తర్వులోనే అంత లోతుగా పేర్కొనడం ఆశ్చర్యం కలిగిస్తుంది. భూస్వామ్యరాచరిక సమాజం, పరోక్ష వలస పాలనలో ఉన్న దేశీయ సంస్థానం అయిన హైదరాబాద్ రాజ్యం, ఒక ప్రజాసంస్థ ఏర్పాటు ద్వారా, మారే కాలంలోకి వేసిన ఒక ముఖ్యమైన అడుగు ఉస్మానియా విశ్వవిద్యాలయం.

ఏప్రిల్ 26 నుంచి 28వ తేదీ వరకు ఉస్మానియా విశ్వవిద్యాలయం శతవార్షికోత్సవాలు అధికారికంగా ఘనంగా జరగబోతున్నాయి. రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ ఈ కార్యక్రమానికి వస్తున్నారు. గవర్నర్, ముఖ్యమంత్రి పాల్గంటున్నారు. ఒక చారిత్రక సంస్థకు నూరేళ్ల వయసు రావడం నిస్సందేహంగా ఒక విశేష సందర్భమే. అదే సమయంలో ఆ సంస్థ సమాజపు చరిత్రతో కలిసి చేసిన చరిత్రాత్మక ప్రయాణాన్ని సమీక్షించుకోవడం, ఆవిర్భావకాలం నాటి దాని విలువలు, ఆదర్శాలను మననం చేసుకోవడం, భవిష్యత్తుకు దాని నుంచి తీసుకోవలసిన స్ఫూర్తిని మదింపువేసుకోవడం వేడుకలకు, సంబరాలకు ప్రాతిపదికలుగా ఉండాలి. విద్యా, పరిశోధనా ప్రమాణాల స్థాపనలో, ఉత్తమ శ్రేణి మేధాశక్తిని ప్రపంచానికి అందించడంలో, చదువును సామాజిక సాధికారతగా మలచడంలో ఉస్మానియా వంటి సంస్థ చేసిన కృషి ఆ సంస్థతో సంబంధం ఉన్నవారందరికీ, ఆ సంస్థతో పెనవేసుకున్న చరిత్రతో నడిచినవారందరికీ గర్వకారణం. ఒక విద్యాలయం కేవలం అధ్యాపకులకు, విద్యార్థులకు మాత్రమే సంబంధించినది కాదు. అది స్వేచ్ఛాలోచనలకు వేదిక, విభిన్న భావాల కూడలి, విరుద్ధ ఆశయాల యుద్ధస్థలి, తన చుట్టూ ఉన్న సమాజం అంతటికీ మెదడూ, గుండే కూడా.

ఏడో నిజాం గురించి, ఆయన పాలన గురించి రకరకాల అభిప్రాయాలున్నాయి. తెలుగులో చదువును ఆయన పాలన ప్రోత్సహించలేదని, నూతనత్వంలోకి తెలంగాణ తెలుగు సమాజం వికసించడానికి అన్నీ అవరోధాలే ఉండేవని విమర్శిస్తాం.

అందులో అసత్యం ఏమీ లేదు. నాటి తెలంగాణ తెలుగు సమాజం తనను తాను వెలుగులోకి తెచ్చుకోవడానికి ఎంతో ప్రయాసపడింది, పోరాడింది. భాషా సాంస్కృతిక అస్తిత్వ పోరాటాన్ని రాజకీయ సాయుధ పోరాటం దాకా తీసుకెళ్లింది. నిజాం పాలనలో తెలుగుపై ఉండిన వివక్షను విమర్శించడానికి నాటి తరానికి హక్కు ఉన్నది కానీ, ఈనాడు ఇతరేతర కారణాలతో సానుకూలతను, వ్యతిరేకతలను నిర్మించుకుంటున్న వారికి ఆ హక్కు లేదు. తెలుగును మనం మాత్రం ఏం నిలుపుకుంటున్నాం? తెలుగు విద్యామాధ్యమంగా కనీసస్థాయిలో అయినా బతికించుకోవాలని కోరుకుంటున్న వారిని హేళన చేస్తున్నాం. తిండి పెట్టే విద్యను, ఉపాధినిచ్చే భాషను తిరస్కరిస్తే భవిష్యత్తు ఏమిటని నిలదీస్తున్నాం. ఉస్మానియా యూనివర్సిటీ స్థాపన నాటికే నాటి ప్రభుత్వానికి ఈ అంశంపై ఒక స్పష్టత ఉన్నది. బహుళభాషా రాజ్యమైన హైదరాబాద్‌లో ఎక్కువమందికి అర్థమయ్యే భాషగా ఉర్దూను గుర్తించడంలో, తెలుగుకు అన్యాయం జరిగి ఉండవచ్చు. తెలుగు మాధ్యమంగా వెలిగిన కాలంలో, ఉర్దూకు పట్టిన గతి ఏమిటి? అనేక గిరిజన భాషల పరిస్థితి మాత్రం ఏమిటి? భారతీయ భాష అయిన ఉర్దూలో సకల విద్యాంశాలనూ బోధించాలన్న నిర్ణయం సామాన్యమైనది కాదు. అదే సమయంలో, ఇంగ్లీషును తప్పనిసరిగా అందరూ నేర్చుకునేట్టు విద్య ఉండాలన్న షరతూ ఉండింది. శాస్త్రసాంకేతిక అంశాలను ఉర్దూలో బోధించడంలో అనేక సమస్యలున్నాయి. ఉర్దూలోనే కాదు, ఏ భారతీయ భాషలో నేర్పించాలన్నా పరిభాషకు, వ్యక్తీకరణకు సంబంధించి సమస్యలుంటాయి. దాన్ని అధిగమించడానికి ఉస్మానియా యూనివర్సిటీ ప్రత్యేకంగా అనువాద విభాగాన్ని ఏర్పరచి, గణితం, భౌతిక శాస్త్రాలను ఉర్దూలో రచింపజేయడానికి వీలు కల్పించారు. ఇవాళ తెలుగు ఆధునిక భాషగా ఎదగాలంటే కూడా జరగవలసింది అటువంటి కృషే. బోధనా భాష సంగతి పక్కన పెట్టండి. కనీసం ఒక సబ్జెక్టుగా పదోతరగతి వరకైనా తెలుగును నిర్బంధం చేయమంటే తెలుగు పాలకుల స్పందన ఏమిటి?

ఉర్దూ బోధనా మాధ్యమంగా యూనివర్సిటీని స్థాపించడం దేశవ్యాప్తంగా నాడు జాతీయవాదుల ప్రశంసలకు పాత్రమైంది. "విదేశీ భాష విశృంఖలాల నుంచి విముక్తమై, విద్య అందరికీ సహజంగా అందే రోజు కోసం దీర్ఘకాలంగా ఎదురుచూస్తున్నాను. ఈ సమస్య పరిష్కారం దేశీయ రాజ్యాలలోనే సాధ్యపడుతుందని అనుకున్నాను. మీ రాజ్యం ఉర్దూ భాషలో బోధించే విశ్వవిద్యాలయాన్ని స్థాపించనున్నదని తెలిసి ఎంతో ఆనందం కలిగింది" అని రవీంద్రనాథ్ ఠాగూర్ నిజామ్‌కు రాసిన లేఖలో ప్రశంసించారు. జాతీయోద్యమ కాలంలో ఒక దేశీయ సంస్థానం జాతీయవాద దృష్టితో ఉర్దూ భాషపై వైఖరి తీసుకోగా, స్వాతంత్ర్యానంతరం కేంద్ర ప్రభుత్వం ఉర్దూ స్థానంలో హిందీని బోధనా మాధ్యమం చేసే ప్రయత్నం చేసింది. ఆ సమయంలో యాక్టింగ్ వైస్‌ఛాన్సలర్‌గా ఉన్న దేవులపల్లి రామానుజరావు కేంద్ర ప్రభుత్వ ప్రయత్నం మీద తీవ్ర నిరసన తెలిపారు. హిందీ యూనివర్సిటీగా మార్చాలనుకోవడం ఉత్తరాది ఆధిపత్యానికి చిహ్నమని ఆయన వాదించారు.

విద్యాప్రమాణాలకు, ఉత్తమశ్రేణి మానవశక్తి రూపకల్పనకు ఉస్మానియా పెట్టింది పేరుగా ఉండేది. ఇప్పటికీ అనేక విభాగాలలో ఉస్మానియా జాతీయ స్థాయిలో తొలిర్యాంకులలో కొనసాగుతున్నది. ఉస్మానియా పూర్వవిద్యార్థుల జాబితాను చూస్తే కళ్లు మిరుమిట్లు గొలుపుతాయి. ఎంతమందిని, ఎంతటి శాస్త్రవేత్తలను, రచయితలను, కవులను, మేధావులను, రాజకీయ నేతలను, పాలనాదక్షులను, విప్లవకారులను, మితవాద అగ్రనేతలను ఈ విశ్వవిద్యాలయం దేశానికి అందించింది!

నిజాం వ్యతిరేక ఉద్యమంలోని రకరకాల ధోరణులకు ఉస్మానియా వేదికగా ఉండింది. మతపాక్షిక జాతీయవాద శక్తులు, వామపక్షీయులు, కాంగ్రెస్ పక్షీయులు ఉస్మానియా విశ్వవిద్యాలయ విద్యార్థులలో ఉండేవారు. 1960 దశకం చివరి నుంచి విప్లవ విద్యార్థి ఉద్యమానికి ఉస్మానియానే కేంద్రం అయింది. సుమారు రెండు దశాబ్దాలపాటు విద్యార్థిలోకం చైతన్యానికి ఇంధనాన్ని అందించింది. తొట్టతొలి ముల్కీ ఉద్యమం దగ్గర్నుంచి ఇటీవలి ప్రత్యేక తెలంగాణ ఉద్యమం వరకు ఉస్మానియా యూనివర్సిటీయే ప్రేరణ స్థలంగానూ, రణస్థలంగానూ ఉండింది. తెలంగాణ సమాజానికి తనను తాను ఒక ప్రతీక చేసుకుని, దిగ్బంధ ఉస్మానియా కేంపస్ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో పోరాడింది. ఉద్యమాలకు ఆలోచనా శక్తిని, కార్యకర్తల బలాన్ని ఇచ్చింది. నాయకత్వం తప్పొప్పులను ఎత్తిచూపడానికి ఉద్యమకాలంలోనూ వెనుకాడలేదు. తరువాత కాలంలోనూ వెనుకాడడం లేదు. ఉస్మానియా లేకపోతే తెలంగాణ రాష్ట్రమే లేదు. ప్రత్యేకరాష్ట్రం ప్రయోజనాలను అనుభవిస్తున్నవారు నిరంతరం ఉస్మానియాకు మొక్కులు చెల్లించుకున్నా రుణం తీరదు.

ఉస్మానియా శతవార్షికోత్సవం

జరుపుకుంటున్న సందర్భం విద్యారంగంలో, స్వేచ్ఛాలోచనల వ్యాప్తిలో తీవ్రమయిన నిరోధాలు ఎదురవుతున్న సందర్భం. పబ్లిక్ సంస్థలుగా యూనివర్సిటీలు సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న కాలం. దేశీయమైన, చారిత్రకమయిన యూనివర్సిటీలను చేజేతులా చిదిమివేసి, ప్రైవేటు, విదేశీ యూనివర్సిటీలకు ఎర్రతివాచీలు పరుస్తున్నారు. సామాజికశాస్త్రాలు పూర్తిగా అణగారిపోతున్నాయి. ప్రలోభాలను, స్వార్థాన్ని తప్ప ఏ నైతికతనూ విద్య అలవర్చలేకపోతున్నది. ఉస్మానియా వంటి సంస్థలు ఏ ఆశయాలతో పుట్టాయో, ఎటువంటి చారిత్రక సందర్భాలలో ఎదుగుతూ వచ్చాయో, ఏ ఏ సామాజిక సంచలనాలకు వేదికలుగా ఉంటూ, ప్రజల విషయంలో విద్యావంతుల బాధ్యతలను నెరవేరుస్తూ వచ్చాయో ఒకసారి గుర్తుకు తెచ్చుకోవలసిన సందర్భం కూడా ఇది.

అధికారికమైన వేడుకలు జరుగుతాయి. జరగవలసిందే. పాలకుల నుంచి నిధులను, ఖాళీల భర్తీని, అనేక ఆధునికీకరణలను డిమాండ్ చేయవలసిందే. ఉస్మానియా తలుపులను ప్రజాస్వామిక పవనాలకు ఎప్పుడూ తెరచి ఉంచే హక్కు కోసం కూడా అడిగి తీరాలి. కేవల వేడుకలతో, స్ఫూర్తిని సాధ్యమైనంత పలచబరచి, కేవలం అట్టహాసం చూపినందువల్ల ఉపయోగం లేదు. వేడుక కేవలం అధికారికమైనదే కానక్కర్లేదు. ఉస్మానియా వందేళ్ల పండుగ దాని భౌగోళిక పరిధికి మాత్రమే పరిమితం కావలసిన పనిలేదు. హైదరాబాద్ రాజ్యానికి అంతటికీ అది తొలి విశ్వవిద్యాలయం. సుదీర్ఘకాలం తెలంగాణకు అదొక్కటే యూనివర్సిటీ. కాకతీయతో మొదలుపెట్టి, తెలంగాణ యూనివర్సిటీ దాకా అన్నిటికీ ఉస్మానియాయే తల్లి. ఉస్మానియా ఆవిర్భావం ఈ అన్ని ప్రాంతాలకు చెందిన విద్యావంతులదీ. ప్రతి ఒక్కరూ తమకు తెలిసిన ఉస్మానియా గురించి, తాము జీవించిన ఉస్మానియా పార్శ్వం గురించీ తలచుకుని సంబరపడవలసిన సమయం ఇది. అధ్యాపక పోస్టులను అసంఖ్యాకంగా ఖాళీగా ఉంచి, శిథిల విద్యాలయంగా మార్చడానికి ప్రయత్నిస్తున్న విధానాలకు తిరస్కారం చెప్పవలసిన తరుణం కూడా ఇదే. శాస్త్రవిజ్ఞాన రంగాలలోను, సామాజిక శాస్త్రాలలోను సవ్యసాచిలా అసమాన ప్రతిభలను ఆవిష్కరించిన ఉస్మానియా స్ఫూర్తితో, అన్ని చదువులను కాపాడుకోవడానికి ప్రపంచమంతా వ్యాపించిన పూర్వ విద్యార్థులు సంకల్పం చెప్పుకోవాలి. అవిద్య అలముకున్న తెలంగాణలో ఆశాదీపంలా ఆవరించిన ఉస్మానియాను, నూతన తెలంగాణ నిర్మాణంలో ఒక సజీవ బౌద్ధిక కేంద్రంగా నిలబెట్టుకోవాలి.

(ఆంధ్రజ్యోతి సౌజన్యంతో) ❍

# 'ప్రజలే ప్రభువులు' అని బడ్జెట్‌లో ఉటంకిస్తే చాలదు, పౌర సేవల చట్టం తెండి: విద్యార్థిసత్తా



తీసుకుంటున్న పన్నులకు తగ్గ సేవలను అందించనప్పుడు ప్రభుత్వానికి అర్థమే ఉండదని లోక్‌సత్తా పార్టీ అనుబంధ విద్యార్థిసత్తా తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు పెద్దగల్ల రాజీవ్ అన్నారు. 'ప్రజలే ప్రభువులు' అన్న లోక్‌సత్తా నినాదాన్ని బడ్జెట్‌లో ఉటంకిస్తే చాలదని, అమలులో చూపాలని అన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజలకు లంచాలు లేకుండా, గౌరవంగా, హక్కుగా సేవలు అందించేందుకు 'పౌర సేవల' (రైట్ టూ సర్వీసెస్/సర్వీస్ గ్యారంటీ) చట్టాన్ని వెంటనే తీసుకు రావాలన్నారు. నిర్ణీత గడువులోగా ప్రభుత్వ సేవ అందకపోతే రోజుకు రూ.250కి తక్కువ కాకుండా దరఖాస్తు చేసుకున్న ప్రజలకు పరిహారం చెల్లించే ఏర్పాటు ఉండాలన్నారు. లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ ఇప్పటికే ఈ చట్టం ముసాయిదాను పంపారని, భేషజాలు లేకుండా చర్చించి ఆమోదించాలన్నారు. రాజీవ్ అధ్యక్షతన విద్యార్థిసత్తా రాష్ట్ర కమిటీ సమావేశం జరిగింది. రమాకాంత్, వినోద్, అజయ్, సునందరాజు, మనోహర్ తదితర నేతలు పాల్గొన్నారు. ❍

# తప్పదన్నట్టు తయారుచేసినట్టుంది!

ఒక దేశాన్ని అగ్రస్థాయికి తీసుకెళ్లాలనుకున్న పార్టీగానీ, సంస్థగానీ, నాయకులుగానీ ముందు దృష్టి పెట్టాల్సింది ఆరోగ్యం, విద్యా రంగాలపైనే. ప్రపంచవ్యాప్తంగా అభివృద్ధి అనుభవాలు ఇదే రుజువు చేస్తున్నా.. దశాబ్దాలుగా మన నేతలకు మాత్రం పట్టటం లేదు. తనను తాను చారిత్రక నాయకుడిగా భావించుకుంటున్న మోదీ కూడా ఇందుకు మినహాయింపు కాదు. దేశంలో మార్పు తేవటానికి కీలకమైన ఈ రెండు రంగాలపై చాలా ఆలస్యంగా స్పందిస్తూ, ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారు. మోదీ అధికారంలోకి వచ్చిన వెంటనే, 2014లోనే లోక్‌సత్తా జయప్రకాష్ నారాయణ్ మోదీకి ఆరోగ్యరంగంపై దృష్టి సారించాలని నోట్ పంపించారు. జీడీపీలో 2.3–2.5శాతం నిధులతోనే అందరికీ ఆరోగ్యం అందించే విధానాన్ని రూపొందించి 2015–16లో నీతి ఆయోగ్ ముందు ప్రజంటేషన్ ద్వారా ప్రభుత్వానికి అందచేశారు. అంతకుముందు యూపీయే ప్రభుత్వ హయాంలో.. ఆరోగ్య రంగానికి జాతీయాదాయంలో 2.5శాతం కేటాయిస్తామని హామీ ఇచ్చిన దరిమిలా, బ్రిటన్ సార్వత్రిక ఆరోగ్య పథకం (ఎన్‌హెచ్ఎస్) తరహాలో జేపీ జాతీయ ఆరోగ్య మిషన్‌ని రూపొందించి ఇచ్చారు. అయితే యూపీయే మాట తప్పి ఈ మిషన్‌ని కేవలం జాతీయ గ్రామీణ ఆరోగ్య మిషన్‌గా పరిమితస్థాయిలోనే 2006 నుంచి అమలు చేసింది. ఆ నిర్లక్ష్యం దేశాన్ని తీవ్రంగా నష్టపరిచి ఆరోగ్య ఖర్చులతో ప్రజలు పేదలుగా మారిపోయే పరిస్థితిని కల్పించింది. ప్రపంచ దేశాల అనుభవాలను అధ్యయనం చేసి, జాతీయ ఆరోగ్య మిషన్ అనుభవంతో జీడీపీలో తక్కువ వ్యయంతోనే, జేపీ జాతీయ ఆరోగ్య నమూనాను తయారుచేసి మోదీ ప్రభుత్వానికి అందించారు. తాజాగా మోదీ ప్రభుత్వం ప్రకటించిన జాతీయ ఆరోగ్య విధానం నమూనాలో లోక్‌సత్తా పేర్కొన్న నివారణ, టీకాల విస్తరణ, ప్రాథమిక ఆరోగ్యం, రోగి వివరాల నమోదు, జనరిక్ మందులు వంటి కొన్ని అంశాలకు పెద్ద పీట కనిపిస్తుంది కానీ, వాటి ఆచరణ సాధ్య అమలుకు లోక్‌సత్తా చూపిన నూతన పరిష్కారాలు కనిపించటం లేదు. అంతా పైనుంచి ప్రభుత్వమే చేయగలదు అనే గుమాస్తా ఆలోచనా తీరే కనిపిస్తోంది. పాత లక్ష్యాలను సాధించటానికి పాత మార్గాలనే ఎంచుకోవటం, తమ పార్టీ వారు గతంలో ప్రతిపాదించారు కాబట్టి అనుసరించటం వల్ల (యూపీయే చెప్పినట్టుగానే) ఆరోగ్యరంగానికి 2.5శాతం నిధుల్ని కేటాయిస్తామన్నా చివరికి లక్ష్య సాధన అనుమానాస్పదమే అవుతుంది. నివారణ, ప్రాథమిక వైద్యం, అది కూడా దేశంలో అత్యధిక భాగం విస్తరించి వున్న గ్రామీణ ప్రాంతాలకు అందించటం– దేశ ఆరోగ్యరంగం ముందున్న పెనుసవాళ్లు. వైద్యంలో నైతిక విలువల ప్రాధాన్యత కూడా వైద్యసేవలపై ప్రభావం చూపుతున్న దశ ఇది. ఈ నేపథ్యంలో తమకు నచ్చిన వైద్యుడ్ని ఎంచుకునే స్వేచ్ఛ ప్రాథమిక స్థాయిలో ప్రజలకు ఉండటం కీలకమని లోక్‌సత్తా ప్రతిపాదించింది. రాష్ట్రాలతో సమన్వయం చేసుకుంటూ, ఇలా 1కోటి ఉద్యోగాలను కూడా ఎలా సృష్టించవచ్చో తెలియచెప్పింది. దేశంలో భవిష్యత్తు ఉద్యోగాల సృష్టికి ఆరోగ్య విభాగం కీలకమని తాజాగా ఇతర నివేదికలు కూడా తెలియచేస్తున్నాయి. అలాగే ఖర్చు ఎక్కువుండే తృతీయ దశ వైద్యానికి ఉండాల్సిన ఏర్పాట్లు, బీమా పథకాలు మున్ముందు ఎంత భారంగా మారతాయి వగైరా అంశాల్ని కూడా ప్రపంచ దేశాల అనుభవాల నేపథ్యంలో లోక్‌సత్తా వివరించింది. అన్ని జాగ్రత్తలు అవసరం లేకుండానే దేశంలో అందరికీ ఆరోగ్యం ఇచ్చేస్తామనటం ప్రచారానికి పనికొస్తుందిగానీ పెద్దగా ఫలితాలు కనిపించకపోవచ్చు. ప్రజాధనం, సమయం వృధా కాకుండా చూసుకోకపోతే నివారించదగ్గ బాధలతో కోట్లమంది నలిగిపోతారు. సకాలంలో సరైన ఆచరణాత్మక మార్పుని చేపట్టకపోతే ఎంత నష్టం జరుగుతుందో పొరుగున ఉన్న చైనా ఇప్పటికే మనకు తెలియచెప్పింది. చైనా, తైవాన్ వంటి దేశాలు మేలుకొన్న సమయంలో మనం కాలక్షేపం, తాత్కాలిక తాయిలాల ధోరణితో వ్యవహరించటం వల్ల గొప్ప అవకాశాల్ని కోల్పోయాం. కేవలం పదేళ్ల వ్యవధిలో 10కోట్లకు పైగా ఉద్యోగాలను సృష్టించి కోట్లమందిని పేదరికం నుంచి బైటికి లాగి చైనా అద్భుతాన్ని సృష్టిస్తే, మనం మాత్రం ఏదో ప్రచారానికి కాస్త అభివృద్ధి చాలన్నట్టు జనాన్ని శాశ్వత పేదరికంలో కొనసాగిస్తూ 1కోటి ఉద్యోగాలను కూడా సృష్టించలేకపోయాం. ప్రజాస్వామ్యం మన బలహీనత అనుకోనక్కర్లేదు. ప్రజాస్వామ్య సంస్కృతితోనే అనేక దేశాలు అభివృద్ధి చెందిన ఉదాహరణలు చుట్టూనే ఉన్నాయి. తప్పదన్నట్టు తయారుచేసిన నూతన జాతీయ ఆరోగ్య విధానంలోని లోపాల్ని మోదీ ప్రభుత్వం సరిదిద్దుతుందని ఆశిస్తూ, కొంత వేచిచూద్దాం.



(లోక్‌సత్తా 'అందరికీ ఆరోగ్యం' విధానం వివరాలను www.fdrindia.org వెబ్‌సైట్‌లో తెలుసుకోవచ్చు). ❍

# 'ఆరోగ్యానికి హామీ మాత్రమే'.. 2025 లక్ష్యంగా నూతన జాతీయ ఆరోగ్య విధానం

**2025** నాటికి లక్ష్యాలను ఏర్పరచుకుని కేంద్ర ప్రభుత్వం నూతన జాతీయ ఆరోగ్య విధానాన్ని వెలువరించింది. వివరాలను కేంద్ర ఆరోగ్య శాఖా మంత్రి పార్లమెంటుకు తెలియచేశారు. గత 15 ఏళ్లలో చోటు చేసుకున్న సాంఘిక–ఆర్థిక పరిస్థితులు, సాంకేతిక ప్రగతి, సాంక్రమిక వ్యాధుల తీవ్రత తదితర అంశాలను పరిగణలోకి తీసుకుని దీన్ని రూపొందించామన్నారు. వ్యాధులను నిరోధించటం, ఆరోగ్యకర జీవనశైలిని ప్రోత్సహించటం, నాణ్యమైన వైద్య సేవలను అందుబాటులో ఉంచటం అనే ఉన్నత ఆశయాలతో నూతన ఆరోగ్య విధానాన్ని రూపొందించామన్నారు.

**2025 నాటికి లక్ష్యాలు:**

- సరాసరి ఆయు:ప్రమాణం 67.5 సంవత్సరాల నుంచి 70 ఏళ్లకు పెంచటం
- మహిళల్లో సంతాన సాఫల్య రేటును 2.1కి నియంత్రించటం
- ఐదేళ్లలోపు పిల్లల మరణాలను ప్రతి వేయికి 23కి తగ్గించటం
- నవజాత శిశువుల నుంచి 16 ఏళ్లలోపువారి మరణాలు, గర్భస్థ శిశువుల మరణాలు ప్రతి వేయికి 9లోపు ఉండేలా చూడటం
- 2020నాటికి గర్భిణుల మరణాలు సున్నా శాతం ఉండేలా చర్యలు
- 2019నాటికి శిశుమరణాలు వేయికి 28కి పరిమితం చేయటం
- ఈ ఏడాదే బోదకాలు, కాలా అజార్ వ్యాధులను పూర్తిగా రూపుమాపటం
- వచ్చే ఏడాదికి కుష్టును పూర్తిగా నిర్మూలించటం
- ఎయిడ్స్ నిర్మూలనకు ప్రపంచ దేశాలు అనుసరిస్తున్న '90:90:90' సూత్రాన్ని అమలుచేయటం
- అంధత్వ వ్యాధులకు గురవుతున్నవారి సంఖ్యను 2025నాటికి మూడో వంతుకు తగ్గించటం




అన్నీ ఉచితమేనయ్యా. కాని డాక్టర్‌గారు లేరు, మందులూ మంచాలూ లేవు, నీ ఇష్టం...

- 2025 నాటికి గుండెజబ్బులు, క్యాన్సర్, మధుమేహం, దీర్ఘకాలిక శ్వాససమస్యల కారణంగా జరుగుతున్న మరణాలను 25శాతానికి తగ్గించటం

**నిధుల కేటాయింపు**

- ప్రజా వైద్యానికి ప్రస్తుతం స్థూల జాతీయోత్పత్తి (జీడీపీ)లో 2శాతం నిధులు కేటాయిస్తుండగా, దాన్ని 2.5శాతానికి దశలవారీగా పెంచనున్నారు
- 2/3 వంతు అంతకన్నా అధికమొత్తంలో నిధులను ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు ఇవ్వనున్నారు
- జాతీయ ఆరోగ్య లక్ష్యాలను అందుకోవడానికి ప్రయివేటు సేవలను స్వీకరించాలని, ప్రయివేటుతో సంబంధాలు అవసరమని భావిస్తున్నారు



## పనితోపాటు యోగా

- వ్యాధులకు గురికాకుండా ఆరోగ్యకర జీవనశైలిని అవలంబించేలా చేపట్టే కార్యక్రమాలకు ప్రోత్సాహం కల్పిస్తారు. ఇందులో భాగంగా పాఠశాలలు, పని ప్రదేశాల్లో యోగాకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు.
- ఆరోగ్యం, పారిశుద్ధ్యాన్ని పాఠశాలల్లో పాఠ్యాంశాలుగా ప్రవేశపెట్టనున్నారు

## చికిత్స దశలో మార్పులు

- వ్యాధుల చికిత్సలో 'ఆయుష్ విధానాల'తో సమన్వయం ఉండేలా త్రిముఖ వ్యూహానికి రూపకల్పన. వ్యాధుల నిర్ధారణ దశలోనే ఈ సమన్వయం ఉండేలా చూస్తారు. దీంతో నాణ్యమైన చికిత్స అందడంతోపాటు, వ్యాధులను నిరోధించే అవకాశం కలుగుతుంది. ఖర్చులు కూడా తగ్గుతాయి.
- ప్రమాదం జరిగిన తక్షణమే వైద్య సహాయం అందేలా చూసేందుకు తగిన ఏర్పాట్లు చేస్తారు. ఇందుకోసం ప్రతి వేయి మందికీ రెండు పడకలు ఉండేలా సౌకర్యాలు కల్పించనున్నారు.
- ప్రాథమిక స్థాయిలోనే సమగ్ర వైద్య సేవలు అందించడానికి ప్రాధాన్యం ఇవ్వనున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు 'ఆరోగ్య, సౌభాగ్య కేంద్రాలు'గా పనిచేయనున్నాయి.
- ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచితంగా పరీక్షలు నిర్వహించడంతోపాటు ఉచితంగా మందులు ఇస్తారు
- అన్ని రాష్ట్రాల్లోనూ ప్రజారోగ్య నిర్వహణ కేడర్ (పీహెచ్ఎంసీ)ని ఏర్పాటు చేయనున్నారు

## రోగులకు అండ

- వైద్యసేవలు పొందడానికి వీలుగా ప్రతి కుటుంబానికీ ఆరోగ్య కార్డు ఇవ్వనున్నారు
- వైద్యులు అందించిన చికిత్సలు, సేవలపై ఏవైనా ఫిర్యాదులు ఉంటే వాటిని పరిష్కరించడానికి వీలుగా ప్రత్యేక ట్రైబ్యునళ్లు ఏర్పాటు చేయనున్నారు
- జాతీయ ఆరోగ్య భద్రత ప్రమాణాల సంస్థను ఏర్పాటు చేసి వైద్య సేవలపై విధివిధానాలను రూపొందించనున్నారు
- ప్రభుత్వ, ప్రయివేటు వైద్యసంస్థలను నిర్ణీత కాలపరిమితిలో తనిఖీ చేసి గ్రేడ్లు ఇవ్వనున్నారు

భారత్‌లో తయారీకి ప్రోత్సాహం

- భారత్‌లో తయారీ అన్న నినాదంలో భాగంగా మందులు, వైద్య పరికరాల తయారీని ప్రోత్సహించనున్నారు. ఇందుకు సంబంధించిన నియంత్రణ వ్యవస్థల్లో మార్పులు తీసుకురానున్నారు.
- వైద్య విద్యలోనూ సంస్కరణలు తీసుకొస్తారు

వైద్య సెస్సు విధించాలని ముసాయిదాలో ప్రతిపాదించినా దాన్ని అమలు చేయబోవడం లేదని మంత్రి తెలిపారు. ఆరోగ్య సేవలు పొందడాన్ని 'ప్రాథమిక హక్కు'గా గుర్తించాలన్న సూచనలు వచ్చినా వనరుల కొరత కారణంగా అది అమలు సాధ్యం కాదన్నారు. అందుకే హక్కుగా కాకుండా.. 'అందరికీ ఆరోగ్య హామీ'గా (హామీల అమలులో ఈ కేంద్ర ప్రభుత్వ రికార్డుపై పలు రాష్ట్రాలకు ఇప్పటికే అనుభవముంది. ఏపీ ప్రత్యేక హోదా విషయంలో తెలుగువారికి బాగా తెలిసొచ్చింది. ఢిల్లీవాళ్లని నమ్మలేకే.. చివరికి ఒక సాదాసీదా ప్యాకేజీకి కూడా చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేయాల్సి వచ్చింది) మార్చినట్టు చెప్పారు. ❍

# భారత ప్రజారోగ్యం .. ఇంత అనారోగ్యం!




మనదేశంలో శిశుమరణాల రేటు తగ్గిందని, లింగ నిష్పత్తి రేటు పెరిగిందని జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే (ఎన్ఎఫ్‌హెచ్ఎస్) నాలుగో దశ సర్వే తెలిపింది. 6 లక్షల కుటుంబాలు, 7లక్షలమంది మహిళలు, 1.3లక్షల మంది పురుషుల నుంచి సమాచారం సేకరించడం ద్వారా ఈ సర్వే నిర్వహించారు. తొలిసారిగా జిల్లా స్థాయి అంచనాల్నీ రూపొందించారు.

2005-06లో నిర్వహించిన కుటుంబ ఆరోగ్య సర్వే మూడవ దశకు, తాజా (2015-16) నాలుగవ దశకు మధ్య ప్రతి వెయ్యి జననాలకు గాను శిశుమరణాల రేటు 57 నుంచి 41కి తగ్గింది. గత దశాబ్ది కాలంలో దాదాపు అన్ని రాష్ట్రాలోనూ ఈ రేటు తగ్గింది. ప్రతి వెయ్యి మగవారికి, మహిళల సంఖ్యను పేర్కొనే పుట్టుకతో లింగనిష్పత్తి గత దశాబ్ది కాలంలో జాతీయస్థాయిలో 914 నుంచి 918కి పెరిగింది. కేరళలో అధికంగా 1,047 ఉండగా, మేఘాలయలో 1009, ఛత్తీస్‌గఢ్‌లో 977గా నమోదైంది. తెలంగాణలో మాత్రం ఈ నిష్పత్తి తగ్గింది. మరో పదిహేనేళ్ల తర్వాత తెలంగాణలో ప్రతి 1000మంది అబ్బాయిలకు 827మంది మాత్రమే అమ్మాయిలు ఉంటారని సర్వే హెచ్చరించింది. ఆసుపత్రుల్లో కాన్పులు 40 పర్సంటేజీ పాయింట్లు పెరగ్గా, ప్రభుత్వ ఆసుపత్రుల్లో 34.1శాతం పెరిగాయి. టీకాల కవరేజీ 44శాతం నుంచి 70శాతానికి పెరిగింది. లోక్‌సత్తా జేపీ ఎన్నో ఏళ్లుగా వాదిస్తున్న ర్యుబెల్లా వ్యాక్సిన్‌ను కూడా అందుబాటులోకి తెచ్చారు. పౌష్టికాహారలోపం 10శాతం మేరతగ్గగా, బరువు తక్కువ పిల్లలు 42.5శాతం నుంచి 35.7శాతానికి తగ్గారని సర్వే తెలిపింది.

కానీ ఇవన్నీ కేవలం కంటితుడుపు మెరుగుదలలేనని, దేశ ఆరోగ్యరంగం తీవ్ర సంక్షోభంలో ఉందని మిగిలిన అనేక గణాంకాలు చెబుతున్నాయి. ప్రభుత్వాల ప్రజారోగ్య విధాన వైఫల్యమే ఇందుకు కారణం.

ఆరోగ్యరంగంపై ప్రపంచ సరాసరి వ్యయం జీడీపీలో 5.99శాతంకాగా, భారత్ కేవలం 1శాతానికి కాస్త అటూఇటుగా ఖర్చు చేస్తోంది. జీడీపీలో 2-3శాతం వ్యయంతోనే, అది కూడా 1కోటి ఉద్యోగాలను సృష్టిస్తూ అందరికీ ఆరోగ్యం అందించే నమూనాను లోక్‌సత్తా అందించినా, నరేంద్ర మోదీ ప్రభుత్వం అందులోని అంశాలను అరకొరగానే తీసుకుంటోంది. జీవనశైలి వ్యాధులు పెరిగే అవకాశమున్నందున.. బీమా, యోగాలతో ఆరోగ్యం అందించేయొచ్చన్న భ్రమల నుంచి ఇంకా బైటికి రావటం లేదు.

నివారణ, ప్రాథమిక చికిత్స, గ్రామీణ దృష్టి - స్థానిక ఏర్పాట్లు వంటి అంశాల చుట్టూ ఆరోగ్య బడ్జెట్‌ను అనుసంధానం చేయకుండా కేవలం బీమా మీదే ఆధారపడితే ప్రజలపై, ప్రభుత్వంపై ఆరోగ్యభారం ఇంకా పెరుగుతుందని హెచ్చరిస్తున్న గణాంకాలివి..

- ఐక్యరాజ్యసమితి ఇటీవల ప్రకటించిన 188 దేశాల జాబితాలో ఆరోగ్య రంగాన భారత్ నూట నలభై మూడో స్థానంలో ఉంది
- తమ జీవితకాలంలో స్పెషలిస్ట్ వైద్యుడ్ని ఒక్కసారైనా చూడని భారతీయుల సంఖ్య 70 కోట్లని పార్లమెంటరీ స్థాయీ సంఘం తెలిపింది

- మన దేశ ఆరోగ్య సంరక్షణ వ్యయంలో ప్రభుత్వ వాటా 30శాతం కన్నా తక్కువే. మిగిలినదంతా ప్రజలు జేబుల్లో నుంచే ఖర్చు చేస్తున్నారు.
- జబ్బు ముదిరాక అందించే ద్వితీయ, తృతీయ అంచె వైద్యసేవలు లాభదాయకం కాబట్టి ప్రైవేటు రంగం వీటిపైనే ఎక్కువ నిధులు ఖర్చు పెడుతోంది. అందువల్లే.. ప్రాథమికాన్ని నిర్లక్ష్యం చేసే ప్రభుత్వ ఆరోగ్య స్కీములు ప్రైవేటు, కార్పొరేట్‌లకు లాభసాటి వ్యాపారంగా మారాయి. ప్రైవేటు రంగ నిధుల్లో 38.1శాతం ద్వితీయ అంచెపైన, 17.1శాతం తృతీయ అంచె సేవలపైన ఖర్చు చేస్తున్నారు.
- ఆరోగ్యశ్రీ సహా ప్రభుత్వ ఆరోగ్య పథకాల వల్ల పేద, మధ్యతరగతివారికి ఒనగూరే మేలుకన్నా, వైద్యశాలలకు మిగిలే లాభాలే అధికం.
- 57శాతం గ్రామీణులు ఆర్థిక స్తోమత లేక సరైన వైద్యం చేయించుకోలేక పోతున్నారు
- గ్రామాల్లో 68శాతం మంది చికిత్స కోసం కుటుంబ ఆదాయం, పొదుపు మొత్తాలపై ఆధారపడుతుండగా, 25శాతం మంది అప్పుల్ని ఆశ్రయిస్తున్నారు
- సంపన్నులు ఏటా తాము వస్తుసేవలపై చేస్తున్న వ్యయానికి సమానమైన మొత్తాన్ని ఆసుపత్రి చికిత్సకు వెచ్చిస్తున్నారు. పేదప్రజలు తమ వార్షిక ఆదాయానికి రెట్టింపు సొమ్ముని వైద్య చికిత్సలకు వెచ్చించాల్సి వస్తోంది.
- 2014 లెక్కల ప్రకారం ఏటా ప్రతి వెయ్యిమందిలో 44మంది ఆసుపత్రి పాలవుతున్నారు. 2004-2014 మధ్యకాలంలో వైద్యఖర్చులు సగటున పట్టణ ప్రాంతాల్లో 176శాతం పెరగ్గా, గ్రామీణ ప్రాంతాల్లో ఇవి 160శాతం అధికమయ్యాయి. ఆసుపత్రిలో చికిత్స పొందటానికి ఒక్కొక్కరికి పట్టణ ప్రాంతాల్లో రూ.25,000, పల్లె ప్రాంతాల్లో 15,000 అవుతోంది.
- చేతిలో డబ్బు లేకపోవటం వల్ల చాలామంది పేదలు సకాలంలో చికిత్స చేయించుకోలేకపోతున్నారు. దీనివల్ల వ్యాధులు ముదిరి ప్రాణాంతకమవుతున్నాయి.
- చికిత్సకయ్యే ఖర్చులే దేశ పేదరికంలో ఆరో వంతుకు కారణమని ముంబయిలోని టాటా సామాజిక శాస్త్ర పరిశోధన సంస్థ 2011లో చేసిన అధ్యయనం నిర్ధారించింది
- మనదేశంలో ఏటా 4కోట్లమంది వైద్యఖర్చుల వల్ల దారిద్ర్యంలో కూరుకుపోతున్నారని రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ ఇటీవల 'ఎయిమ్స్' 40వ స్నాతకోత్సవంలో పేర్కొన్నారు
- పౌరుల ఆరోగ్య సంరక్షణకు కేంద్ర ప్రభుత్వం రూ.44,564 కోట్లు ఖర్చు చేస్తుంటే, రాష్ట్రాలు రూ.85,215 ఖర్చు చేస్తున్నాయి
- మొత్తం వ్యయంలో కేంద్రం వాటా 34శాతమైతే, రాష్ట్రాల వాటా 66శాతం
- ప్రస్తుత మార్కెట్ ధరల ప్రకారం భారత్‌లో తలసరి ఆరోగ్యవ్యయం రూ.957
- ఇందులో రూ.325 కేంద్ర ప్రభుత్వ వాటా కాగా, రాష్ట్ర ప్రభుత్వాల వాటా రూ.632
- దేశంలోని మౌలిక వసతుల కల్పనపై చేస్తున్న మొత్తం వ్యయంలో కేవలం 0.21శాతమే ఆరోగ్యరంగంలో వసతులకు ఖర్చు చేస్తున్నారు
- అందుకే ప్రతి వెయ్యిమందికి 0.5 పడకలు మాత్రమే అందుబాటులో ఉన్నాయి
- ముప్పయి రెండున్నర కోట్ల జనాభా ఉన్న అమెరికాలో దాదాపు తొమ్మిది లక్షల ఆసుపత్రి పడకలుంటే, 130 కోట్ల జనాభా ఉన్న మనదేశంలోని 12,760 సర్కారీ ఆసుపత్రుల్లో 5.76లక్షల పడకలే ఉన్నాయి
- ప్రపంచ ఆరోగ్య సంస్థ నిబంధనావళి ప్రకారం జనాభాలో ప్రతి వెయ్యిమందికీ ఒక వైద్యుడు ఉండాలి. కానీ మనదేశంలో సగటున 11వేల మందికి ఒక అల్లోపతి డాక్టర్ ఉన్నారు. ఉన్న చాలీచాలని సిబ్బందిలోనూ 57శాతానికి ప్రామాణిక అర్హతలు లేవు.
- దేశంలో ఆరోగ్య సంరక్షణ రంగం ఏటా 15శాతం పెరుగుతున్నా, ప్రభుత్వ కేటాయింపులు ఆ స్థాయిలో లేవు
- గత పదేళ్లలో చికిత్స ఖర్చులు ద్రవ్యోల్బణాన్ని మించి పెరిగాయి

(2016లో ప్రచురించిన జాతీయ ఆరోగ్య వ్యయ మూల్యాంకనం (ఎన్‌హెచ్‌ఏ) ప్రధాన ఆధారంగా). ❍

# ప్రజారోగ్యానికి పట్టం కడుతున్న బ్రిటన్

- ఆకార్ పటేల్



విరిగిన కాలుతో ఇంగ్లండ్‌లోని హెర్ట్‌ఫోర్డ్‌షైర్ నుంచి రాసిన వ్యాసమిది. బౌలింగ్ చేస్తుండగా నా ఎడమ కాలి పాదం లోపలికి మెలిదిరిగి పడ్డంతో నా చీలమండ పగిలింది. ఏదో తీవ్రమైన హానే జరిగిందని పడ్డప్పుడే అనుకున్నా. అయినా అదేదో బెణుకేనని, దానికదే నయమైపోతుందని పట్టించుకోలేదు. రెండు రోజులు గడిచేసరికి నా పాదం బెలూన్‌లాగా ఉబ్బిపోయింది. ఏం జరిగిందో తెలుసుకోడానికి డాక్టర్‌ను సంప్రదించాలనుకున్నా.

లండన్ హార్లీ స్ట్రీట్‌లో ఉన్న డాక్టర్‌కి ఫోన్ చేశా. ఆ రోజు మధ్యాహ్నమే ఆయన నన్ను చూస్తానన్నాడు గానీ, ఎక్స్-రే రిపోర్టు మరుసటి రోజుకుగానీ రాదని చెప్పాడు. అంతసేపు ఆగలేక దగ్గర్లో ఉన్న ప్రజాసుపత్రి యాక్సిడెంట్ అండ్ ఎమర్జెన్సీ వార్డ్‌కి వెళ్లాను.

నేను బెంగళూరు నుంచి వచ్చానని, కొద్దిరోజుల్లో తిరుగు ప్రయాణం చేయాల్సి ఉంటుందని అక్కడి వారికి చెప్పాను. అక్కడి సహాయకుడు నా కేసును రిజిస్టర్ చేసుకుని మరో డజను మందితో పాటు నన్ను కూడా వేచి ఉండమని చెప్పాడు. వారిలో కొందరి పరిస్థితి నాకంటే అధ్వాన్నంగా ఉంది.

దాదాపు ఓ అరగంట తర్వాత నన్ను ఒక నర్సును కలవమని పంపారు. ఆమె నన్ను చూసి ఎక్స్‌రే తీయించటానికి పంపారు. అక్కడి రేడియాలజిస్టు రెండు ఎక్స్‌రే ఫోటోలు తీసి ఎముక విరిగిందని చెప్పారు. మీరిలాగే నడుస్తున్నారా? అని అడిగితే, అవునన్నాను. వెంటనే ఓ వీల్ ఛైర్ తెప్పించి, డాక్టర్‌కు చూపించడానికి నన్ను మరో భవనంలోకి తీసుకుపోయారు. మరో అరగంట వేచి చూశాక ఆ డాక్టర్ (అక్కడి డాక్టర్లలో చాలామంది లేదా అత్యధికులు భారతీయులే) ఎక్స్‌రే స్కాన్ తీసిన చిత్రాన్ని నాకు చూపారు. చీలమండ ఎముక చుట్టూతా శంఖాకృతిలో పగిలి ఉంది.

పాదానికి తొడుక్కునే ఓ మూసను ఇస్తామని డాక్టర్ చెప్పారు. దానికోసం మరో అరగంట వేచి చూడాల్సి వచ్చింది. కొన్ని నిముషాలకు ఓ మహిళ గట్టిగా నా పేరు పిలిచి, నా బూటు సైజు ఎంతో అడిగారు. నేను పదకొండు అని చెప్పా. ఆమె పాదం మూసను తేవడానికి వెళ్లారు. తీరా చూస్తే అదో పెద్ద ప్లాస్టిక్ బూటు. బయటి కవచం గట్టిగా ఉండి, పాదానికి హాయిగా అమరేలా ఉబ్బేట్టు గాలిని నింపగలిగిన లోపలి భాగం ఉంది.

ఆ సాధనంతోపాటు రెండు పొడవాటి మేజోళ్లు కూడా ఉన్నాయి. సహాయకురాలు లేదా నర్సు ఓపికగా, పట్టింపుతో ఎలా దాన్ని వేసుకోవాలో తొడిగించి చూపారు. ఆ తర్వాత ఆమె మీకు ఏదైనా సీడీ ఇచ్చారా? అని అడిగారు. ఇవ్వలేదనేసరికి, నాతో పాటు మొదటి భవనానికి వచ్చి ఓ సీడీని బర్న్ చేసి ఇచ్చారు. భవనం నుంచి ఎలా బయటకు వెళ్లాలో కూడా చెప్పారామె. బయటకు వెళ్లటానికి మరో ఐదు నిముషాలు పట్టింది.

ఈ మొత్తం వ్యవహారానికీ నేను ఏమీ చెల్లించాల్సి రాలేదు. రిజిస్ట్రేషన్, కన్సల్టెన్సీ, ఎక్స్‌రే, పోత పోసిన పాదం తొడుగు అన్నీ ఉచితమే. కుంటుకుంటూ ఆసుపత్రిలోకి వెళ్లాక, తిరిగి బయటకు రావటానికి రెండు గంటలు పట్టింది.

బ్రిటిష్ పత్రికలు ఎప్పుడూ నేషనల్ హెల్త్ సర్వీస్ (ఎన్‌హెచ్ఎస్) లేదా జాతీయ ఆరోగ్య సేవ ఎంత ఘోరంగా ఉందో వివరిస్తూ కథనాలను వెలువరిస్తుంటాయి. అందుకే ఇదంతా రాయాల్సి వచ్చింది. శస్త్రచికిత్సలాంటి వాటికి

అపాయింట్‌మెంట్లు కావాలంటే రోజుల తరబడి ఎలా వేచి చూడాల్సి వస్తుందో ఆ కథనాలు వివరిస్తుంటాయి. ఎన్‌హెచ్‌ఎస్ అందించే వైద్యసేవలు పౌరులందరికీ ఉచితమే. ఎమర్జెన్సీ, యాక్సిడెంట్ వైద్యసేవలు సైతం పర్యాటకులతో సహా అందరికీ ఉచితమేననేది స్పష్టంగానే తెలుస్తూనే ఉంది. నా దృష్టిలో ఇది ఎంతో నాగరికమైన ప్రవర్తన.

బ్రిటిష్ పౌరుల అనుభవమూ, నాకు కలిగిన అనుభవమూ ఒకే విధమైనవి కాకపోవచ్చు. పైగా ప్రభుత్వ వైద్యసేవలపై తీర్పు చెప్పడానికి ఎమర్జెన్సీ విభాగం బహుశా ఉత్తమమైనది కాకపోవచ్చు. అయితే నా పట్ల చూపిన ఆ శ్రద్ధ, సమర్థతలు మాత్రం సక్రమంగా పనిచేసే వ్యవస్థ నుంచి ఉత్పన్నమైనవి కాకుండా ఉండటానికి వీల్లేదు.

నా చికిత్సకు ఏమీ చెల్లించాల్సి రాకపోవడం వల్ల నాలో అపరాధ భావన కలిగింది. కానీ నేను మనదేశంలో కట్టిన పన్నులు బ్రిటన్‌కు వలసపోయిన వేలాదిమంది భారత డాక్టర్లకు సబ్సిడీ విద్యను అందించాయి.

బ్రిటన్ ఎన్‌హెచ్‌ఎస్ కోసం ఏడాదికి రూ. 9.3లక్షల కోట్లు ఖర్చు చేస్తుంది. అంటే పౌరులు ఒక్కొక్కరికి దాదాపు రూ. 1.5లక్షలు. భారత కేంద్ర ప్రభుత్వపు వార్షిక ఆరోగ్య బడ్జెట్ రూ. 30,000–40,000కోట్లు. అంటే సగటున రూ. 260. మనది పేద దేశం నిజమే. కానీ మనం గత ఏడాది 36 యుద్ధ విమానాలను కొనటానికి రూ. 59,000కోట్లు ఖర్చు చేశాం. బుల్లెట్ ట్రైన్ కోసం ఏడాదిలో రూ. 99,000కోట్లు ఖర్చు చేస్తున్నాం.

ప్రజారోగ్య సేవలకు బదులుగా ఇలాంటి ఆటవస్తువుల కోసం ప్రభుత్వాలు మూర్ఖంగా ఖర్చు చేయడాన్ని బ్రిటన్ పౌరులు అనుమతిస్తారని అనుకోను. మన మీడియాలోను, దాని చర్చల్లోనూ పెత్తనం చెలాయించేది మధ్యతరగతే. అదే ఇలాంటి వాటిని ఎంపిక చేసి కోట్లాదిమంది పేదలపై వాటిని రుద్దుతుంది. అగ్ర రాజ్యం కావడం అంటే యుద్ధాలు చేయగలగడం, జపాన్ వారి సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రదర్శించి చూపడం, భారీ విగ్రహాలను నిర్మించడమేనని మనం భావిస్తాం. అదే బ్రిటన్‌లో అయితే నాగరిక దేశం అంటే తమ పౌరుడు అయినా కాకున్నా మనిషన్న ప్రతివాడికీ స్వస్థతను చేకూర్చగలిగిన, పోషించగలిగిన సమర్థవంతమైన ప్రభుత్వ యంత్రాంగాన్ని రూపొందించుకోగలగడం అని అర్థం. ❍

# గ్రామస్వరాజ్యం గుడ్లవల్లేరులో కనిపిస్తోంది: జేపీ



హైదరాబాద్‌లోని తార్నాక రెసిడెంట్స్ సంక్షేమ సంఘం నగరపాలనకు వికేంద్రీకరణ, స్వయంపాలన తోవ చూపినట్టే, ఆంధ్రప్రదేశ్ కృష్ణా జిల్లాలోని గుడ్లవల్లేరు గ్రామస్వరాజ్యానికి తోవ చూపుతోంది. గాంధీజీ కలలుగన్న గ్రామస్వరాజ్యం తనకు గుడ్లవల్లేరులో కనిపిస్తోందని ఇటీవల ఆ పంచాయతీ పరిధిలో పాదయాత్ర చేసిన లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. గ్రామంలోని లయన్స్ క్లబ్, వైకుంఠపురి, పంచాయతీ కార్యాలయం, ఎస్ఈఆర్ఎం విద్యాసంస్థలు, నెహ్రూ పశువుల సంత, ఐటీఐని సందర్శించారు. అనంతరం సింగలూరు గ్రామంలోనూ పర్యటించారు. గుడ్లవల్లేరు గ్రామమంటే తనకు చాలా ఇష్టమని, చిన్నప్పటి నుంచే ఇక్కడ అభివృద్ధి గురించి తెలుసని అన్నారు. దాదాపు 30 సంవత్సరాల తర్వాత ఈ గ్రామానికి వచ్చే అవకాశం లభించిందన్నారు. 40 ఏళ్ల క్రితమే గ్రామానికి వల్లభనేని రంగయ్య, అడుసుమిల్లి అశ్వత్థనారాయణ మూర్తి, వల్లూరిపల్లె శేషాద్రిరావు వంటి వారు ఒక మంచి బాట వేసి తర్వాతి తరాలకు మార్గం చూపారన్నారు. కులం ద్వారా తమకు సమకూరిన వనరుల్ని పెత్తందారీ సమాజంలో కూడా సమాజహితం కోసం వెచ్చించారన్నారు. ఉత్తమ గ్రామ పంచాయతీగా ఎన్నికై విద్య, పౌల్ట్రీ, పశుగణాభివృద్ధి రంగాల్లో గ్రామం చేస్తున్న సేవల్ని జేపీ ప్రశంసించారు. గుడ్లవల్లేరు లయన్స్ క్లబ్ సేవా కార్యక్రమాలను పరిశీలించారు. సింగలూరు గ్రామాన్ని అభివృద్ధి చేయటానికి హైదరాబాద్ నుంచి వచ్చిన డాక్టర్ బండారు శ్యాం కుమార్‌ను అభినందించారు. అక్కడ గ్రామీణ గ్రంథాలయం, కుటీర పరిశ్రమ, ఉచిత దంతవైద్య శిబిరం, ఆర్వో వాటర్‌ప్లాంట్ తదితరాలను సందర్శించారు. కార్యక్రమాల్లో కొసరాజు బాపయ్య, వల్లభనేని వెంకటసుబ్బారావు, పోలవరపు వెంకట్రావు, కొసరాజు వెంకటాద్రి, యలమంచిలి రాంబాబు, అన్నే రామారావు, జాస్తి సుబ్రమణ్యేశ్వరరావు, బండారు శ్యాం కుమార్, సరస్వతి, చిట్టి, పూర్ణచంద్రరావు, ఇతర పెద్దలు పాల్గొన్నారు. ❍

# ఆంధ్రప్రదేశ్ బడ్జెట్ 2017-18

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ బడ్జెట్‌కన్నా భారీగా, రెండు తెలుగు రాష్ట్రాల బడ్జెట్‌లు కలిపి రూ. 3,00,000 కోట్ల మార్క్ దాటేలా.. నూతన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2017-18 బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. గత ఏడాది కన్నా 15.71శాతం ఎక్కువ నిధులతో ఈ ఆర్థిక సంవత్సరానికి రూ. 1,56,999.40కోట్ల బడ్జెట్‌ను ఆర్థికమంత్రి యనమల రామకృష్ణుడు అసెంబ్లీకి సమర్పించారు. కేంద్రం పంథా మేరకు ప్రణాళిక, ప్రణాళికేతర చిట్టాలకు స్వస్తి చెప్పి.. ఆదాయం, వ్యయం పద్దులనే ప్రస్తావించారు.

రాజధానిని అమరావతికి తరలించటం, పెద్ద నోట్ల రద్దు వల్ల ఒడిదుడుకులు ఎదురయ్యాయని, జీఎస్టీ అమలు వల్ల కూడా కొంత తాత్కాలిక నష్టం వచ్చే అవకాశముందని మంత్రి అన్నారు. ఇప్పటికే 11.61శాతం వృద్ధి రేటుని సాధించామని, ఏటా 12శాతం వృద్ధి లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. వర్షపాతం లోటు ఉన్నా వ్యవసాయ దిగుబడులు బాగానే ఉన్నాయని, పండ్ల ఉత్పత్తిలో దేశంలోనే రెండో స్థానంలో నిలిచామని చెప్పారు. పారిశ్రామిక మౌలిక సదుపాయాలు, అభివృద్ధి కోసం ఏపీ ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్‌మెంట్ అథారిటీని త్వరలో ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. 2017-18ని ఈ-ప్రగతి సంవత్సరంగా చెబుతూ, 33 ప్రభుత్వ శాఖలు, 315 సంస్థలు, 745 సేవలను అనుసంధానించి ప్రజలకు ఉచిత సమాచారం అందిస్తామన్నారు. శాసనసభ నియోజకవర్గాల వారీగా జాబ్ మేళాలు నిర్వహిస్తామన్నారు. ప్రైవేటు సంస్థల ద్వారా 8 మెగా ఫుడ్ పార్కులను ఉత్తరాంధ్ర, రాయలసీమలో నెలకొల్పుతామని, కృష్ణపట్నంలో కోస్తా ఎకనామిక్ ఎంప్లాయ్‌మెంట్ జోన్ ఏర్పాటుకు ప్రయత్నాలు చేస్తున్నామని తెలిపారు.

కాగా, ఉపాధి కల్పించటంలో వైఫల్యాన్ని కప్పిపుచ్చుకునేందుకు సంక్షేమం, గ్రామీణం చుట్టూ పెద్దఎత్తున కేటాయింపులు జరిపినట్టు ఏపీ తాజా బడ్జెట్‌లో స్పష్టంగా కనిపిస్తుంది. ప్రత్యేక హోదా హామీ అమలులో భాగంగా రావాల్సిన పారిశ్రామిక పన్ను రాయితీలను కేంద్ర ప్రభుత్వం నుంచి సాధించుకోవటంలో విఫలమైన ప్రభుత్వం.. ఉపాధి అవకాశాలతో అందరికీ అభివృద్ధి విజన్‌ని కాకుండా యథాతథ స్థితిలోనే అందరికీ ఉపశమనం పంథాలో వ్యవహరించింది. బడ్జెట్‌లో అంకెలకన్నా భారీగా రాష్ట్రంలో అవినీతి, దోపిడీ

## బడ్జెట్ సమగ్ర స్వరూపం

(రూ. కోట్లలో)

| వివరం | 2015-16 | 2016-17 (స.అం) | 2017-18 (బ.అం) |
|---|---|---|---|
| రెవెన్యూ వసూళ్లు | 88,648 | 1,07,709 | 1,25,496 |
| మూలధన వసూళ్లు | 60,953 | 25,022 | 31,492 |
| మొత్తం వసూళ్లు | 1,49,601 | 1,32,731 | 1,56,988 |
| రెవెన్యూ వ్యయం | 95,950 | 1,12,306 | 1,25,912 |
| మూలధన వ్యయం | 14,172 | 14,178 | 21,959 |
| రుణాలు | 673 | 725 | 1,119 |
| మూలధన చెల్లింపులు | 38,640 | 5,555 | 8,009 |
| మొత్తం వ్యయం | 1,49,435 | 1,32,764 | 1,56,999 |
| రెవెన్యూ లోటు | 7,302 | 4,597 | 416 |
| ద్రవ్య లోటు | 21,863 | 19,163 | 23,054 |

(స.అం) : సవరించిన అంచనా (బ.అం) : బడ్జెట్ అంచనా

## వ్యవసాయ బడ్జెట్

రూ. 18,214కోట్లతో మంత్రి పత్తిపాటి పుల్లారావు ప్రత్యేక వ్యవసాయ బడ్జెట్‌ను ప్రవేశపెట్టినా ఈసారి రుణమాఫీ చెల్లింపులు, ఉచిత విద్యుత్ (రూ. 3300కోట్లు), ఉపాధి హామీ (రూ. 6,040కోట్లు)పోగా వ్యవసాయానికి నికరంగ మిగిలేది రూ. 5,274కోట్లే. అందులోనూ అనుబంధ రంగాలకుపోగా సహకార, మార్కెటింగ్ శాఖకు మిగిలేది రూ. 2,509కోట్లు. ఈ మొత్తంతోనే విత్తనాలు, రెయిన్‌గన్లు, పంటల బీమా ప్రీమియం, జీతభత్యాలు వంటివి నిర్వహించాలి. కేంద్రం 90శాతం మేర భరించే ఉపాధి హామీ నిధులు గత ఏడాది కంటే దాదాపు వెయ్యి కోట్లు పెరగటం వల్లే ఈ ఏడాది వ్యవసాయ బడ్జెట్ పెరిగింది తప్ప ప్రభుత్వం అదనంగా ఇచ్చిందేమీ లేదు.

## ప్రజల ఆదాయం పెరగటం లేదు

విద్యాప్రమాణాలలోనేకాదు, అక్షరాస్యతలో కూడా ఆంధ్రప్రదేశ్ దేశంలో వెనకబడి ఉందని సామాజిక ఆర్థిక సర్వే వెల్లడించింది. జాతీయ సగటుకన్నా దాదాపు 7 పాయింట్ల వెనకాల 67.35శాతం మాత్రమే అక్షరాస్యత ఏపీలో నమోదైంది. రాష్ట్రంలో అక్షరాస్యత రేటు దళితుల్లో 64.47శాతం, గిరిజనుల్లో 48.83శాతంగా ఉంది. జిల్లాలవారీగా చూస్తే సగటు అక్షరాస్యతలో పశ్చిమ గోదావరి జిల్లా 74.32శాతంతో అగ్రస్థానంలో ఉండగా, 58.89శాతంతో విజయనగరం అట్టడుగున ఉంది.

రాష్ట్ర ప్రజల తలసరి ఆదాయం రూ.1,22,376కోట్లు. గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే 13.14శాతం పెరిగింది.

ఏటేటా ధరలు పెరుగుతున్నాయే తప్ప వాటికనుగుణంగా ప్రజల ఆదాయం పెరగటం లేదని, కులవృత్తులను నమ్ముకున్నవారి ఆదాయం మరింత దిగజారిందని సర్వే తెలిపింది. 23 చేతి వృత్తులను పరిశీలించగా, ఏ వృత్తిదారులకూ ఆదాయం పెరగలేదు.

రాష్ట్రంలో పట్టణ జనాభా 24.13శాతం నుంచి 29.47శాతానికి పెరిగింది (2001 నుంచి 2011 మధ్య). అయితే జాతీయ సగటు 31.14తో పోలిస్తే ఏపీ వెనకబడే ఉంది. అత్యధికంగా పట్టణ జనాభా విశాఖపట్నంలో (47.45శాతం), కృష్ణా జిల్లాలో (40.81శాతం) ఉంది.

రాష్ట్రంలో రొయ్యలసాగు విస్తీర్ణం 1.17లక్షల హెక్టార్లకు చేరుకుంది. దేశంలో హెచ్ఐవీ బాధితులు 25లక్షలమంది ఉంటే, 3లక్షలమంది ఏపీలోనే ఉన్నట్టు అంచనా.

రాష్ట్రంలో అప్పులు రూ.1,92,984కోట్లు. అంటే రాష్ట్రంలో ప్రతి ఒక్కరిపై రూ.36,758 అప్పు ఉంది. ఇందులో మార్కెట్ రుణాలు 1,14,658కోట్లుగా ఉన్నాయి. వడ్డీల కింద ప్రభుత్వం ఈ ఏడాది రూ.12,208కోట్లు చెల్లించింది. వచ్చే ఆర్థిక సంవత్సరం ముగిసేనాటికి రాష్ట్రానికి 2,16,026.58కోట్ల మేర అప్పులు ఉంటాయని అంచనా. రాష్ట్ర స్థూల ఉత్పత్తి (జీఎస్‌డీపీ)లో ఇది 28.11శాతం. 2017-18 బడ్జెట్‌లో వడ్డీల చెల్లింపునకు రూ.14,768 కోట్లు, అసలుకు మరో 8వేల కోట్లు కేటాయించారు.

ఆహార భద్రత కింద రాష్ట్రంలో 2.88కోట్ల మంది లబ్ధి పొందుతున్నారని, అన్ని రకాల కార్డులు కలిపి 1,41,99,000 ఉన్నాయని, ఇంకా 1.41కోట్ల పేద కుటుంబాలు ఉన్నాయని సర్వే వెల్లడించింది.

మహిళల ఆర్థిక స్వావలంబనకు ఏర్పాటు చేసిన స్త్రీనిధి కింద గత ఏడాది రూ.415.81కోట్లు కేటాయిస్తే రుణ వసూళు 94శాతంగా ఉన్నాయని, రాష్ట్రంలోని 21,349 చౌకధరల దుకాణాల్లో ఈపోస్ విధానం వల్ల రూ.992కోట్లు ఆదా అయ్యాయని సర్వే తెలిపింది.

పెరుగుతున్నా.. ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజలకు హక్కుగా సేవలందించే 'పౌర సేవల' చట్టం వంటి ఏర్పాట్లను బడ్జెట్‌లో ఎక్కడా ప్రస్తావించలేదు. అమరావతిలో శాసనసభ భవనం కట్టటమే చరిత్ర అని ఒక బిల్డర్‌లా అనుకోకుండా, జనం జీవితాల్ని బాగు చేసే పౌర సేవల చట్టం వంటి గొప్ప శాసనంతో సభను ముఖ్యమంత్రి ప్రారంభించి ఉంటే చాలా అర్థవంతంగా ఉండేది.

ఎస్సీ, ఎస్టీలతోపాటు వెనకబడిన వర్గాలు (బీసీలు), అత్యంత వెనకబడిన వర్గాలు (ఎంబీసీలు), అగ్రవర్ణాల్లో పేదలకు ఈ బడ్జెట్‌లో కేటాయింపుల్ని పెంచారు. వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి, జలవనరులు, గృహనిర్మాణంకు గణనీయంగా కేటాయింపులు ఇచ్చారు. ఈ రంగాలకు గత బడ్జెట్‌లో సవరించిన అంచనాలపైన ప్రస్తుత బడ్జెట్‌లో రూ.9వేల కోట్లకు పైగా అధిక కేటాయింపులు జరిపారు. 2016-17 వాస్తవ బడ్జెట్ రూ.1,35,688కోట్లుకాగా, చివరి త్రైమాసికంలో వేసిన అంచనా రూ.1,32,764కోట్లు. గత ఏడాది గ్రామీణాభివృద్ధికి రూ.8482కోట్లు కేటాయించగా, సవరించిన అంచనా రూ.8491కోట్లు. విద్యాశాఖకు రూ.19,804కోట్లు కేటాయించగా, సవరించిన అంచనా రూ.18,864కోట్లు.

గ్రామీణాభివృద్ధికి రూ.19,565 కోట్లు కేటాయించారు.

రైతుల రుణమాఫీకి రూ. 3,600కోట్లు ప్రకటించారు. వ్యవసాయ, అనుబంధ రంగాలకు రూ. 9090.91కోట్లు కేటాయించారు. నీటి పారుదలకు రూ. 12,770కోట్లు ఇచ్చారు. ఇందులో పోలవరం ప్రాజెక్టుకే రూ. 7వేల కోట్లు కేటాయింపు చేశారు. ఈ నిధులను నాబార్డ్ నుంచి కేంద్రం రుణంగా తీసుకుని రాష్ట్రానికి ఇస్తుంది.

మద్యాన్ని ఆదాయమార్గంగా చేసుకోవటంతోపాటు కేంద్రం నుంచి భారీగా నిధుల్ని ఆశిస్తున్నట్టు బడ్జెట్ అంచనాల్లో పేర్కొన్నారు. కేంద్రం నుంచి ఈసారి అదనంగా రూ. 13వేల కోట్లు వస్తాయని, మొత్తం రూ. 66,687కోట్లు వస్తాయని ఆశిస్తున్నారు. ఇందులో పన్నులవాటా రూ. 29,139కోట్లు అనుకుంటున్నారు. రాష్ట్ర సొంత వనరుల ద్వారా కూడా ఈసారి భారీగా ఆదాయం వస్తుందని అంచనా వేశారు. అమ్మకం పన్నుల ద్వారా రూ. 39,321కోట్లు, ఎక్సయిజ్ సుంకం ద్వారా రూ. 5,886కోట్లు, వాహనపన్ను రూ. 2,950కోట్లు, స్టాంపులు, రిజిస్ట్రేషన్లు రూ. 4వేల కోట్లు వస్తాయని లెక్కేశారు. ఖజానాకు రూ. 416కోట్లు రెవెన్యూ లోటు, రూ. 23,054కోట్లు ఆర్థిక లోటు వస్తుందని అంచనా వేశారు.

ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ స్థానంలో ఆ కాంపొనెంట్ నిధుల వ్యయానికి ప్రత్యేక పద్దులను చూపించారు. 2017-18 బడ్జెట్‌లో ఎస్సీలకు రూ. 9,847కోట్లు, ఎస్టీలకు రూ. 3,528కోట్లు కేటాయించారు. దీని ద్వారా 39 శాఖలకు లబ్ధి చేకూర్చాలని ప్రతిపాదించారు.

బీసీ సంక్షేమ శాఖకు రూ. 5,013కోట్లు (మొత్తంగా బీసీలకకార్యక్రమాలకు రూ. 10,000కోట్లు ప్రకటించారు) కేటాయించారు. గత కేటాయింపుల కంటే ఇది వెయ్యి కోట్లు ఎక్కువ. ఇందులో గురుకుల పాఠశాలలు, కళాశాలలు, సహకార ఆర్థికాభివృద్ధి సంస్థకు కేటాయింపులు ఇవ్వటంతోపాటు బీసీ ఫెడరేషన్‌కు (రూ. 60కోట్లు), కుల (కృష్ణ బలిజ పూసల, మేదర, కుమ్మర శాలివాహన, నాయీ బ్రాహ్మణ, సగర/ఉప్పర, కల్లు గీతకారులు, వడ్డెర, విశ్వబ్రాహ్మణ, వాల్మీకి/బోయ, రజక, భట్రాజు తదితరులు) ఫెడరేషన్లకూ కేటాయింపులు జరిపారు.

కాపుల సంక్షేమానికి వెయ్యి కోట్లు ప్రకటించారు. బ్రాహ్మణ సంక్షేమ కార్పొరేషన్‌కు రూ. 75కోట్లు కేటాయింపు చేశారు.

విద్యాశాఖకు బడ్జెట్‌లో రూ. 21,108.48కోట్లు కేటాయించారు. ఇందులో పాఠశాల విద్యకు రూ. 17,952.44కోట్లు, ఉన్నత విద్యకు రూ. 2,391.04కోట్లు, సాంకేతిక విద్యకు రూ. 765కోట్లు ప్రకటించారు. ఈ రంగం కేటాయింపులో 90శాతం జీతభత్యాలు, ఖర్చులకే పోతుందని అంచనా.

వైద్య రంగానికి రూ. 7020.64కోట్లు (రెవెన్యూ, మూలధనం కలిపి) కేటాయించారు. ఇందులోనూ 85శాతం జీతభత్యాలకే పోతాయి.

నిరుద్యోగులకు భృతి కల్పించేందుకు రూ. 500కోట్లు కేటాయించారు. వివిధ దేశాల్లోని యూబీఐ (యూనివర్సల్ బేసిక్ ఇన్‌కం) కార్యక్రమాలను పరిశీలించి ఎస్సీ, ఎస్టీ కాంపొనెంట్, ఇతర పథకాల నుంచి నిధులను మళ్లించి విస్తరించాలని ప్రభుత్వం భావిస్తోంది.

**ఇంకొన్ని రంగాలకు కేటాయింపులు..**

**శాఖ కేటాయింపు (రెవెన్యూ సహా రూ.. కోట్లలో)**

| | |
|---|---|
| అటవీ పర్యావరణ సాంకేతిక | 383.69 |
| ఇంధన, మౌలిక వసతులు | 4,311.49 |
| పౌరసరఫరాలు | 3,463.29 |
| హోం | 5,221.32 |
| గృహనిర్మాణం | 1,456.55 |
| పరిశ్రమలు,వాణిజ్యం | 2,085.96 |
| ఐటీ, ఎలక్ట్రానిక్స్ | 364.48 |
| కార్మిక ఉపాధి | 432.06 |
| న్యాయ | 828.45 |
| మునిసిపల్, పట్టణాభివృద్ధి | 5,207.45 |
| మైనారిటీ సంక్షేమం | 840.26 |
| నైపుణ్య అభివృద్ధి | 397.98 |
| రవాణా, రహదారులు, భవనాలు | 4,041.76 |
| మహిళా,శిశు,దివ్యాంగులు, సీనియర్ సిటిజన్లు | 1,773.05 |
| యువజన సర్వీసులు, క్రీడలు | 1,410.04 |
| ఎంబీసీల సంక్షేమం | 60 |
| అన్న క్యాంటీన్లు | 200 |
| ఐటీ ఇన్నోవేషన్ | 100 |

❍

# తెలంగాణ బడ్జెట్ 2017-18

కులం బరిలో సంక్షేమ పథకాలు, కార్యక్రమాలకు రూ. 36,853.79కోట్ల కేటాయింపుతో తెలంగాణ ప్రభుత్వం 2017-18 ఆర్థిక సంవత్సరానికి రూ. 1,49,646.80కోట్ల బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. 2016-17 బడ్జెట్ (1.30లక్షల కోట్లు) అంచనాలు 14శాతం తగ్గి సవరించిన అంచనాలతో రూ. 1.16లక్షల కోట్లకు చేరగా, దానిపై 28శాతం పెంచి తాజా బడ్జెట్‌ను రూపొందించారు.

బీసీల్లోని ప్రతి వర్గానికీ/కులానికీ ప్రత్యేక పథకాలు, ఎస్సీ, ఎస్టీలకు ప్రత్యేక అభివృద్ధి నిధులు, ఎంబీసీలకు కార్పొరేషన్, మైనారిటీలకు కొత్తగా టీఎస్-ప్రైమ్, ఎస్సీ,ఎస్టీ,మైనారిటీ యువతులకు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్.. ఇలా ఈ ఏడాది తెలంగాణ బడ్జెట్ తొలి ప్రాధాన్యం సంక్షేమానికే ఇచ్చింది.

మొత్తం బడ్జెట్‌లో పథకాల వ్యయం రూ. 88,038 కోట్లు కాగా, నిర్వహణ వ్యయం రూ. 61,607.20కోట్లు. సంక్షేమ వ్యయాన్ని ప్రగతి పద్దుల్లో (గతంలో ప్రణాళికా వ్యయం) భాగంగా చూపారు. గత ఏడాది సవరించిన అంచనాలతో పోలిస్తే ఇది రూ. 15,003కోట్లు ఎక్కువ. కేవలం ఎస్సీ, ఎస్టీ, బీసీ శాఖలకే గత ఏడాది కంటే అదనంగా రూ. 7వేల కోట్లు కేటాయించారు. నిర్వహణ పద్దును మినహాయిస్తే.. ఎస్సీ సంక్షేమానికి రూ. 9,902కోట్లు, ఎస్టీ సంక్షేమానికి రూ. 5,719కోట్లు, బీసీ సంక్షేమానికి రూ. 4,765కోట్లు, మైనారిటీలకు రూ. 1,249.66కోట్లు కేటాయించారు. చిన్న తరహా పరిశ్రమలకు రూ. 17.52కోట్లు ఇచ్చారు. ప్రగతి పద్దుల్లో వృత్తిదారులకు ప్రాధాన్యం ఇచ్చారు. చేనేత చేయూతకు రూ. 1200కోట్లు, ఎంబీసీ కార్పొరేషన్‌కు వెయ్యి కోట్లు, రజక, నాయీ బ్రాహ్మణులకు చేయూతనివ్వటానికి రూ. 450కోట్లు కేటాయించారు. ఆ తర్వాత బడ్జెట్‌లో సాగునీటి రంగానికే ప్రభుత్వం ప్రాధాన్యత ఇచ్చింది. పథకాల వ్యయంలో ఈ రంగానికి రూ. 23,675.73కోట్లు కేటాయించింది.

'ప్రజలే ప్రభువులు' అంటూ రాష్ట్ర ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్ శాసనసభలో బడ్జెట్‌ను ప్రవేశపెడుతూ.. ఇంతవరకూ ప్రతి బడ్జెట్‌లో ఉన్న ప్రణాళిక, ప్రణాళికేతర పద్దుల స్థానంలో ఇక రెవెన్యూ, క్యాపిటల్ పద్దులు ఉంటాయని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ ఉప ప్రణాళిక స్థానంలో అభివృద్ధి నిధి ఉంటుందన్నారు. దీనివల్ల ఒక ఏడాది ఖర్చు చేయలేకపోయిన నిధులను తదుపరి సంవత్సరం ఖర్చు చేసే వీలుంటుందన్నారు. పెద్ద నోట్ల రద్దు ప్రభావం, కోర్టు వ్యాజ్యాల వల్ల భూముల అమ్మకాలు ఆశించినట్టు జరగకపోవటం వల్ల గత ఏడాది బడ్జెట్ అంచనాలు తప్పాయన్నారు. బంగారు తెలంగాణ సాధన కోసం గ్రామీణ

## తెలంగాణ బడ్జెట్ సమగ్ర స్వరూపం

బడ్జెట్ అంచనాలు 2017-18

| | వివరం | రూ.కోట్లలో |
|---|---|---|
| 1. | ప్రారంభ నిల్వ | 467.53 |
| 2. | రెవెన్యూ వసూళ్లు | 1,13,083.03 |
| | ఎ. కేంద్ర పన్నుల్లో వాటా | 17,005.00 |
| | బి. పన్ను ఆదాయం | 62,618.99 |
| | సి. పన్నేతర ఆదాయం | 6,601.36 |
| | డి. గ్రాంట్లు | 26,857.66 |
| 3. | మూలధన వసూళ్లు | 36,237.17 |
| | ఇ. బహిరంగ మార్కెట్ రుణాలు | 26,400.00 |
| | ఎఫ్. స్వల్పకాలిక రుణాలు | 100.00 |
| | జి. కేంద్ర ప్రభుత్వం నుంచి రుణాలు | 1,000.00 |
| | హెచ్. ఇతర రుణాలు | 1,880.00 |
| | ఐ. డిపాజిట్లు తదితరాలు | 1,050.00 |
| | జే. రుణాలు, అడ్వాన్సులు | 5,807.17 |
| | కే.ఇతర వసూళ్లు | - |
| | ఎల్. కంటింజెన్సీ నిధి | - |
| 4. | మొత్తం వసూళ్లు (2+3) | 1,49,320.20 |
| 5. | మొత్తం వ్యయం (ఎం+ఓ+పీ+క్యూ) | 1,49,645.98 |
| | ఎం. రెవెన్యూ వ్యయం | 1,08,511.73 |
| | ఎన్. ఇందులో వడ్డీ చెల్లింపులు | 11,138.60 |
| | ఓ. మూలధన వ్యయం | 30,929.94 |
| | పి. రుణాలు, అడ్వాన్సులు | 5,544.84 |
| | క్యూ. ప్రభుత్వ రుణం చెల్లింపులు | 4,659.47 |
| 6. | రెవెన్యూ మిగులు (2-ఎం) | 4,571.30 |
| 7. | ద్రవ్యలోటు (8-ఓ-పీ+జే) | -26,096.31 |

## నూటికి 54 మంది బతుకు 14.7శాతం వాటాతోనే

రాష్ట్రంపై అప్పుల భారం పెరిగి 2017-18లో ప్రతిపాదిత రుణాలతో కూడా కలుపుకుంటే అప్పు రూ. 1,40,523కోట్లకు చేరింది. అంటే తెలంగాణలో ప్రతి ఒక్కరిపై సుమారు 40వేల రూపాయల అప్పు ఉంటుంది. 2015-16 బడ్జెట్లో రుణాల మొత్తం జీఎస్‌డీపీలో 16.18శాతం ఉండగా, ఇప్పుడు 18.51శాతానికి పెరిగింది. వడ్డీ చెల్లింపులే రూ. 11,138.60 కోట్లకు పెరిగాయి. ఈ ఏడాది రాష్ట్ర బడ్జెట్‌లో పదిశాతాన్ని వడ్డీ చెల్లింపులకే కేటాయించారు.

తెలంగాణ రాష్ట్రం వృద్ధి రేటు 13.7శాతం మేర ఉందని సామాజిక, ఆర్థిక సర్వే తెలిపింది. ఇది జాతీయ వృద్ధి రేటు కంటే ఎక్కువ. 'లుకింగ్ బ్యాక్ అండ్ లుకింగ్ అహెడ్' పేరుతో ప్రణాళిక శాఖ విడుదల చేసిన ఈ సర్వే ప్రకారం.. 2016-17లో రాష్ట్ర స్థూల ఉత్పత్తి విలువ రూ. 6.54లక్షల కోట్లు. 2015-16లో ఇది రూ. 5.76లక్షల కోట్లు.

రాష్ట్రంలో 54శాతం మంది ప్రజలు ప్రాథమికరంగమైన వ్యవసాయం మీదే ఆధారపడుతున్నారు. ఈ రంగం ఈ ఏడాది వృద్ధిని నమోదు చేసినప్పటికీ జీఎస్‌డీపీలో వాటా 14.7శాతమే. అంటే నూటికి 54మంది రూపాయిలో 14.7పైసల వాటాతోనే బతుకుతున్నారు. సేవలరంగం వాటా 62శాతమైనా, ఉపాధి పొందుతున్నవారు 28శాతమే కావటం వల్ల వారికి వ్యవసాయరంగంలోని వారి కంటే అనేకరెట్లు ఎక్కువ ఆదాయం సమకూరుతోంది. రాష్ట్రంలో పనిచేసేవారిలో 31శాతం దినసరి కూలీలు, 23శాతం వ్యవసాయ కూలీలుగా పనిచేస్తుండగా, 11శాతం సొంతంగా వ్యవసాయం చేసుకుంటున్నారు. తెలంగాణలో పంటల ఉత్పత్తి వ్యయం గణనీయంగా పెరుగుతోంది. 2008-15 మధ్య కాలంలో రాష్ట్రంలో వరి సాగువ్యయం 52శాతం, మొక్కజన్న 92, పత్తి 150శాతం పెరిగాయి. కానీ మొక్కజన్న ధర గతేడాదితో పోలిస్తే 10శాతం కూడా పెరగలేదు.

అసంఘటిత రంగ కార్మికుల సంఖ్య 2.39కోట్లుకాగా, వీరిలో 37 లక్షల మంది దినసరి వేతనంపై బతుకుతున్నారు. పని లేని వారు 85.51లక్షలమంది ఉన్నట్టు అంచనా. రాష్ట్ర అవసరాలకు మరో 29.10 లక్షలమంది నిపుణులైన కార్మికులు అవసరం.

విద్యుత్, గ్యాస్, నీటి సరఫరా, ఇతర వినియోగ సేవల రంగంలో ఈ ఏడాది మైనస్ 2.4శాతం వృద్ధి రేటు ఉంది. పరిశ్రమల్లో ఉద్యోగాల కల్పనలో తెలంగాణ వాటా జాతీయస్థాయితో పోలిస్తే తక్కువగా ఉంది. దేశం మొత్తంలో 1,85,690 పరిశ్రమలుంటే, అందులో 5.96శాతం (11.068) తెలంగాణలో ఉన్నాయి. ఇక్కడ పారిశ్రామిక ఉపాధి సంఖ్య 7.45లక్షలు.

టీఎస్ ఐపాస్ విధానంలో ఆన్‌లైన్‌లో అన్ని రకాల అనుమతులు మంజూరు చేయటం ద్వారా రూ. 51,358కోట్ల పెట్టుబడులతో 3,327 యూనిట్ల ఏర్పాటుకు మార్గం సుగమమైంది. దీనివల్ల 2,12,033మందికి ఉపాధి అవకాశాలు వస్తాయని అంచనా.

అక్షరాస్యతలో తెలంగాణ జాతీయ సగటు కన్నా వెనకబడి ఉంది. రాష్ట్రంలో 66.5శాతం అక్షరాస్యత ఉండగా, జాతీయ శాతం 72.9గా ఉంది. స్త్రీ, పురుష నిష్పత్తి తెలంగాణలో 988గా ఉంది. దేశంలో అత్యధికంగా సిజేరియన్లు చేస్తున్న రాష్ట్రంగా (58శాతం) తెలంగాణ నమోదైంది.

రాష్ట్రం తలసరి ఆదాయం 12.6శాతం వృద్ధితో రూ. 1,58,360కు చేరుకుంది. ఇది జాతీయ తలసరి ఆదాయం (రూ. 1,03,818)కన్నా 52.54శాతం ఎక్కువ.

రాష్ట్రంలోని పిల్లల్లో 28.5శాతానికి పోషకాహారం అందటం లేదు. రాష్ట్ర ఆర్థికాభివృద్ధి హైదరాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి, మేడ్చల్ చుట్టూనే కేంద్రీకృతమవటం వల్ల ఇక్కడ తలసరి ఆదాయం వాటాయే జీఎస్‌డీపీలో 52శాతం ఉంది. హైదరాబాద్ తలసరి ఆదాయం రూ. 2,98,997 ఉండగా, కుమ్రం భీం అట్టడుగున రూ. 5,428 ఆదాయం కలిగివుంది.

జీవనోపాధుల చుట్టూ బడ్జెట్‌ను అల్లామని, రాష్ట్ర స్థూల ఉత్పత్తి (జీఎస్‌డీపీ)లో వ్యవసాయం వాటా రుణాత్మకం నుంచి గణనీయంగా పెరిగిందని అన్నారు. వచ్చే పంచాయతీ ఎన్నికల నాటికి గిరిజన తండాలు, గూడేలను గ్రామ పంచాయతీలుగా మారుస్తామన్నారు. ప్రతి నియోజకవర్గానికి ఒకటి చొప్పున 119 బీసీ గురుకుల పాఠశాలల్ని వచ్చే విద్యాసంవత్సరంలో ప్రారంభిస్తామన్నారు.

## రెవెన్యూ రాబడి

2017-18 బడ్జెట్‌లో రెవెన్యూ రాబడిని తెలంగాణ ప్రభుత్వం రూ. 1.13లక్షల కోట్ల మేర చూపింది. రాష్ట్ర పన్నులు, పన్నేతర ఆదాయాలు, కేంద్ర ప్రభుత్వ గ్రాంట్లు, కేంద్ర పన్నుల్లో వాటాలు కలుపుకుని ఈ రాబడిని అంచనా వేసింది. ఇందులో పన్నుల ఆదాయాన్ని రూ. 62,618.99కోట్లుగా చూపగా, పన్నేతర ఆదాయం రూ. 6,601.37కోట్లు. కేంద్ర పన్నుల్లో వాటా రూ. 17,005కోట్లు, గ్రాంట్స్ ఇన్ ఎయిడ్ కింద మరో రూ. 26,857కోట్లు వస్తాయని అంచనా వేసింది. ఈసారి రూ. 26,857కోట్ల మేర రుణ సేకరణ లక్ష్యాన్ని బడ్జెట్‌లో చూపింది. బడ్జెట్‌లో రెవెన్యూ మిగులును రూ. 4,571కోట్లుగా చూపారు. జీఎస్‌డీపీలో 3.5శాతం రుణ సేకరణ లక్ష్యానికనుగుణంగా ఈ మిగులును చూపారు. అయితే బడ్జెట్‌లో పెట్టుబడి వ్యయం రూ. 30,029కోట్లు మాత్రమే ఉండగా, రెవెన్యూ వ్యయాన్ని రూ. 1.08కోట్లుగా ఉంది. ద్రవ్యలోటు రూ. 26,096కోట్లుగా తెలిపారు.

50వేల కొత్త ఉద్యోగాలకభర్తీకి వీలుగా 5వేల కోట్ల రూపాయలను బడ్జెట్‌లో చూపారు. అంగన్‌వాడీలు, వీఆర్ఏలు, ఇతర ఉద్యోగుల కనీస వేతనాలు లక్ష్యంగా పెంచిన జీతాలను ఇవ్వనున్నారు.

బోధనా రుసుం, ఉపకార వేతనాల కింద 2017-18 అంచనాలకు తగినట్టుగా రూ. 2858.73 కోట్లు కేటాయించారు. అయితే గత ఏడాది బకాయిలకు రూ. 3200 కోట్లు అవసరం కావడంతో ఇవి ఆ బాకీలు తీర్చడానికి కూడా సరిపోవు. ప్రభుత్వం కొత్తగా ఏర్పాటుచేయనున్న గురుకులాలకనిర్మాణం, నిర్వహణకు రూ. 2340కోట్లు కేటాయించారు. విద్యాశాఖకు రూ. 12,705.72 కోట్లు ప్రకటించారు.

రేషన్ షాపుల ద్వారా నిత్యావసరాల్ని క్రమంగా తగ్గిస్తున్నప్పటికీ సబ్సిడీ బియ్యాన్ని కొనసాగించాలని ప్రభుత్వం భావిస్తున్నందున ఈ పథకానికి రూ. 2600కోట్లు కేటాయించారు. ఆరోగ్యాన్నిచ్చే ముతక బియ్యాన్ని కాకుండా పెద్దగా పోషకాలు లేని సన్నబియ్యాన్ని పాలనా సామర్థ్యానికి చిహ్నంగా ప్రభుత్వం భావిస్తుండటం విచిత్రం.

మునిసిపల్ శాఖకు రూ. 5599 కేటాయించినా ప్రగతి పద్దు మాత్రం రూ. 2869.22కోట్లు. ఉపాధి హామీ కింద రూ. 2746.02కోట్లు వస్తాయని అంచనా. పోలీసు శాఖకు రూ. 4,828.18 కోట్లు కేటాయించారు. బ్యాంకులు, హడ్కో రుణాలపై ఆధారపడిన మిషన్ భగీరథ, రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణానికి రూ. 3,000కోట్లను ప్రభుత్వం వైపు నుంచి కేటాయించారు.

తెలంగాణ సమాచార, పౌరసంబంధాల శాఖకు రూ. 335.80కోట్లను కేటాయించారు. ఇందులో ప్రగతి పద్దు రూ. 301.44కోట్లు. కొత్త ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వ పథకాల ప్రచారానికి రూ. 240కోట్లను ఇస్తున్నట్టు తెలిపారు.

వ్యవసాయానికి గతేడాది కంటే రూ. 816కోట్లు తక్కువగా రూ. 5,942కోట్లు కేటాయించారు. ఇందులోనూ 4వేల కోట్లు రుణమాఫీకే పోతుంది. అంటే, రైతులు తమ డబ్బే రుణమాఫీకి కట్టుకుంటారన్న మాట. రైతుకు మెరుగైన ఆదాయాన్నిచ్చేందుకు మార్కెట్ ధరల స్థిరీకరణ నిధి ఊసే లేదు.

గ్రేటర్ హైదరాబాద్‌కి రూ. 1000 కోట్లు, వరంగల్‌కి రూ. 300కోట్లు, మిగతా కార్పొరేషన్లకి రూ. 400 కోట్లు కేటాయించారు.

**బడ్జెట్‌లో ఇంకొన్ని శాఖలకు కేటాయింపులు..**

| శాఖ | ప్రగతి పద్దు (రూ., కోట్లలో) |
|---|---|
| వ్యవసాయ, సహకార | 4825.80 |
| వ్యవసాయ మార్కెటింగ్, సహకార | 462.88 |
| పశు సంవర్థక, మత్స్యశాఖ | 261.55 |
| మహిళ, శిశు, దివ్యాంగ, వృద్ధుల సంక్షేమం | 849.72 |
| విద్యుత్ | 3,583.64 |
| పర్యావరణ, అటవీ | 13.02 |
| పౌరసరఫరాలు | 1732.69 |
| వైద్య, ఆరోగ్య | 2,666.08 |
| ఉన్నత విద్య | 624.44 |
| గృహనిర్మాణ సంస్థ | 1952.14 |
| పరిశ్రమలు | 854.79 |
| సాంకేతిక, సమాచార, కమ్యూనికేషన్లు | 250.88 |
| మౌలిక వసతులు, పెట్టుబడులు | 15.25 |
| కార్మిక, ఉపాధి | 315.36 |
| న్యాయశాఖ | 57.99 |
| పురపాలక, పట్టణాభివృద్ధి | 2,869.22 |
| పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి | 12,832.32 |
| సెకండరీ ఎడ్యుకేషన్ | 2,058.27కోట్లు |
| రవాణా, రోడ్లు భవనాలు | 3321.59 |
| యువజన, పర్యాటక, సాంస్కృతిక | 198.03 |

# బడ్జెట్‌కూ కుల రంగా?

ఉపాధిని కులంతో ముడిపెట్టి రాష్ట్ర వార్షిక బడ్జెట్‌ను కుల బడ్జెట్‌లా రూపొందించటం తప్పుడు సంకేతాలనిస్తుందని లోక్‌సత్తా పార్టీ తెలంగాణ రాష్ట్ర విభాగం ధ్వజమెత్తింది. 2017-18 బడ్జెట్‌లో విద్య, ఆరోగ్యంకు కేటాయింపులు అరకొరగా ఉన్నాయని, మూడొంతుల నిధులు నిర్వహణకే పోతాయని పార్టీ ప్రధాన కార్యదర్శి జన్నేపల్లి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. అక్షరాస్యతలో తెలంగాణ జాతీయ సగటుకన్నా తక్కువగా ఉన్నా, నాణ్యమైన విద్య ఎనభై శాతం మంది పిల్లలకు అందకున్నా.. ప్రభుత్వం సరైన ప్రణాళికను రూపొందించలేదన్నారు. వైద్యం కోసం మారుమూల పల్లెల్లో ప్రజలు కూడా వేలకువేలు ఖర్చు చేస్తున్నా సమగ్ర ప్రజారోగ్య విధానం లేదన్నారు. తెలంగాణ వస్తే బతుకులు బాగుపడతాయని ఆశపడ్డ ప్రజలకు బార్లు, వైన్‌షాపుల లైసెన్సులు, కుల భవనాలు, సర్కారీ కార్యాలయాల్లో లంచాలు పెరగటం నిరాశకు గురిచేస్తోందన్నారు. అవినీతి నిరోధానికి.. ఏసీబీకి స్వయంప్రతిపత్తి కల్పించి లోకాయుక్తను బలోపేతం చేయటంతోపాటు ప్రభుత్వ కార్యాలయాల్లో హక్కుగా సేవలందించే 'పౌర సేవల' చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు.

**విభేదించినవారంతా ద్రోహులు కారు**

తన అభిప్రాయాలతో విభేదించినవారంతా తెలంగాణ ద్రోహులన్నట్టు ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు వ్యవహరించటం తగదని శ్రీనివాసరెడ్డి అన్నారు. తెరాస పార్టీని స్థాపించినప్పటి నుంచీ ప్రతి ప్రసంగంలో దళితుడినే ముఖ్యమంత్రిని చేస్తానని కేసీఆర్ చెప్పటం వాస్తవం కాదా? అధికార పార్టీ అలవోకగా మాట తప్పుతుందనటానికి ఇదొక్కటి చాలదా?.. అని ప్రశ్నించారు. మేం ఏం చేసినా చెలామణి అవుతుందనే ఏకపక్ష ధోరణిని వీడి తప్పిదాల్ని సరిదిద్దుకునేందుకు హేతుబద్ధ అభిప్రాయాలను, చర్చలను గౌరవించటం తెరాస ప్రభుత్వం అలవరచుకోవాలన్నారు. అసెంబ్లీలో ప్రతిపక్షమన్నదే ఉండకూడదన్నట్టు వ్యవహరించటం తగదన్నారు. జేఏసీ నేత కోదండరాంపై అంత కక్ష సాధించాల్సిన అవసరంలేదని, ఇలాంటి ధోరణులు, ధర్నా చౌక్‌లను తరలించటం వంటి చర్యలు కొనసాగితే రేపు ప్రజల పక్షాన పోరాటాలు ఏమవుతాయో ప్రజానీకం కూడా ఆలోచించాలని అన్నారు. ❍

# పౌర సేవల హక్కు చట్టం తేవాలి

సామాన్య ప్రజల్ని వేధిస్తూ వారి సొమ్ము దోచేస్తున్న ప్రభుత్వాధికారుల అవినీతికి అడ్డుకట్ట పడాలంటే హక్కుగా పౌర సేవలందించే చట్టాన్ని తీసుకురావాలని లోక్‌సత్తా 2.0 ఉద్యమ సంస్థ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల కన్వీనర్ బండారు రామ్మోహనరావు అన్నారు. ఇందుకోసం లోక్‌సత్తా 1998 నుంచీ కృషి చేస్తోందని, తెలంగాణలో ఈ చట్టం తెచ్చేందుకు కేసీఆర్ ప్రభుత్వం సుముఖత చూపటం ఆనందదాయకమని అన్నారు. హైదరాబాద్ దోమల్‌గూడలోని లోక్‌సత్తా కార్యాలయంలో పౌర సేవల చట్టంపై జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ కార్యాలయానికి వెళ్లిన ప్రతి పౌరుడి నుంచీ ఏదోకరూపంలో లంచం తీసుకుంటున్నారని మాజీ ఎమ్మెల్యే జనార్ధన్‌రెడ్డి అన్నారు. పౌర సేవల చట్టమే ఇందుకు విరుగుడని, ఇందుకోసం లోక్‌సత్తా చేస్తున్న కృషికి మద్దతిస్తామని అన్నారు.

ఈ సందర్భంగా జనబలం మాసపత్రిక ప్రత్యేక సంచికను విడుదల చేశారు. లోక్‌సత్తా ముషీరాబాద్ అధ్యక్షుడు అనమోలు రాఘవయ్య, నాయకులు కొంగర గంగాధర్, నందకుమార్, తెలుగుదేశం నాయకులు యాదగిరి గౌడ్, రంజన్ నాయుడు తదితరులు పాల్గొన్నారు. ❍


# ఫాగింగ్ దొంగలపై పోరు

హైదరాబాద్ నగర శివార్లలోని మీర్‌పేట్, జిల్లెలగూడ, బడంగ్‌పేట్, జల్‌పల్లి మునిసిపాలిటీలలో ఫాగింగ్ పేరిట ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని, దోమలు మాత్రం యధాతథంగా కుడుతున్నాయని లోక్‌సత్తా పార్టీ మహేశ్వరం నియోజకవర్గ ఇంఛార్జి తోడేటి ప్రసాద్ అన్నారు. ఫాగింగ్ చేయకున్నా.. రికార్డుల్లో చేసినట్టు చూపుతూ బిల్లులు స్వాహా చేస్తున్నారన్నారు. కొత్త మిషన్లు కొనే అవకాశమున్నా పాత వాటికి రిపేర్లు పేరుతో లక్షలు దోచేస్తున్నారన్నారు. సమాచార హక్కు చట్టం ద్వారా ఈ వివరాల్ని సేకరించామని, ఈ వ్యవహారాన్ని కలెక్టర్, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. ప్రతి ప్రజాసమస్యా పరిష్కారమయ్యేంత వరకూ పోరాటం ఆగదని, ఇందుకోసం లోక్‌సత్తా మార్క్ స్పష్టమైన విధానాలు, ప్రణాళికలతో కృషి చేస్తామని అన్నారు. ❍

# రోబో రాజకీయ నేతలకు బ్రిటన్ సై..

## 2015లోనే 'లోక్‌సత్తా టైమ్స్' హెచ్చరిక

మనిషి బదులు యంత్రాలు పనిచేసే ఆటోమేషన్ విప్లవం మిగతా అన్ని రంగాలలోకీ రావొచ్చుగానీ, రాజకీయాల్లోకి రావటం సాధ్యం కాదని చాలామంది అభిప్రాయం. రోబో శాస్త్రవేత్తలు కూడా ఇలాగే అనుకున్నారు. అన్ని రంగాలనూ ప్రభావితం చేసే రాజకీయాలలో సమర్థత, నిబద్ధత గల ఆలోచనాపరులు ఉండాలన్న మన అంతర్లీన అభిప్రాయమే ఇందుకు కారణం. అయితే రాజకీయాలు భ్రష్టు పట్టిపోతుంటే, సమాజంలో వనరులున్నవారు కూడా పట్టించుకోవటం మానేస్తే, సృజనాత్మక పరిష్కారాలు చూపగలవారికి రాజకీయాల్లో ఎదిగే అవకాశాలు లేకపోతే.. చివరికి రోబోలు ఈ రంగంలోకి కూడా ప్రవేశిస్తాయని లోక్‌సత్తా గతంలోనే హెచ్చరించింది.





రాజకీయాలను ప్రక్షాళన చేసుకుని సమర్థత, నిజాయతీ గలవారు ఎన్నికయ్యే వ్యవస్థను నిర్మించుకోకపోతే రాబోయే కాలంలో రోబోలు (కృత్రిమ మేధస్సు యంత్రాలు) భారత రాజకీయాల్లోకి వస్తాయని 'సాంప్రదాయ రాజకీయ నేతలకు సవాల్ రోబో లీడర్లు' శీర్షికతో లోక్‌సత్తా టైమ్స్ 2015లోనే (డిసెంబర్ 16-31) ముఖచిత్ర కథనాన్ని ప్రచురించింది (ఫోటోలో చూడొచ్చు). ప్రజలకు ఏం కావాలో, విధానాలు ఎలా ఉండాలో ఫీడ్ చేస్తే, మాట తప్పకుండా మడమ తిప్పకుండా 24 గంటలూ రోబోలు అదే పనిలో ఉంటాయి కాబట్టి.. సాంప్రదాయ నాయకుల అవినీతి, విభజన, వంశపారంపర్య రాజకీయాలతో విసిగివేసారిన ప్రజలు రోబో నాయకులే బెటరని మొగ్గు చూపుతారని, లంచగొండి ప్రభుత్వోద్యోగులకు బదులు కూడా రోబోలు ఉండాలని డిమాండ్ చేస్తారని ఈ కథనం వాదిస్తుంది. డబ్బులిచ్చి మోసాల మధ్య కృత్రిమ కార్యకర్తలను మెయింటెయిన్ చేసే బదులు కృత్రిమ మేధ గల రోబో కార్యకర్తలను ఏర్పాటు చేసుకుంటే తేలికని పార్టీలు కూడా భావిస్తాయని లోక్‌సత్తా టైమ్స్ కథనం విశ్లేషించింది. తాజాగా మన ప్రజాస్వామిక వ్యవస్థకు మాతృకయిన బ్రిటన్ దేశపు రాజధాని లండన్‌లో జరిగిన ఓ సర్వే కూడా ఇదే విషయాన్ని ధృవీకరించింది. పార్లమెంటులోకి రోబోలు ప్రవేశించే రోజు రాబోతోందని మూడింట రెండొంతుల మంది బ్రిటన్ పౌరులు అభిప్రాయపడగా, ఈ మార్పు వచ్చే రెండు మూడేళ్లలోనే వస్తుందని 16శాతం మంది అన్నారు. తాము ఎన్నుకున్న చట్టసభ సభ్యులకన్నా రోబోలే మెరుగ్గా పనిచేస్తాయని 26శాతం మంది తేల్చిచెప్పారు. తుది నిర్ణయం మానవ నేతల చేతిలో ఉంటే రోబోలు రాజకీయాల్లోకి రావటానికి తమకేం అభ్యంతరం లేదని ఇంకొందరు చెప్పారు. రోబోలు రాని, రాకూడని రంగం రాజకీయమే అని ఇప్పటిదాకా భావించామని, కానీ బ్రిటన్‌లో రాజకీయ నాయకుల పట్ల గౌరవం సన్నగిల్లుతుండటం వల్ల ప్రజలు రోబోల పట్ల మొగ్గు చూపుతున్నారని, ఇది భవిష్యత్తులో పెనుమార్పులకు దారి తీసే అవకాశముందని సర్వే చేసిన ఓపెన్ టెక్స్ట్ సంస్థ ప్రతినిధి తెలిపారు. సమర్థత ఉంటే వయసు, నేపథ్యంతో సంబంధం లేకుండా ఎవరికైనా అవకాశాలు కల్పిస్తామని కేమరాన్ వంటి యువ నాయకులను ప్రధానమంత్రిని చేయటం ద్వారా నిరూపించిన బ్రిటన్‌లోనే పరిస్థితి ఇలా ఉంటే, అథమస్థాయి రాజకీయ నాయకత్వం, వంశపారంపర్య రాజకీయాలు, తాత్కాలిక తాయిలాలు తప్ప పరిష్కారాలు చూపని పాలనా సంస్కృతి ఉన్న మనదేశంలో చేజేతులా రోబోలకు ఇంకా త్వరగా అవకాశమివ్వచ్చుంటే కాదనగలమా?

సరైన నాయకులు ఎన్నికయ్యే వ్యవస్థను నిర్మించుకుని మంచి రాజకీయం తెచ్చుకోవటమా? రోబోలకు అవకాశం ఇవ్వటమా?.. మనం తేల్చుకోవాల్సిన సమయం ఆసన్నమైంది. ❍

# గ్రంథాలయాల డబ్బు ఎగ్గొడుతున్న పాలకులపై లోక్‌సత్తా 'పిల్'

"పుస్తకాలు చదవటం విద్యకు కొనసాగింపు, నాగరికతకు చిహ్నం, కొత్త రాజకీయ సంస్కృతిలో భాగం" అని భావించే లోక్‌సత్తా అందుకోసం గ్రంథాలయాలను పటిష్టం చేయటాన్ని కూడా ఓ కార్యక్రమంగా కొనసాగిస్తోంది. ఈ క్రమంలోనే 2016లో లోక్‌సత్తా పార్టీ యువకార్యకర్తల బృందం గ్రంథాలయాల పరిస్థితి ఎలా ఉందో తెలుసుకునేందుకు హైదరాబాద్‌లోని ప్రభుత్వ లైబ్రరీలను సందర్శించింది. జీహెచ్‌ఎంసీ వాళ్లు చూపిస్తున్న 88 లైబ్రరీల్లో అనేకం గత కొన్నేళ్లలో మూతపడ్డాయి లేదా నామమాత్రంగా ఉన్నాయని ఈ పరిశీలనలో తేలింది. అసలు ఎన్ని లైబ్రరీలు పనిచేస్తున్నాయో జీహెచ్‌ఎంసీ వద్దే సరైన సమాచారం లేదు. ఆస్తి పన్నులో 8శాతాన్ని లైబ్రరీ సెస్సుగా మన నుంచి వసూలు చేసిన జీహెచ్‌ఎంసీ (2016నాటికే ఇది రూ.424కోట్ల దాకా ఉంది).. ఆ డబ్బును లైబ్రరీలకు ఇవ్వలేదు. ఇదేరీతిలో తెలంగాణలోని పలు మునిసిపాలిటీలు వ్యవహరిస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు, అధికారాలు ఇవ్వకుండా తమను చిన్న చూపు చూస్తున్నట్టే తాము ప్రజలకందించాల్సిన గ్రంథాలయాలు వంటి కీలక సేవలకు గండికొడుతున్నామన్న రీతిలో స్థానిక ప్రభుత్వాలు వ్యవహరిస్తున్నాయి. లైబ్రరీల పట్ల జీహెచ్‌ఎంసీ నిర్వాకాన్ని సిటీ సెంట్రల్ లైబ్రరీలో సర్వే



- 6 - - 75/A

GOVERNMENT OF TELANGANA
DEPARTMENT OF PUBLIC LIBRARIES
PARTICULARS OF LIBRARY CESS DUES FROM MUNICIPALITIES AND GRAMPANCHAYATS IN 10 DISTRICTS IN TELANGANA STATE

| No | Name of the District | Total Cess dues up to 29-02-2016 (Rupees in Crores) |
|---|---|---|
| 1 | Adilabad | 4.01 |
| 2 | Hyderabad (up to 2013-14) | 301.70 |
| 3 | Karimnagar | 4.87 |
| 4 | Khammam | 4.09 |
| 5 | Medak | 3.78 |
| 6 | Mahabubnagar | 0.40 |
| 7 | Nalgonda | 8.56 |
| 8 | Nizamabad | 7.39 |
| 9 | Ranga Reddy | 40.15 |
| 10 | Warangal | 5.75 |

Sd/-
DIRECTOR OF PUBLIC LIBRARIES



చేస్తుండగా లోక్‌సత్తా యూత్ తీసిన ఈ చిత్రాల్లో చూడవచ్చు. వీటిని చూసి అవాక్కవకుండా పరిష్కారం కోసం లోక్‌సత్తా ప్రయత్నం ప్రారంభించింది. ప్రజా గ్రంథాలయాల బాగు కోసం స్థానిక యువతను వారాంతాల్లో సమీకరిస్తుండటంతోపాటు, లోక్‌సత్తా యువ నేతల్లో కొందరు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో సొంత డబ్బుతో లైబ్రరీలను నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి చొరవ చూపిన లోక్‌సత్తా నేత నరసింహ దొంతినేని, తదితరులు ప్రభుత్వ పన్ను దోపిడీ, గ్రంథాలయాల్లో అవినీతిపై ఇటీవల హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. ❍

# సైబర్ నేరాలను ఆపే విధానాలే ప్రభుత్వం వద్ద లేవు

వినియోగదారుల హక్కుల పరిరక్షణ చట్టం అమల్లోకి వచ్చి 30ఏళ్లయినా ప్రజల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని పాలకులు, అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని బాబ్జీ అన్నారు. దీని వల్ల కల్తీ సరకులు, మందుల బారినపడి పలువురు నష్టపోతున్నారన్నారు. ఇప్పుడు పెరిగిపోతున్న సైబర్ దోపిడీ నుంచి వినియోగదారుల్ని కాపాడటానికి ప్రభుత్వం వద్ద పరిష్కారాలే లేవన్నారు. ఏదో బండి నడుస్తుందన్నట్టు వ్యవహరిస్తోందన్నారు. ప్రపంచ వినియోగ హక్కుల




దినోత్సవం సందర్భంగా పౌర వేదిక విజయనగరం జిల్లా కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో సంస్థ అధ్యక్ష హోదాలో ఆయన మాట్లాడారు. పన్నులు చెల్లిస్తున్న ప్రజలకు తగిన సేవలందించకపోవటం కూడా వినియోగ హక్కుల ఉల్లంఘన కిందకే వస్తుందని, అందువల్ల హక్కుగా పౌర సేవలందించేందుకు లోక్‌సత్తా రూపొందించిన 'పౌర సేవల' చట్టాన్ని అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమావేశంలో పౌరవేదిక ఉపాధ్యక్షుడు ఎల్‌కే జైన్, గౌరవ అధ్యక్షుడు ఎంఎస్ కామేశ్వరరావు, బి. అంకారావు తదితరులు పాల్గొన్నారు. ❍

# పౌర సేవల చట్టంతోనే రోజువారీ అవినీతిని ఆపగలం



ప్రభుత్వానికి పన్నులు కట్టే ప్రజలు కూడా వినియోగదారులేనని, వారికి ప్రభుత్వ కార్యాలయాల్లో లంచాలు, వేధింపులు లేకుండా సకాలంలో పౌరసేవలు అందించటానికి హక్కుగా 'పౌర సేవల' చట్టం తీసుకురావాలని లోక్‌సత్తా పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు డా॥ పాండురంగారావు, లోక్‌సత్తా 2.0 ఉద్యమ సంస్థ తెలుగు రాష్ట్రాల కన్వీనర్ బండారు రామ్మోహనరావు డిమాండ్ చేశారు. వినియోగదారుల దినోత్సవాలు వస్తూ పోతున్నాయిగానీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు స్థానిక ప్రభుత్వాల ద్వారా పన్నులు కడుతున్న ప్రజలకు మాత్రం అవినీతి కష్టాలు తప్పటం లేదన్నారు. 'ఓటు వేసి ప్రభుత్వాన్ని ఎన్నుకునేది మనమే, మన పన్నుల డబ్బుతోనే ప్రభుత్వాలు నడుస్తున్నాయి' అనే స్పృహను ప్రజల్లో కలిగించటానికి, పౌర సేవల చట్టాన్ని కేంద్రంలో, రాష్ట్రాల్లో సాధించటానికి లోక్‌సత్తా కృషి చేస్తోందన్నారు. పౌర సేవల చట్టాన్ని లోక్‌సత్తా రూపొందించిందని, దీన్ని వివిధ కార్యక్రమాల ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్తున్నామన్నారు. ఒక ప్రైవేటు కార్యక్రమంలో పాల్గొనేందుకు సిద్దిపేట జిల్లా మర్కూక్ మండలం ఎర్రవల్లి గ్రామానికి వచ్చిన లోక్‌సత్తా పార్టీ, ఉద్యమ నేతలు మీడియాతో మాట్లాడారు. కులాలకు భవనాలు, కార్పొరేషన్లు, వృత్తులకు మొక్కుబడిగా నిధులు ఇస్తే యువతకు ఉపాధి రాదని, వృత్తి నైపుణ్యాలను ఆధునీకరించి మార్కెట్ సదుపాయాల్ని కల్పించాలని వారు అన్నారు. క్షేత్రస్థాయిలో ప్రజలు కొత్త ఆలోచనలతో సమస్యల్ని పరిష్కరించుకునేందుకు వీలుగా అధికారాన్ని వికేంద్రీకరించాలన్నారు. లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జన్నేపల్లి శ్రీనివాస్‌రెడ్డి, కార్యదర్శి నిఖిల్ తదితరులు పాల్గొన్నారు. ❍

# రాయితీలు లేని ప్యాకేజీ దండగ




పారిశ్రామిక రాయితీలు లేని ప్రత్యేక ప్యాకేజీ వల్ల ఆంధ్రప్రదేశ్‌కు ఉపయోగం లేదని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ స్పష్టం చేశారు. విజయవాడలోని పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. రాయితీలు ప్రత్యేక హోదాలో భాగమని, అవి లేకుండా రాష్ట్రం అభివృద్ధి చెందదని పలుమార్లు చెప్పిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇప్పుడు ప్యాకేజీకి ఎందుకు రాజీపడ్డారో చెప్పాలన్నారు. హోదా ఇస్తామని ప్రధానమంత్రి పార్లమెంట్‌లో ఇచ్చిన హామీనే నెరవేర్చలేదు కాబట్టే ప్యాకేజీకి చట్టబద్ధత అని చెప్పుకోవాల్సి వస్తోందని ఎద్దేవా చేశారు. హోదా, ప్యాకేజీ.. పేరు ఏదైనా ఆంధ్రప్రదేశ్‌కి పారిశ్రామిక రాయితీల్ని సాధిస్తేనే యువతకు ఉపాధి, రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. లేకుంటే అమరావతి చుట్టుపక్కలకే అన్నీ పరిమితమవుతాయన్నారు. కేంద్రంలో చాలా పలుకుబడి ఉందని చెప్పుకునే చంద్రబాబు ఇతర రాష్ట్రాల మద్దతును కూడగట్టి పారిశ్రామిక రాయితీలపై కేంద్రాన్ని ఒప్పించాలన్నారు. కేవలం మంత్రివర్గ నిర్ణయంతో ఈ రాయితీల్ని ఇవ్వొచ్చన్నారు. రాష్ట్రంలోని వెనకబడిన ఉత్తరాంధ్ర, రాయలసీమ జిల్లాలకైనా ఈ రాయితీల్ని సాధించాలని, ఇతర రాష్ట్రాల్లోనూ వెనకబడిన జిల్లాలకు ఇచ్చినా మనకు అభ్యంతరం అక్కర్లేదని అన్నారు. ఇప్పటివరకూ కేంద్రం నుంచి వచ్చిన రూ. 10,461 కోట్లను ఖర్చు చేసిన వివరాలను శ్వేతపత్రంగా ప్రకటించాలన్నారు. తొలిసారి రాజధాని అమరావతి బడ్జెట్‌ను ప్రవేశపెట్టటం అభినందనీయమని, రాష్ట్రంలో పెద్దఎత్తున సాగుతున్న అవినీతి అంతానికి 'పౌర సేవల' చట్టంతో అసెంబ్లీని ప్రారంభించి ఉంటే నిజంగా చరిత్రాత్మకమయ్యేదని అన్నారు. బడ్జెట్‌లో నిరుద్యోగ భృతికి కేటాయింపులు చేయటానికి బదులు పారిశ్రామిక రాయితీలతో పెద్దఎత్తున ఉపాధి మీద దృష్టి పెట్టివుంటే యువతకు కొంత మేలు జరిగేదన్నారు. జీతభత్యాలకు తగ్గట్టు కేటాయింపులు తప్ప విద్య, ఆరోగ్య ప్రమాణాల గురించి బడ్జెట్‌లో ప్రస్తావన లేదన్నారు. సమావేశంలో లోక్‌సత్తా పార్టీ స్టీరింగ్ కమిటీ సభ్యుడు ఎం. భానుప్రసాద్, గౌరీశంకర్, గాంధీ, చందు శ్రీనివాస్, నాగార్జునరావు, సురేష్, శ్రీనివాసరావు తదితర నాయకులు పాల్గొన్నారు. ❍

# దేశం చర్చించాలి: జేపీ




**భా**రతదేశానికున్న భిన్నత్వం, సంక్లిష్టతలు, విశాలత దృష్ట్యా సమస్యల పరిష్కారానికి అన్ని వర్గాల మధ్య హేతుబద్ధ చర్చల సంస్కృతిని పెంపొందించాల్సుందని, రాజ్యాంగ నిర్మాత డా॥ అంబేద్కర్ ఆశించినది కూడా ఇదేనని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. కానీ అత్యున్నత సభలైన పార్లమెంట్, అసెంబ్లీల్లోనే అవసరమైన చర్చలు చేయకుండా ఒకరినొకరు తిట్టుకోవటం, కొట్టుకోవటం చేస్తున్నారన్నారు. ప్రజాప్రతినిధులే ఇలా గాడితప్పటం వల్ల తప్పుడు సంకేతాలు వెళ్తూ దేశంలో పరిస్థితులు మరింత దిగజారుతున్నాయన్నారు. పరిణతితో కూడిన విశ్లేషణాత్మక చర్చలకు యువత పెద్దఎత్తున ముందుకు రావాలని జేపీ పిలుపునిచ్చారు. అవినీతి, అసమానతలపై ప్రశ్నిస్తూ యువత పరిష్కారాలలో భాగమైతే దేశ సుస్థిరాభివృద్ధికి ఢోకా ఉండదన్నారు.

నరేంద్ర మోదీ ప్రభుత్వం ప్రకటించిన పెద్ద నోట్ల రద్దు (డీమానిటైజేషన్) ఆశించిన లక్ష్యాల్ని సాధించగలిగిందా? నల్లధనం, నకిలీ నోట్లు, తీవ్రవాదం తగ్గాయా? నల్లధనాన్ని, నకిలీ నోట్లను నిర్మూలించటానికి ఇక ముందు ఏం చేయాలి? 'అర్థ క్రాంతి' ప్రతిపాదన ఆచరణ సాధ్యమేనా?.. తదితర అంశాలతోపాటు, 'కేంద్ర-రాష్ట్ర సంబంధాలపై నరేంద్ర మోదీ ఎన్డీయే ప్రభుత్వ పాలన ప్రభావం'పై న్యూఢిల్లీ రఫీ మార్గ్‌లోని కాన్‌స్టిట్యూషన్ క్లబ్ ఆఫ్ ఇండియాలో జరిగిన చర్చా కార్యక్రమానికి జేపీ అధ్యక్షత వహించారు. ఓటర్స్ అలయెన్స్ సంస్థ ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది.

## ప్రభుత్వ కార్యాలయాల్లో లంచాలు యథాతథంగానే కొనసాగుతున్నాయి

దేశంలో పై నుంచి కింది దాకా ప్రభుత్వ కార్యాలయాల్లో




ప్రజల్ని లంచాలతో పీడిస్తున్నా అవినీతి అంతానికి తగిన చర్యలు కొరవడుతున్నాయని జేపీ ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ అన్నారు. ఇది దేశాభివృద్ధికి పెద్ద ప్రతిబంధకంగా మారిందన్నారు. పెద్ద నోట్ల రద్దు చేసినా సర్కారీ కార్యాలయాల్లో లంచాలు ఆగలేదన్నారు. అవినీతిపై పోరు చేస్తున్నానంటున్న ప్రధాని నరేంద్ర మోదీ మాటలకే పరిమితం కాకుండా.. కనీసం 1000మంది అవినీతి అధికారులను పదవి నుంచి రిటైర్ చేసి ఇంటికి పంపించి అక్రమార్కులకు బలమైన సంకేతం ఇవ్వాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజలకు నిర్ణీత గడువులోగా హక్కుగా పనులు చేసిపెట్టేందుకు 'పౌర సేవల' చట్టం తీసుకురావాలన్నారు. అవినీతి నిరోధక చట్టంలో అమాయక పౌరుల్ని వేధించే నిబంధనల్ని తొలగించాలన్నారు. రాజకీయ ఏకాభిప్రాయం సాధిస్తూ ఎన్నికల సంస్కరణల్ని అమలు చేయాలన్నారు. ❍












# మోదీ ప్రభుత్వం ప్రజల విశ్వాసాన్ని వమ్ముచేయని ఎన్నికల సంస్కరణల్ని తీసుకురావాలి : జేపీ

'రాజకీయ విరాళాల సేకరణలో పారదర్శకతపై భారత్ నీతి ఆధ్వర్యంలో న్యూఢిల్లీ కాన్‌స్టిట్యూషన్ క్లబ్‌లో జరిగిన చర్చా కార్యక్రమంలో లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ కీలకోపన్యాసం ఇచ్చారు. కేంద్ర ఆర్థికశాఖ సహాయమంత్రి అర్జున్ రాం మేఘావల్, ఎన్నికల మాజీ ప్రధానాధికారి టీఎస్ సంపత్, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి మురళీధర్ రావు, రాజకీయ, పాలనా, సామాజిక రంగాలకు చెందిన పలువురు ఆలోచనాపరులు కూడా ఇందులో పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణ, పార్టీల నిధులలో పారదర్శక, నీతివంతమైన రాజకీయాలకే బీజేపీ ప్రయత్నిస్తోందని మురళీధర్‌రావు ఈ సందర్భంగా అన్నారు.

జేపీ మాట్లాడుతూ.. ప్రాచుర్య రాజకీయ పార్టీలు తమకు ఏటా రూ. 1000 కోట్లు విరాళాలు వచ్చాయని చూపుతూ, ఐదేళ్లలో లోక్‌సభ నుంచి పంచాయతీ వరకు జరిగే ఎన్నికలలో రూ. 1 లక్ష కోట్ల వరకు ఖర్చు చేస్తున్నాయని అన్నారు. ఆ తర్వాత ఇందుకు పదింతలు దండుకుంటున్నాయన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం మీద ప్రజలకు నమ్మకం ఉందని, ప్రజల విశ్వాసాన్ని వమ్ము చేయకుండా ఎన్నికల సంస్కరణల్నీ తీసుకురావాలని అన్నారు. ఓట్ల కొనుగోలు పెద్ద సమస్యగా ఉన్న దేశంలో ఒకేసారి ఎన్నికలు, పార్టీల విరాళాలు వంటి అంశాలకే సంస్కరణల్ని పరిమితం చేయటం వల్ల పెద్దగా ఫలితం ఉండదన్నారు. రాష్ట్రాల్లో దామాషా ఎన్నికల పద్ధతి, ముఖ్యమంత్రుల ప్రత్యక్ష ఎన్నిక వంటి ఎన్నికల సంస్కరణల్నీ తీసుకురావాలని అన్నారు.

Posting Date 07-04-2017
RNI.Reg. No. APTEL/2010/32219 Postal Reg. No. HD/1126/2016-18 Published on April1st, 2017

# ఎవరన్నారు లోక్ సత్తాకు ప్రజా బలం లేదని ?



**2003 లో కోటి 8 లక్షల సంతకాలతో స్థానిక ప్రభుత్వాల సాధికారత కోసం లోక్ సత్తా ఉద్యమించింది.**

**దేశ చరిత్ర లో.కులం.మతం.ప్రాంతం అని ప్రేరేపించకుండా , ఉద్రేకాలు రెచ్చగొట్టకుండా చేసిన ఉద్యమం మరొకటి లేదు .**

## నిజాలు మాట్లాడుకుందాం-17

షేర్ చేయండి . ప్రజలకు నిజాలు చేరవేయండి

Book-Post
PRINTED MATTER

To

If not delivered please return to:

Lok Satta Times
Tulips Apartment,
6-3-655, Flat.No. 407,
Behind Civil Supplies Office,
Somajiguda
Hyderabad- 500082

Edited, Printed & Published at Hyderabad by Dr. Jayaprakash Narayan, Flat No. B. 504, Pasha Court, Somajiguda, Hyderabad - 500 082, Printed at Kala Jyothi Process Pvt., Ltd., 1-1-60/5, RTC"X" Roads, Hyderabad